జాతీయ తెలుగు దినపత్రిక

# ప్రజాపాలన

NEWS IS RIGHT

Published from Hyderabad, Vishakhapatnam, Vijayawada*

https://prajapalana.com/epaper.php

చదవండి... చదివించండి... చందాదారులుగా చేరండి...
జాతీయ తెలుగు దినపత్రిక
ప్రజాపాలన
న్యూస్ ఈజ్ రైట్
6-2-29/3/12, 3వ అంతస్థు,
దౌలత్ ప్లాజా, లక్డీకాపూల్, హైదరాబాద్ - 004
వివరాలకు సంప్రదించండి : 8886022523

సంపుటి 15 సంచిక 104 విశాఖపట్నం | బుధవారం 29 డిసెంబరు 2021 | 8 పేజీలు | వెల : 5.00




## సినిమా టికెట్లపై ప్రభుత్వం కీలక నిర్ణయం..

అమరావతి : సినిమా టికెట్ల ధరల విషయం రోజు రోజుకు అనేక మలుపులు తిరిగుతుంది. సినిమాటిక్ సినిమా పెద్దలు ఈ విషయం పై ప్రభుత్వం తో చర్చించడానికి ప్రయత్నిస్తున్నారు. సామాన్యుడికి అందుబాటులో ఉండేలా సినిమా టికెట్ ధరలు ఉండాలంటుంది ఏపీ ప్రభుత్వం.. అలా అయితే సినిమాకు నష్టాలు వస్తాయని అంటున్నారు సినీపెద్దలు. దీనిపై ప్రభుత్వం పునరాలోచించాలని అని కోరుతున్నారు. ఇదిలా ఉంటే నేడు ఏపీ మంత్రి పేర్ని నానితో **(మిగతా 2లో..)**

# లంచాలకు తావులేదు: జగన్



అమరావతి: అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నామని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. సంక్షేమ పథకాల్లో అర్హత ఉండి మిగిలిపోయిన వారికి మంగళవారం ఆయన నగదు జమ చేశారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ ఈ రోజు మరో మంచి కార్యక్రమానికి శ్రీకారం చుడుతున్నామని.. 9,30,809 మందికి వారి ఖాతాల్లో రూ. 703 కోట్లను జమచేస్తున్నామని తెలిపారు. "గతంలో పథకాలకోసం ప్రజలు ఎదురుచూసేవారు. ఇప్పుడు ప్రజలనే నేరుగా వెతుక్కుంటూ పథకాలు వస్తున్నాయి. ఈ పథకాలు అమలు చేసేటప్పుడు మనం కులం, మతం, ప్రాంతం, రాజకీయాలు చూడ్డం లేదు. అర్హత ఉంటే చాలు, సంక్షేమ పథకాలు అందరికీ దక్కుతాయన్న కోణంలోనే ప్రతి అడుగూ వేస్తున్నాం. ఇంకా ఎక్కడైనా అర్హులైన ఉండి కూడా దరఖాస్తు చేసుకోలేకపోవడమో, అర్హత నిర్ధారణలో జరిగిన పొరపాట్లవలనో, నిర్ణీత సమయంలోగా దరఖాస్తు చేసుకోకపోవడంవల్లో, బ్యాంకు ఖాతాలు సరిగ్గా లేపోవడం వల్లో ఇలా ఏ కారణాలు అయినా సరే అర్హులందరికీ కూడా సంక్షేమ పథకాలు అందనట్టు అయితే అటువంటి వారు అందరూ కూడా మిస్‌కాకూడదనే ఉద్దేశంతో ఈ కార్యక్రమం చేపడుతున్నామని" సీఎం పేర్కొన్నారు.

ఇది గొప్ప విప్లవాత్మక మార్పు: "గతంలో ప్రభుత్వాలు.. ఎలా కత్తిరించాలి.. అనిఆలోచించేవి. ఎవరూ మిగిలిపోకూడదు, అర్హులకు అందరికీ అందలాన్న తపన, తాపత్రయం ఈ ప్రభుత్వంలో ఉంది. దేశంలో తొలిసారిగా మిస్ అయిన వారికి కూడా ఒక అవకాశం ఇచ్చి, వారికి కూడా నెలరోజుల్లోపు దరఖాస్తులు చేసుకోమని చెప్పి, పరిశీలనలు చేసి వారిక్కూడా రావాల్సిన డబ్బును అందిస్తున్నాం. పెన్షన్‌లు, రేషన్‌కార్డులు, ఇతర పథకాల లబ్ధిదారులను తీసుకున్నా.. గత ప్రభుత్వంతో కంటే లబ్ధిదారుల సంఖ్యలో కాని, వారికి ఇస్తున్న మొత్తం లోగాని విపరీతమైన మార్పు ఉంది. విప్లవాత్మకంగా ఈ మార్పునకు శ్రీకారం చుట్టడం జరిగింది. **(మిగతా 2లో..)**

# కాన్పూర్ మెట్రోలో ప్రధాని మోదీ..



కాన్పూర్: ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఉత్తరప్రదేశ్‌లోని కాన్పూర్ నగరంలో పర్యటిస్తున్నారు. కాన్పూర్‌లోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ 54వ (ఐఐటి కాన్పూర్) స్నాతకోత్సవంలో ప్రధాని మోదీ ప్రసంగించారు. అనంతరం కాన్పూర్ మెట్రో రైలు ప్రాజెక్ట్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రధాని మోదీ, ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ మెట్రోలో ప్రయాణించారు. దీంతోపాటు ప్రధాని మోదీ బినా పంకీ మల్టీప్రొడక్ట్ పైప్‌లైన్ ప్రాజెక్ట్ విభాగాన్ని కూడా ప్రారంభించారు. కాన్పూర్ పట్టణ ప్రాంతంలో పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా రవాణా వ్యవస్థను మెరుగుపర్చేందుకు కేంద్రం శ్రీకారం చుట్టింది. కాన్పూర్ మెట్రో రైలు ప్రాజెక్ట్ మొత్తం 9 కి.మీ పొడవు ఐఐటి కాన్పూర్ నుండి మోతీ జీల్ వరకు విస్తరించి ఉంది. అయితే, కాన్పూర్ మెట్రో రైలు ప్రాజెక్టు మొత్తం పొడవు 32 కి.మీ. ఇది రూ. 11,000 కోట్లకు పైగా వ్యయంతో అభివృద్ధి చేస్తున్నారు. ప్రస్తుతం దేశంలోనే అత్యంత వేగవంతమైన మెట్రో ప్రాజెక్టుగా కాన్పూర్ మెట్రో అవతరించిందని ప్రధాని మోదీ పేర్కొన్నారు. అంతకుముందు కాన్పూర్ ఐఐటీ స్నాతకోత్సవంలో ప్రధాని మోదీ విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు. రాబోయే యుగం విద్యార్థులకు సువర్ణవకాశమని ప్రధాని మోదీ పేర్కొన్నారు. భారతదేశం ప్రపంచంలో రెండవ అతిపెద్ద **(మిగతా 2లో..)**

# 36 వేల మందికి ఉద్యోగాలు

## ఏపీలో దిగ్గజ ఫార్మా కంపెనీ భారీ పెట్టుబడులు..



అమరావతి: ఏపీలో దిగ్గజ ఫార్మా కంపెనీ భారీగా పెట్టుబడులు పెట్టనుంది. ఆ మేరకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌తో సన్ ఫార్మా ఒప్పందం కుదుర్చుకుంది. ఈ ఫార్మా కంపెనీ ఏర్పాటుతో దాదాపు 36 వేల మందికి పైగా ఉద్యోగ అవకాశాలు రానున్నాయి. పరోక్షంగా భారీ సంఖ్యలో ఉపాధి అవకాశాలు పొందనున్నారు. సన్‌ఫార్మా ఇంటిగ్రేటెడ్ ఎండ్ టూ ఎండ్ తయారీ ప్లాంట్ ఏర్పాటు చేయనుంది. మంగళవారం రాష్ట్ర క్యాంప్ కార్యాలయంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌తో సన్‌ఫార్మా అధినేత దిలీప్ షాంఘ్వీ కంపెనీ ఏర్పాటు లాంఛనాలపై చర్చలు జరిపారు. అనంతరం ప్లాంట్ ఏర్పాటుపై ప్రకటన చేశారు. రాష్ట్ర సమగ్రాభివృద్ధి, పర్యావరణ హిత విధానాలపై ముఖ్యమంత్రి జగన్ ప్రత్యేక దృష్టి సారిస్తున్నారని, ఆయన ఆలోచనలు నన్ను ముగ్ధుడ్నిచేశాయని దిలీప్ షాంఘ్వీ అన్నారు. కాగా, జనరిక్ ఫార్మా రంగంలో ప్రపంచంలోనే నాలుగో పెద్ద కంపెనీగా ప్రత్యేక గుర్తింపు ఉంది. అయితే హెల్త్‌కేర్ రంగంలో హైక్వాలిటీ మెడిసిన్ తక్కువ ధరలకే తయారు చేసే కంపెనీ ఇది. 100కు పైగా దేశాల్లో సన్‌ఫార్మా మందులను వినియోగిస్తున్నారు.

# ఆంధ్ర ప్రదేశ్ సహా 5 రాష్ట్రాలకు కేంద్రం శుభవార్త!




న్యూఢిల్లీ : ప్రధాన మంత్రి ఆవాస్ యోజన (పట్టణ)లో భాగంగా 5 రాష్ట్రాల్లో 1.07 లక్షల ఇళ్ళ నిర్మాణానికి వచ్చిన ప్రతిపాదనలను కేంద్ర ప్రభుత్వం డిసెంబరు 23న ఆమోదించింది. ఈ ఇళ్ళ నిర్మాణాలను వేగవంతం చేయాలని ఆంధ్ర ప్రదేశ్, మధ్య ప్రదేశ్, మహారాష్ట్ర, పుదుచ్చేరి, ఉత్తరాఖండ్ ప్రభుత్వాలను కోరింది. ఈ వివరాలను ప్రభుత్వం డిసెంబరు 24న విడుదల చేసిన ప్రకటనలో తెలిపింది. సెంట్రల్ శాంక్షనింగ్ అండ్ మానిటరింగ్ కమిటీ (సీఎస్ఎంసీ) సమావేశం డిసెంబరు 23 గురువారం జరిగింది. కేంద్ర గృహ నిర్మాణ, పట్టణ వ్యవహారాల శాఖ కార్యదర్శి దుర్గా శంకర్ మిశ్రా ఈ సమావేశానికి అధ్యక్షత వహించారు. పీఎంఏవై(యూ) క్రింద 1.07 లక్షల గృహాల నిర్మాణ ప్రతిపాదనలను ఈ సమావేశం ఆమోదించింది. ఈ ఇళ్ళను ఆంధ్ర ప్రదేశ్, మధ్య ప్రదేశ్, మహారాష్ట్ర, పుదుచ్చేరి, ఉత్తరాఖండ్‌లలో నిర్మిస్తారు. ఇతర రాష్ట్రాల్లో పీఎంఏవై(యూ) అమలును దుర్గా శంకర్ మిశ్రా ఈ సమావేశంలో సమీక్షించారు. ఈ మంత్రిత్వ శాఖ వెల్లడించిన వివరాల ప్రకారం, ఈ పథకం క్రింద ఇప్పటి వరకు 1.14 కోట్ల ఇళ్ళను మంజూరు చేశారు. వీటిలో 91 లక్షల ఇళ్లు నిర్మాణ దశలో ఉన్నాయి. 53 లక్షలకుపైగా ఇళ్ల నిర్మాణం పూర్తయింది, వాటిని లబ్ధిదారులకు అందజేశారు. ఈ పథకం క్రింద పెట్టిన మొత్తం పెట్టుబడి రూ. 7.52 లక్షల కోట్లు కాగా, దీనిలో కేంద్ర ప్రభుత్వ వాటా రూ. 1.85 లక్షల కోట్లు. ఇప్పటి వరకు రూ. 1.14 లక్షల కోట్లను కేంద్ర ప్రభుత్వం విడుదల చేసింది.

## నాపై తెలుగు ప్రజలు చూపిన ప్రేమానురాగాలు ఎన్నటికీ మర్చపోలేనివి: లేఖలో సీజే ఎన్వీ రమణ



అమరావతి: భారత ప్రధాన న్యాయమూర్తి ఎన్వీ రమణ ఏపీలో మూడు రోజుల పర్యటనలో భాగంగా పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ప్రధాన న్యాయమూర్తిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత తొలిసారిగా ఆయన సొంత గ్రామానికి బయలుదేరి వివిధ ప్రారంభోత్సవాలను, కార్యక్రమాలలో పాల్గొన్నారు. ఆయన రాకతో ఏపీ ప్రజలు భారీ ఎత్తున స్వాగతం పలికారు. పూల వర్షం కురిపించారు. ఈ నేపథ్యంలో మూడు రోజుల పర్యటన ముగిసిన తర్వాత తెలుగు ప్రజలకు లేఖ రాశారు. ఆయనకు స్వాగతం పలికిన తీరుపై ఆనందం వ్యక్తం చేశారు. ఎన్నో రోజుల తర్వాత సొంత రాష్ట్రంలో పర్యటించడం తన లేఖలో పేర్కొన్నారు. న్యాయమూర్తి ఎన్వీ రమణ మాటల్లో..ఎప్పటి నుంచో అనుకుంటున్నాను.. ఒకసారి మా ఊరు పొన్నవరం వెళ్లి రావాలని. అయినవాళ్లందరినీ పలకరించి రావాలని అనుకున్నాను. సుప్రీం కర్టుకు శీతాకాలం సెలవులు ప్రకటించడంతో నా ఆలోచన అమల్లో పెట్టే అవకాశం దొరికిందని తన లేఖలో పేర్కొన్నారు. భారత ప్రధాన న్యాయమూర్తిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత తొలిసారి ఈనెల 24వ తేదీ ఉదయం ఎంతో ఉత్సకతతో స్వగ్రామానికి సకుటుంబ సమేతంగా బయలుదేరాను. గరికపాడు దగ్గర ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో కాలు మోపాను. ఆంధ్ర ప్రజలు నా కోసం బారులు తీరారు. స్వాగత వచనాలతో, నినాదాలతో పూల వానతో, అపారమైన ప్రేమానురాగాలతో ముంచెత్తిన తీరు నేనూ ఎన్నటికీ మర్చిపోలేను.. నా కుటుంబ సభ్యులూ ఎప్పటికీ మర్చిపోలేరు అంటూ చెప్పుకొచ్చారు. బంధుత్వాలకంటే మిత్ర బంధానికే పెద్ద పీట వేసే పొన్నవరం ఊరు ఊరంతా తరలి వచ్చి నన్ను, నా కుటుంబ సభ్యులను ఎడ్ల బండిపై పొలిమేరల నుంచే ఊరేగింపులా తీసుకెళ్లారు. **(మిగతా 2లో..)**



## నాపై తెలుగు ప్రజలు చూపిన ప్రేమానురాగాలు

## ఎన్నటికీ మర్చపోలేనివి: లేఖలో సీజే ఎన్వీ రమణ

(మొదటి పేజీ తరువాయి)

మూలాలు మరువరాదని బలంగా విశ్వసించే నేను.. మా ఇద్దరు కుమార్తెలకు, ఇద్దరు అల్లుళ్లకు, ఇద్దరు చిన్నారి మనుమరాళ్లకు తొలిసారి నా ఊరు చూపించగలగడం ఎంతో సంతృప్తి కలిగింది. పొన్నవరం వీధుల్లో నడుస్తుంటే చిన్ననాటి జ్ఞాపకాలు తరుముకొచ్చాయి. ఆప్తులు ఎందరో చాలా కాలం తర్వాత నన్ను కలిశారు. భావోద్వేగం కట్టలు తెంచుకుంది. 'అబ్బాయ్ రమణా' అని పెద్దలు పలకరించిన వైనం నన్ను పులకరింపజేసింది. నా ఊరి ప్రయాణం వార్త బయటకు పొక్కగానే ఎన్నో ఆహ్వానాలు అందాయి. అందులో కొన్ని మాత్రమే అమోదించగలిగాను. రాష్ట్ర గవర్నర్, రాష్ట్ర ముఖ్యమంత్రి భారత ప్రధాన న్యాయమూర్తి హోదాలో రాజధాని ప్రాంతంలో నా తొలి పర్యటన పురస్కరించుకుని అతిథ్యమిచ్చారు. వారికీ, రాష్ట్ర ప్రభుత్వానికి, తేనీటి విందుకు హాజరైన పెద్దలు, ప్రముఖులు, మంత్రులు, అధికారులందరికీ కృతజ్ఞతలు అంటూ తెలిపారు జస్టిస్ ఎన్వీ రమణ. ప్రజాప్రతినిధులు, రాజకీయ, సామాజిక పక్షాల ప్రతినిధులు ఎందరో నన్ను పకలరించేందుకు వచ్చారు. అందరికీ ధన్యవాదాలు అంటూ లేఖలో తెలిపారు. న్యాయవాద వృత్తిలో నాకు నడక నేర్పిన 'బెజవాడ బార్ అసోసియేషన్' ఇంకా 'ఆంధ్రప్రదేశ్ హైకోర్టు బార్ అసోసియేషన్', 'ఆంధ్రప్రదేశ్ హైకోర్టు ఉద్యోగుల సంఘం' రోటరీ క్లబ్ విజయవాడ అతి స్వల్ప వ్యవధిలో అసాధారణమైన ఏర్పాట్లతో నన్నూ, నా సతీమణి శివమాలనూ సత్కారాలతో ముంచెత్తారు. కొందరు పొరుగు రాష్ట్రం తెలంగాణ నుంచి తరలి వచ్చి ఈ కార్యక్రమాల్లో పాల్గొన్నారు. శ్రీ లావు వెంకటేశ్వర్లు స్మారక ఉపన్యాసం ఇవ్వడానికి నన్ను ఎంపిక చేసిన సిద్ధార్థ న్యాయ కళాశాలకు, హాజరైన వారందరికి ధన్యవాదాలు తెలిపారు. ఈ పర్యటనలో నా వెంట ఉన్న సుప్రీం కోర్టు న్యాయమూర్తులు, ఏపీ, తెలంగాణ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తులు చూపించిన గౌరవం, అభిమానం చెప్పుకోలేనిది. న్యాయ వ్యవస్థ పట్ల, న్యాయమూర్తుల పట్ల తెలుగు ప్రజలు చూపిన గౌరవం చూసి వారెంతో సంతోషించారు. నా నుంచి ఏమి ఆశించకుండా స్వంత పనులన్నీ మానుకొని గంటల తరబడి వేచి ఉన్నారు. అలాగే భవ్య దర్శనం కల్పించిన విజయవాడ శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి దేవస్థానం, పొన్నూరు శ్రీ వీరాంజనేయ స్వామి దేవస్థానం, చందోలు శ్రీబగళాముఖీ అమ్మవారి దేవస్థానం, ఇంకా మా ఊరి ఆలయాల పాలక మండళ్లకు హృదయ పూర్వక ధన్యవాదాలు తెలిపారు. అలాగే క్రిస్మస్ పర్వదినం రోజున ఆశీర్వాదాలు అందించిన క్రైస్తవ మత పెద్దలకు కృతజ్ఞతలు తెలిపారు. 24వ తేదీన హైదరాబాద్‌లో బయలుదేరింది మొదలు ఏపీ సరిహద్దు వరకు తిరిగి ఈ వేళ సరిహద్దు నుంచి హైదరాబాద్ చేరే వరకు సకల సదుపాయాలు కల్పించిన తెలంగాణ పోలీసు సిబ్బందికి, తెలంగాణ ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలుపుతున్నానని న్యాయమూర్తి ఎన్వీ రమణ తన లేఖలో పేర్కొన్నారు. సమయాభావం వల్ల ఎందరినో కలవడం లేదని, మరోసారి అందరిని కలిసే అవకాశం త్వరలోనే వస్తుందని ఆశిస్తున్నానని అన్నారు. తెలుగు ప్రజల ఆశీర్వాద బలమే నన్ను ఈ స్థాయికి చేర్చింది. మీ ఆశీర్వాదాలు ఇలాగే కొనసాగాలని కోరుకుంటున్నా.. అంటూ సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి ఎన్వీ రమణ తన 'లేఖ'లో పేర్కొన్నారు.

### ఆర్థిక ఎమర్జెన్సీ విధించే సమయం దగ్గరలోనే ఉంది: సుజనా

అమరావతి: ఏపీ అప్పుల ఊబిలో కూరుకుపోయిందని ఎంపీ సుజనాచౌదరి అన్నారు. రాష్ట్రంలో ఆర్థిక ఎమర్జెన్సీ విధించే సమయం దగ్గర్లో ఉందన్నారు. ఏపీలో ఆటవిక రాజ్యం నడుస్తోందని ఆయన మండిపడ్డారు. ప్రజలను సీఎం జగన్‌రెడ్డి మోసం చేస్తున్నారని మండిపడ్డారు. ఇసుక, మద్యం, మైనింగ్ పేరుతో దోచుకుంటున్నారని ఆరోపించారు. మద్య నిషేధం పేరుతో ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కుడి చేత్తో పథకాలకు ఇచ్చి ఎడమ చేత్తో లాక్కుంటున్నారని విమర్శించారు. అలాగే ఓటీఎస్ పేరుతో ప్రజలను ఇబ్బందులు పెడుతున్నారని పేర్కొన్నారు. రాష్ట్రాభివృద్ధి కోసం కాకుండా కేసుల మాఫీ కోసమే ఢిల్లీ చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారని వ్యాఖ్యానించారు.

# లంచాలకు తావులేదు: జగన్

(మొదటి పేజీ తరువాయి)

టీడీపీ హయాంలో పెన్షన్ల రూపంలో ఎన్నికలకు 2 నెలలముందు వరకూ కేవలం రూ.1000లు మాత్రమే ఇచ్చేవారు. అది కూడా ఎన్నికలకు 6 నెలలకు ముందు వరకూ కేవలం 39 లక్షలమందికి, నెలకు రూ.400 కోట్లు ఇచ్చేవారు. ఇవాళ 61లక్షల పెన్షన్లకు పెంచాం. పెన్షన్‌ను రూ.2250లకు పెంచాం. రూ.1450 కోట్లు నెలకు కేవలం పెన్షన్లకోసమే ఖర్చు చేస్తున్నాం. ఎవ్వరూ ఇబ్బంది పడకూడదని తెల్లవారుజామునే వాలంటీర్ వచ్చి గుడ్‌మార్నింగ్‌చెప్పి.. చేతిలో పెన్షన్ పెట్టబోతున్నారు. ఈ ఒకటో తారీఖు నుంచి రూ.2500కు పెంచబోతున్నాం. గతంలో పథకాలను ఎగ్గొట్టేందుకు, లంచాలు గుంజేందుకు జన్మభూమి కమిటీలు పెడితే... గ్రామ సచివాలయాలను ఏర్పాటు చేసి సోషల్‌ఆడిట్ ద్వారా అర్హులందరికీ న్యాయం ఇవాళ న్యాయం జరుగుతుంది. గతంలో ఆత్మాభిమానం చంపుకుని వృద్ధులు, వికలాంగులు పెన్షన్లకోసం తిరిగే వారు. వివక్ష లేకుండా, లంచాలకు తావు లేకుండా అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ న్యాయం చేస్తున్నాం. కోవిడ్ వల్ల ప్రభుత్వ రాబడి తగ్గినా, ఖర్చులు పెరిగినా పేదలకు అండదండలు అందించేందుకు మన ప్రభుత్వం అడుగులు ముందుకేసిందని" సీఎం అన్నారు.

వివిధ పథకాల్లో మిస్ అయిన వారికి ఇవాళ ఇస్తున్న ప్రయోజనాలు ఇవీ:

వైఎస్సార్ చేయూత కింద 2,50,929 మందికి రూ. 470.40 కోట్లు ఇవాళ అందిస్తున్నాం
వైఎస్సార్ ఆసరా కింద 1,136 మందికి రూ. 7.67 కోట్లు ఇస్తున్నాం
వైఎస్సార్ సున్నావడ్డీ కింద మహిళలకు 59,661 మందికి రూ. 53,51కోట్లు అందిస్తున్నాం
వైఎస్సార్ సున్నావడ్డీ పంటరుణాలు కింద 2019-20 ఏడాది కింద 62,622 మందికి రూ. 9.01కోట్లు, ఖరీఫ్ 2020 కింద 58,821 మందికి 10.06 కోట్లు ఇస్తున్నాం
వైఎస్సార్ రైతు భరోకకింద 2,86,059 మందికి రూ. 58.89 కోట్లు ఇస్తున్నాం
జగనన్న విద్యా దీవెన కింద 31,940 మందికి రూ.19.92 కోట్లు ఇస్తున్నాం
వైఎస్సార్ వసతి దీవెన కింద 43,010 మందికి రూ. 39.82 కోట్లు ఇస్తున్నాం
వైఎస్సార్ కాపు నేస్తం కింద 12,983 మందికి రూ.19.47 కోట్లు ఇస్తున్నాం
వైఎస్సార్ వాహన మిత్ర కింద 8,080 మందికి రూ.8.09 కోట్లు ఇస్తున్నాం
వైఎస్సార్ మత్స్యకార భరోసా కింద 3,788 మందికి రూ. 3,79 కోట్లు ఇస్తున్నాం
వైఎస్సార్ నేతన్న నేతన్న నేస్తం కింద 794 మందికి రూ.1.91 కోట్లు అందిస్తున్నాం
ఇవికాక 90 రోజుల్లో ఇళ్లపట్టాలు 1,10,986 కు ఇస్తున్నాం

ఇవికాకుండా 1,51,562 లక్షల మందికి పెన్షన్‌కార్డులు ఇస్తున్నాం, ఏప్రిల్ 2021 నుంచి ఇచ్చిన పెన్షన్‌కార్డులు కలుపుకుంటే 4,96,059 మందికి పెన్షన్‌కార్డులు ఇచ్చాం. బియ్యంకార్డులు 3,07,599 మందికి ఇస్తున్నాం. ఆరోగ్యశ్రీ కార్డులు 1,14,129 మందికి ఇస్తున్నాం. డిసెంబర్ నుంచి మే వరకూ అమలైన పథకాల్లో అర్హత ఉండి మిస్ అయిన వారికి జూన్ లోనూ, అలాగే జూన్ నుంచి నవంబర్ వరకూ అమలైన పథకాల్లో మిస్ అయిన వారికి డిసెంబర్‌లోనూ అందించే కార్యక్రమాన్ని ఇవాళ ప్రారంభిస్తున్నామని" సీఎం వైఎస్ జగన్ పేర్కొన్నారు.

## కాన్పూర్ మెట్రోలో ప్రధాని మోదీ..

(మొదటి పేజీ తరువాయి)

స్టార్టప్ హబ్‌గా అవతరించిందని.. ఈ ఘటన ప్రధానంగా ఐఐటీల నుంచి వచ్చిన విద్యార్థుల సహాయంతో సాధించినట్లు ప్రధాని మోదీ తెలిపారు. కాలేజీ నుంచి బయటకి అడుగు పెట్టగానే విద్యార్థులు విజయానికి షార్ట్‌కట్‌లతో ఆలోచిస్తారన్నారు. చాలా మంది కంఫర్ట్ కోసం అన్వేషిస్తారని.. కంఫర్ట్ కంటే ఛాలెంజ్ ఎంచుకోవాలని సూచించారు. సవాళ్లను ఎదుర్కొని వాటిని సమర్థవంతమైన పరిష్కారాలతో అధిగమించే వారే అత్యున్నత శిఖరాలను అధిరోహిస్తారన్నారు. నేడు మన చుట్టూ సాంకేతికత ఉన్నప్పటికీ.. మనం మానవులమని మరచిపోకూడదంటూ ప్రధాని మోదీ సూచించారు. మనకు మనం రోబో వెర్షన్‌లుగా మారకూడదని.. కృత్రిమ మేధస్సును అన్వేషించాలన్నారు. ఎప్పుడూ మానవ మేధస్సును విస్మరించకూడదంటూ ప్రధాని మోదీ విద్యార్థులకు సూచించారు. అంతకుముందు ఐఐటి కాన్పూర్ 54వ స్నాతకోత్సవ వేడుకలో.. సీఎం యోగి మాట్లాడుతూ.. స్వావలంబన భారత్ దృక్పథాన్ని సాకారం చేయడానికి 2020లో కొత్త జాతీయ విద్యా విధానాన్ని అమలులోకి తీసుకొచ్చినట్లు వెల్లడించారు. %××u% కాన్పూర్ విద్యార్థులు దేశ, విదేశాల్లో ఉన్నారంటూ పేర్కొన్నారు.

## సినిమా టికెట్లపై ప్రభుత్వం కీలక నిర్ణయం..

(మొదటి పేజీ తరువాయి)

డిస్ట్రిబ్యూటర్స్ భేటీ అయ్యారు. ఈ భేటీలో సినిమా టికెట్ ధరల విషయంలో వారి ప్రతిపాదనను వినిపించారు. ఈ భేటీలో సినిమా టికెట్ల రేట్లు పెంచాలన్నది డిస్ట్రిబ్యూటర్ల ప్రతిపాదన. వాళ్లు ఎక్కడ, ఎంత పెంచాలని కోరెంటే.. కార్పొరేషన్లలో ఏసీ థియేటర్లలో అత్యధికంగా రూ.150, అలాగే లోయర్ క్లాస్‌లో రూ. 50లు ఉండాలని డిస్ట్రిబ్యూటర్లు కోరారు. అలాగే ఇతర ప్రాంతాల్లో ఏసీ థియేటర్లలో అత్యధికంగా రూ.100, లోయర్ క్లాస్‌లో రూ.40లు ఉండాలని కోరారు. ఇక కార్పొరేషన్‌లో నాన్ ఏసీలో అత్యధికంగా రూ. 100, లోయర్ క్లాస్‌లో రూ.40 ఉండాలని, నాన్ ఏసీలో ఇతర ప్రాంతాల్లో రూ. 80, రూ.30 ఉండాలని కోరారు డిస్ట్రిబ్యూటర్లు. అయితే సినిమా టికెట్ల అంశంపై ఏపీ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. టికెట్ల ధరల పరిశీలనకు కొత్త కమిటీని నియమించింది ప్రభుత్వం. ఈ కమిటీకి హోంశాఖ ముఖ్యకార్యదర్శి విశ్వజిత్ ఛైర్మన్‌గా వ్యవహరించనున్నారు. ఇక ఈ కమిటీలో సభ్యులుగా థియేటర్ల యజమానులు, డిస్ట్రిబ్యూటర్లు, సినీ గోయర్స్ అసోసియేషన్ ప్రతినిధులు ఉంటారు. టికెట్ల అంశంపై పూర్తి సర్వే నిర్వహించి ప్రభుత్వానికి నివేదిక అందించనుంది ఈ కమిటీ..

## ఏడాది ముగింపు క్యాంపెయిన్‌కు మెరుపులు జోడించిన రెడ్‌బస్

విజయవాడ, ప్రజాపాలన ప్రతినిధి : క్రిస్మస్, నూతన సంవత్సరానికి ముందుగా, భారతదేశంలో అతిపెద్ద ఆన్‌లైన్ బస్ టికెటింగ్ ప్లాట్‌ఫారమ్ రెడ్‌బస్ తన సంవత్సరాంతపు క్యాంపెయిన్‌ను ప్రారంభిస్తున్నట్లు ప్రకటించింది. తమ ప్లాట్‌ఫారంపై డిసెంబరు 20, 2021 నుంచి జనవరి 16, 2022 మధ్యలో ప్రత్యేక ఆఫర్లతో టిక్కెట్‌లను బుక్ చేసుకునే అదృష్టవంతులైన వినియోగదారులు ఒక గ్రాము బంగారాన్ని గెల్చుకునే అవకాశాన్ని కల్పిస్తుంది. తెలంగాణలో రెడ్‌బస్ ప్లాట్‌ఫారమ్‌పై ప్రైవేట్ బస్సుల్లో సీట్లు బుక్ చేసుకునే ప్రయాణికులకు గోల్డెన్ టికెట్ ఆఫర్ అందుబాటులోకి వచ్చింది. దీని ద్వారా 28 రోజుల వ్యవధిలో, రెడ్‌బస్‌లో ప్రైవేట్ బస్సు ఆపరేటర్‌ల నుంచి టిక్కెట్లు బుక్ చేసుకున్న వినియోగదారులు అందరికీ ఒక గ్రాము బంగారాన్ని గెలుచుకునే అవకాశం ఉంటుంది. అంతే కాకుండా, క్యాంపెయిన్ సమయంలో ప్రతి ప్రయాణికుడు తమ రెడ్‌బస్ వాలెట్లలో రూ.50 క్యాష్‌బ్యాక్‌గా అందుకుంటారు. ఈ ఆఫర్‌ను పొందేందుకు, ప్రయాణీకులు రెడ్‌బస్‌లో తమ బస్సు టిక్కెట్‌లను బుక్ చేసుకునేటప్పుడు గోల్డెన్ టికెట్ ఆఫర్ కోడ్‌ను దరఖాస్తు చేసుకోవలసి ఉంటుందని రెడ్‌బస్‌లో ఎస్‌విపి అండ్ మార్కెటింగ్ హెడ్ పల్లవి చోప్రా తెలిపారు.

### జానయ్య మరణం తెలుగుదేశం పార్టీకి తీరని లోటు



పర్చూరు(ఒంగోలు) : తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు గోరంట్ల జానయ్య చౌదరి మరణం, తెలుగుదేశం పార్టీకి తీరని లోటని, నిబద్ధత కలిగిన నాయకుడిని కోల్పోవడం బాధాకరమని, తెలుగుదేశం పార్టీ బాపట్ల పార్లమెంట్ అధ్యక్షులు, ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు అన్నారు. పర్చూరు నియోజకవర్గం, ఇంకొల్లు మండల తెలుగుదేశం పార్టీ మాజీ అధ్యక్షుడు, సూదివారిపాలెం గ్రామానికి చెందిన, తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు గోరంట్ల జానయ్య చౌదరి పార్థివదేహానికి, ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు పూలమాలవేసి, ఘన నివాళులర్పించారు. మంగళవారం తెల్లవారుజామున జానయ్య చౌదరి ఆకస్మిక మృతి చెందారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. వెంటనే సూదివారి పాలెంకు చేరుకుని, జానయ్య కుటుంబ సభ్యులను ఓదార్చారు. ఆయన మరణం పట్ల కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి, సంతాపం తెలిపారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని దేవుని ప్రార్థించారు. జానయ్య మరణం తెలుగుదేశం పార్టీకి తీరని లోటన్నారు. నిబద్ధత కలిగిన నాయకుడిని కోల్పోవడం బాధాకరం అన్నారు. తెలుగుదేశం పార్టీ బలోపేతం కోసం, జానయ్య విశేష కృషి చేశారని, ఎమ్మెల్యే ఏలూరి కొనియాడారు.

### కవిరత్న బీవీవీ కి దేశభక్తుల సంక్షేమ సంఘం ప్రశంస



విశాఖపట్నం: దేశభక్తుల సంక్షేమ సంఘం, మంచిర్యాల వారు ఇటీవల "సైనిక త్రిదళాధిపతి జనరల్ బిపిన్ రావత్ గారికి సాహిత్య నివాళి " పేరుతో ఆన్లైన్ కవితా పోటీలు నిర్వహణ చేపట్టి ఉత్తమ కవితలతో సంకలనం తీసుకునచ్చారు. ఈసందర్భముగా అమలాపురానికి చెందిన కవి, రతయిత, సామాజికవేత్త, విశ్రాంత సహకార శాఖాధికారి వ్రాసిన "రక్షకుడు రావత్" కవిత సంకలనానికి ఎంపికైనది. ఈమేరకు సంస్థ అధ్యక్షులు శ్రీ సూరిరెడ్డి నరేందర్ రెడ్డి, ప్రధానకార్యదర్శి శ్రీ జైకిషన్ ఓఝా లనుండి ప్రశంసాపత్రము అందుకున్నారు. సాహిత్యమే ఊపిరిగా సాగిపోతున్న కవిరత్న బీవీవీ ని ఈ సందర్భముగా కోనసీమ రచయితల సంఘం కార్యవర్గసభ్యులు నల్లా నరసింహమూర్తి , అద్దంకి అమరేశ్వరరావు, మున్సిపాలిటీ ఉపాధ్యక్షులు నానిరాజు, శ్రీమతి పోలిసెట్టి అనంతలక్ష్మి, యెండూరి సీతామహాలక్ష్మి, కాకర్లపూడి కేశవవర్మ, కుంపట్ల సుభాషిణి, సాపే బాలరవి, రిటైర్డ్ జడ్జి మోర్త సత్యనారాయణ , తరిట్ల రాజేష్, నక్కా సంపత్ కుమార్, కె. పద్మాజీరావు , కడలి సత్యనారాయణ తదితరులు అభినందించారు.

# భారత దేశపు మొట్టమొదటి ఉపాధ్యాయురాలు,క్రాంతి జ్యోతి అమ్మ



''సావిత్రిబాయి ఫూలే''ను మరియు ఆమె సేవలను జనవరి 3న ఆమె జయంతి సందర్భంగా గుర్తు చేసుకోవడం అత్యంత అవసరం. ఆనాడు ఆమె యావత్తు సమాజాన్ని ఎదిరించి అణగారిన వర్గాల వారి కోసం చేసిన ఆదర్శవంతమైన సేవలను గుర్తుచేసుకోవడం అనివార్యం. సావిత్రిబాయి జనవరి 3, 1981లో సాధారణ శూద్ర దంపతులు ఖండోజీ, లక్ష్మిలకు జన్మించింది. 1840లో తన 9వ ఏటనే మహాత్మ జ్యోతిరావు ఫూలేతో వివాహం జరిగింది. భర్త సహకారంతో చదువుకుని తనలాంటి బాలికలను, అంటరాని వాళ్ళను విద్యావంతులను చేయడానికి పూనుకుంది. పరిస్థితులు ఏవైనా సరే మహిళలు, అంటరానివాళ్ళ జీవితాలు బాగుపడాలంటే చదువుకోవడం ఒక్కటే మార్గమని నమ్మింది. అందుకోసం సమాజం నుండి ఎంతటి వ్యతిరేకత ఎదురైనా బెదరకుండా, వెనకడుగు వేయకుండా భర్త సహకారంతో పాఠశాలలు స్థాపించి మహిళలకు, అంటరానివాళ్ళకు చదువు నిచ్చింది. కేవలం చదువే కాకుండా తమ పాఠశాలలకు వచ్చే పిల్లల స్థితిగతులను తెలుసుకుని వారి కుటుంబాలకు సాధ్యమైన చేయూతనిచ్చింది, సంక్షేమ హాస్టళ్ళను నడిపించింది. దేశ తొలి మహిళ ఉపాధ్యాయురాలు సావిత్రిబాయి ఫూలే జీవితాన్ని ఆదర్శంగా తీసుకొని....బడుగు బలహీన వర్గాల అభివృద్ధి విద్యతోనే సాధ్యమని నమ్మి విద్యాభివృద్ధికి సావిత్రిబాయి ఫూలే ఎడ్యుకేషనల్ చారిటబుల్ ట్రస్ట్ ద్వారా కృషి చేస్తున్నారు. సమాజంలో అసమానతలు రూపుమాపాలని, అందుకు మహిళలకు విద్య అవసరమైని భావించి మొట్ట మొదట మహిళా పాఠశాల స్థాపించిన సావిత్రి బాయి ఫూలే చదువుల తల్లి అని సావిత్రిబాయి ఫూలే ఎడ్యుకేషనల్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ గూడూరు సీతామహాలక్ష్మీ గారు పేర్కొన్నారు. ఈ సందర్భంగా జనవరి 3వ తేదిన క్రాంతి జ్యోతి, అమ్మ సావిత్రిబాయి ఫూలే 191 వ జయంతి సందర్భంగా సావిత్రి బాయి ఫూలే ఎడ్యుకేషనల్ అండ్ చారిటబుల్ ట్రస్ట్ పక్షాన అనేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. జనవరి 3 తేదిన ఉదయం 10 గంటలకు సావిత్రి బాయి ఫూలే విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమం ఉంటుందని గూడూరు సీతామహాలక్ష్మీ గారు తెలిపారు. విశాఖ పబ్లిక్ లైబ్రరీలో జయంతి సభను ఘనంగా నిర్వహిస్తారు. ఈ సందర్భంగా సమాజానికి విశిష్ట సేవలు చేస్తున్న వారికి అమ్మ సావిత్రి బాయి ఫూలే విశిష్ట సేవా పురస్కారాలను ప్రధానం చేస్తారు. 15 వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ఒక ప్రత్యేక సావనీర్ విడుదల చేస్తున్నామని తెలిపారు. విద్యార్థులచే సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయని అన్నారు. జిల్లా కలెక్టర్ గారు, వైద్యరంగానికి చెందిన ప్రముఖులు ఈ జయంతి సభలో పాల్గొంటారు. సావిత్రిబాయి ఫూలే జీవన సాఫల్య పురస్కారానికి డాక్టర్ పి.వి.సుధాకర్ గారిని ఎంపిక చేశారు. వైద్యంతో ఆయుష్షు నింపుతూ... మనోధైర్యాన్ని పెంచుతూ ప్లాస్టిక్ సర్జరీ విభాగాధిపతిగా ఆంధ్రా మెడికల్ కాలేజ్ ప్రిన్సిపాల్‌గా... కోవిడ్ సమయంలో మూడు జిల్లాలకి నోడల్ ఆఫీసర్‌గా అందరికీ అందుబాటులో ఉంటూ...వైద్యసేవలు అందించారు. క్లిష్టంగా ఉన్న బాడీడొనేషన్ ప్రక్రియని సులభతరం చేశారు. శరీర దాతల సర్టిఫికేట్స్ త్వరతగతిన వచ్చేలా చేయడం...ఏ సమయంలో అనాటమీకి పార్థివ శరీరం తీసుకు వెళ్ళినా పార్థివ దేహాన్ని దానం స్వీకరించేలా సిబ్బంది అందుబాటులో ఉండేలా చూడటం, ఎంత పనుల ఒత్తిడిలో ఉన్నా కూడా పార్థివ దేహ దాత కుటుంబీకులకు ఫోన్ చేసి అభినందనలు తెలియజేస్తారని పలువురు తెలిపారు. spect నిర్వహించే ప్రతి మీటింగ్‌లో పాల్గొని మాలో ఎంతో స్ఫూర్తినీ నింపిన ఒక గొప్ప సామాజిక వేత్త పి.వి సుధాకర్ గారు అని తెలిపారు. మానవీయ దృక్పథంతో ఈ శరీర,అవయువ దాన ఉద్యమంలో ప్రారంభం నుండి మమేకమై మావెన్నంటి ఉన్న అసామాన్య వ్యక్తిత్వం వారిది!!వైద్య రంగంలో వారు సాధించిన విజయాలకు ఎన్నో అత్యుత్తమ,అరుదైన పురస్కారాలు అందుకున్నారు. 2..సావిత్రిబాయి ఫూలే విశిష్ట మహిళా పురస్కారానికి సాయి పద్మగారిని ఎంపిక చేశారు. ఈమె పుట్టినపుడే పోలియో,పాతికేళ్ళకే పద్దెనిమిది ఆపరేషన్లు...ఎన్నో కష్టాలు...అన్నిటినీ విజయ సోపానాలుగా చేసుకుని....గ్లోబల్ ఎయిడ్ సంస్థని స్థాపించారు. దివ్యాంగుల సంక్షేమానికి విశేషంగా కృషిచేస్తూ....మరోపక్క రచయిత్రిగా, కవయిత్రిగా, వక్తగా, న్యాయవాదిగా,గాయనిగా,పారా స్పోర్ట్స్ ప్రోత్సాహకురాలిగా ... సమాజానికి ఎంతో సేవచేస్తున్నారు. 3.సావిత్రిబాయి విశిష్ట సేవా పురస్కారానికి %ఖ.ఎ%.ప్రసాద్ గారిని ఎంపిక చేశారు. K.v ప్రసాద్ గారు 440 గజాలు స్థలం spect సీనియర్ సిటిజన్స్ హోమ్ కోసం దానం ఇచ్చారు. అనేక సేవా సంస్థలలో ఆయన క్రియాశీల కార్యకర్త!! 4..విశిష్ట కుటుంబ సేవా పురస్కారం :బి అమర జీవి,మరణించినా జీవించి ఉన్న అవ యువ దాత శ్రీ కనుమూరి సీతారామ రాజు అవయువాలను దానం చేసి 8 మందికి ప్రాణ దానం చేయటం ద్వారా ఎందరికో ఆదర్శం గా నిలిచిన కనుమూరి సీతారామ రాజు కుటుంబాన్ని విశిష్ట సేవా కుటుంబ పురస్కారానికి ఎంపిక చేశారు. ఆయన భార్య శ్వేత కుటుంబానికి విశిష్ట సేవా కుటుంబ పురస్కారం అందజేస్తున్నామని సీతామహాలక్ష్మిగారు తెలిపారు. 5..సావిత్రిబాయి ఫూలే విశిష్ట సేవాసంస్థ పురస్కారాలు :బివివిధ సేవా సంస్థలకు ఈ పురస్కారాలు అందజేస్తున్నారు. సమాజసేవే జీవిత పరమావధిగా... అడుగులు వేస్తున్న సంస్థలు... రక్తదానంతో వేలాది మందికి ప్రాణాలు పోస్తున్నారు. కోవిడ్ సమయంలో అన్నదానం,నిత్యావసరాల పంపిణీ లాంటి సేవాకార్యక్రమాలు చేపట్టి పేదలకు,అవసరార్థులకు అండగా నిలబడ్డారు. ఒక్కరే చేసేకన్నా... పదిమంది సమిష్టిగా చేస్తే వీలయినంత ఎక్కువ మందికి సహాయం చేయవచ్చనే సదుద్దేశంతో అందరిని కలుపుకుంటూ ముందుకు వెళ్తున్న విశిష్ట సేవాసంస్థలను కూడా స్పెక్ట్ తరుపున అవార్డులు అందజేస్తున్నారు. ఈ ఏడాది ఈ పురస్కారాల కు ఎంపిక అయినా సేవా సంస్థల పేర్లు ఇవి...బి:1అమ్మ చారిటబుల్ ట్రస్ట్ 2.నవయువ సేవాసంఘం. . 3.శివం గోల్డెన్ హార్ట్స్,4.ఫ్రెండ్స్ బ్లడ్ డోనార్స్ అసోసియేషన్ 5, స్పెషల్ గైస్ ఫౌండేషన్, 6.రీచింగ్ హేండ్స్ ఫౌండేషన్ ,ఫ్రెండ్స్ 7.హెల్పింగ్ హేండ్స్ వెల్ఫేర్ సొసైటీ ,8.సోల్స్ ఆఫ్ హ్యూమానిటీ 9.,బీయింగ్ వి.ఆర్గనైజేషన్ 10.సావిత్రిబాయి ఫూలే సేవా స్ఫూర్తి సూపర్ కిడ్స్ అవార్డ్స్ గ్రహీతలు. . B. వైనవి, చైతన్య లు!!.ఈ చిన్నారులు అక్క తమ్ముళ్లు..సెంట్రల్ స్కూల్ లో 6,వ తరగతి,4వ తరగతి చదువుతున్నారు.. మహాత్మా జ్యోతిరావు ఫూలే ... అమ్మ సావిత్రి బాయి ఫూలే...బాబాసాహెబ్ అంబేడ్కర్ గార్ల నుండి స్ఫూర్తిని పొంది బాల్యం నుండే సేవా కార్యక్రమాల్లో పాల్గొంటూ... ఆ



మహనీయుల జీవిత ఘట్టాలను అలవోకగా ప్రసంగిస్తూ అందరినీ అబ్బుర పరుస్తున్నారు ఈ బాల మేధావులు. ఈవిధంగా ప్రతి ఏడాది సావిత్రి బాయి ఫూలే పేరు మీద ఆమె స్ఫూర్తి తో సమాజానికి నిరుపమాన సేవలు చేస్తున్న వ్యక్తులకు,సేవా సంస్థలకు సావిత్రి బాయి ఫూలే విశిష్ట సేవా పురస్కారాలతో గౌరవిస్తూ వచ్చాము ఈ పురస్కారాలను రెండు రాష్ట్రాల నుండి 200 మందికి పై గా ఈ 15 ఏళ్లలో స్వీకరించారు.. ఈ సేవా పురస్కారాలను అందుకోవటం గొప్ప గౌరవం గా గ్రహీతలు పేర్కొనటం మాకు ఎంతో సంతోషం గా భావిస్తున్నాము...

**గూడూరు సీతామహాలక్ష్మి, చైర్ పర్సన్,సావిత్రిబాయి ఫూలే ఎడ్యుకేషనల్ అండ్ చారిటబుల్ ట్రస్ట్**



## జాతీయస్థాయిలో ఎన్నికైన న్యూ షావోలిన్ కుంగ్- ఫు అకాడమి విద్యార్థులు

చిలకలూరిపేట:(ప్రజాపాలన ప్రతినిధి)గుంటూరు నల్లపాడు కార్తికేయ సెల్ఫ్ డిఫైన్స్ అకాడమి లో జరిగిన ఆంద్రప్రదేశ్ అండర్ ఆధారటీ ఉషూ క్రీడలో గుంటూరు జిల్లా నుండి రాష్ట్ర స్థాయి మీట్ లో పాల్గొన్న చిలకలూరిపేట సి.ఆర్ క్లబ్ లో నిర్వహిస్తున్న న్యూ షావోలిన్ కుంగ్-ఫు అకాడమీ విద్యార్దులకు జరిగిన అభినందన కార్యక్రములో సీనియర్ మాస్టర్ షేక్.దరి యావలి విద్యార్థి,విద్యార్థనిల ను అభినందించారు నిన్న జరిగిన ఉషు గేమ్ కి రాష్ట్ర స్థాయి వివిధ జిలాల్ల నుండి పాల్గొన్నరు,అకాడమీ విద్యార్థులు మన చిలకలూరిపేట నుండి పదకొండు మంది విద్యార్థులు వివిధ బరువు క్యాటగిరిలో బాలుర,బాల బాలికల సబ్ జూనియర్స్ విభాగములో 60కేజీ,లో డి.కరుణ్ బాబు, 56 కేజీ కె హాసినీ,45కేజీ ఈ .ఏస్తేర్ రాణి,35కేజీ బి.అభి,బి.పూజిత శ్రీ,వై.అక్షర యాని,స్.తేజ మాధురి,యస్ .డి తన్వీర్, ఎం.మ్ పవన్,యస్ తనుశ్రీ,ఏ.జగదీశ్వర్ పాల్గొని తమసత్తా చాటి మరొకసారి న్యూ షావోలిన్ కుంగ్ ఫు అకాడమీ పేరు నిలబెట్టారు.ఈ కార్యక్రములో మాస్టర్ కోచ్ బత్తుల విక్రమ్ మాట్లాడుతూ మన జిల్లాలో నే మన చిలకలూరిపేట రాష్ట్రస్థాయి నుండి జాతీయ స్థాయి కి తీసుకువెళ్లడం చాల..చాల ఆనందకరంగా ఉన్నది ఇలానే కలకత్తా లో జరగనున్న జాతీయ స్థాయి లో కూడా ఇలానే తామసత్త చాటి విజయముతో మరొకసారి మీ ముందుకు వస్తున్నామని వారు తెలిపారు. న్యూ షావోలిన్ కుంగ్-ఫు అకాడమి లో బాల బాలికలకు సెల్ఫ్ డిఫెన్స్ ప్రత్యేకంగా సీనియర్ మాస్టర్ దరియావలి చే శిక్షణ ఇవ్వబడును స్థానిక సి.ఆర్ క్లబ్ చిలకలూరిపేట. నందు ప్రతిరోజు ఉదయం:- 06:00 గంటలనుండి 07:00 వరుకు ఉచిత శిక్షణ జరుగును. మరియు పోలిరెడ్డిపాలెం,పసుమర్రు గ్రామంలో నిర్వహిస్తన్న క్లాసులను ఆయా ప్రాంతాలవాళ్ళు సద్వినియోగించుకోవాలనిఈ సందర్భంగా వారు పేర్కొన్నారు. ఈకార్యక్రమంలో విద్యార్థి,విద్యార్థిలు,తల్లీతండ్రులతోపాటు మాస్టర్స్ వై.నురేష్,పి.నాగరాజు,ఇన్ స్ట్రక్టర్స్ :- ఎం.మ్ దుర్గ ప్రసాద్,యస్.కె.రబ్బానీ,ఆర్ రాహుల్ తదితరులు పాల్గొన్నారు.

## యర్రం శెట్టి గిరీష్ కి అవార్డు ప్రధానం



నరసరావుపేట. ప్రజాపాలన :స్థానిక యర్రంశెట్టి హీరో షోరూం నందు శ్రీరామ్ సిటీ యూనియన్ ఫైనాన్స్ ఒక కోటి రిటైల్ ఫైనాన్సింగ్ సంబరాలు నిర్వహించినారు .ఈ సందర్బంగా బెస్ట్ రిటైల్ ఫైనాన్స్ డీలర్ అవార్డు ని యర్రంశెట్టి గిరీష్ కి శ్రీరామ్ ఫైనాన్స్ స్టేట్ హెడ్ %జు% నాగేంద్ర అందచేసినారు.ఈ సందర్బంగా స్టేట్ హెడ్ %జు% నాగేంద్ర మాట్లాడుతూ యర్రంశెట్టి హీరో సౌజన్యం తో తాము ఒక కోటి టూ వీలర్ రిటైల్ ఫైనాన్సింగ్ మైలురాయిని చేరుకోగల్గినాము కొనియాడారు. యర్రంశెట్టి గిరీష్ మాట్లాడుతూ శ్రీరామ్ ఫైనాన్స్ కి యర్రంశెట్టి హీరో షోరూం కి వున్నా అనుబంధాన్ని గుర్తు చేస్తూ , శ్రీరామ్ ఫైనాన్స్ మరింతగా వృద్ధి చెందటానికి తమ సహాయ సహకారాలు ఎప్పుడు ఉంటాయి అన్నారు ఈ కార్యక్రమంలో యర్రంశెట్టి హీరో అధినేతలు యర్రంశెట్టి రాము ,బాబ్జి ,జనరల్ మేనేజర్ గోపాల కృష్ణ ,సేల్స్ మేనేజర్ షేక్ ఖలీల్ ,శ్రీరామ్ ఫైనాన్స్ %ఐవీ% రామారావు ,%దీవీ% రాముడు మరియు షోరూం సిబ్బంది ,ఫైనాన్స్ సిబ్బంది పాల్గొన్నారు.

## గ్రంథాలయ పితామహుడు వెలగా వెంకటయ్య కు ఘన నివాళి



చిలకలూరిపేట:(ప్రజాపాలన ప్రతినిధి)పట్టణంలోని శాఖా గ్రంధాలయం లో మంగళవారం జన విజ్ఞాన వేదిక చిలకలూరిపేట డివిజన్ ఆధ్వర్యంలో గ్రంథాలయ పితామహుడు వెలగా వెంకటపయ్య వర్ధంతి కార్యక్రమం జరిగింది. జెవివి డివిజన్ కోశాధికారి ఎ. గురులింగం అధ్యక్షత జరిగిన ఈ కార్యక్రమంలో ప్రముఖ సాహితీ విమర్శకులు డా. పి.వి. సుబ్బారావు పాల్గొని మాట్లాడారు. బాల సాహిత్య వికాసం, అభివృద్ధికి వెలగా చేసిన సేవ వెల కట్టలేదన్నారు. ఆయన రాసిన గ్రంథాలయ శాస్త్ర పుస్తకాలు దేశ విదేశాలలో ఉన్న వివిధ విశ్వ విద్యాలయాలలో పాఠ్యఅంశాలుగా ఉన్నాయన్నారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అద్యక్షులు దార్ల బుజ్జిబాబు, ప్రముఖ కవి అచ్చుల, లోకసత్తా పార్టీ నాయకులు మాదాలు భాను ప్రసాద్, గ్రంథాలయం సిబ్బది నాగూర్ వలి, శివ పార్వతి వున్నారు.

## ముసునూరు లోని జగనన్న గృహ నిర్మాణ పనులను వేగవంతం చేయాలి: ఎమ్మెల్యే



కావలి, డిసెంబర్ 28 ప్రజాపాలన ప్రతినిధి : ముసునూరు లోని జగనన్న గృహ నిర్మాణ పనులను పూర్తి చేయాలని ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్ కుమార్ రెడ్డి తెలిపారు. మంగళవారం పట్టణంలోని ముసునూరు లోని మెగా లేఅవుట్ ను పరిశీలించారు. పలు సమస్యలను అధికారులతో మాట్లాడి పరిష్కారం దిశగా పనులు చేయాలని చెప్పారు. ఆయన వెంట ఆర్డీఓ సీనా నాయక్, కమిషనర్ శివారెడ్డి వైసీపీ నేతలు శివ కుమార్ రెడ్డి, కె వి నారాయణ, కుందుర్తి కామయ్య, కృష్ణారావు, నెల్లూరు వెంకటేశ్వర్ రెడ్డి ఉన్నారు.

# అత్త సొమ్ము, అల్లుడు దానం చేసినట్లు, అన్న చందాన రాష్ట్ర ప్రభుత్వ వైఖరి ఉంది

**బిజెపి బాపట్ల పార్లమెంటు జిల్లా అధ్యక్షులు మువ్వల వెంకట రమణారావు**



చీరాల(ఒంగోలు) :అత్త సొమ్ము అల్లుడు దానం చేసినట్లు, రాష్ట్ర ప్రభుత్వ వైఖరి ఉందని, కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను, తమ పేరిట ప్రచారం చేసుకుంటూ, ప్రజలను రాష్ట్ర ప్రభుత్వం మభ్య పెడుతుందని, బిజెపి బాపట్ల పార్లమెంటు జిల్లా అధ్యక్షులు మువ్వల వెంకట రమణారావు, భారతీయ జనతా పార్టీ సీనియర్ నాయకులు, ప్రముఖ న్యాయవాది బండారుపల్లి హేమంత్ కుమార్, లు రాష్ట్ర ప్రభుత్వ తీరును, దుయ్యబట్టారు.



ఈ సందర్భంగా హేమంత్ కుమార్ మాట్లాడుతూ,సొమ్మొకడిది సోకొకడిది అన్న చందాన కేంద్ర ప్రభుత్వ పథకాలను, రాష్ట్ర ప్రభుత్వం తమ పథకాలు అని చెప్పుకుంటూ, తమ ఫోటోలతో ప్రచారం చేసుకోవటం, మోసపూరిత చర్యలో భాగంగా అన్నారు. ప్రజలను మభ్యపెట్టి మోసం చేసే, ఏ పార్టీలకు రాజకీయ భవిష్యత్తు ఉండదని, ఆ అంశాన్ని గమనించాలన్నారు.రాష్ట్ర ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలను ఖండిస్తూ, ఈరోజు విజయవాడలో నిర్వహిస్తున్న ప్రజా ఆగ్రహసభకు చీరాల నుండి వెళుతున్నామన్నారు.అద్భుతమైన మెజారిటీతో అధికారంలోకి వచ్చిన వై.సి.పీ. ఒక చేత్తో రూపాయి ఇస్తూ, మరొకచేత్తో ఉన్న పదిరూపాయలు లాగేస్తోందని,ఓ.టీ.ఎస్ అని పెట్టి, పేద ప్రజల నడ్డి విరుస్తోందని విమర్శించారు. ఇవే విధానాలు ఇదే విధంగా కొనసాగితే, 150 నుండి 50 సీట్లకు, పడిపోయే అవకాశాలు ఉన్నాయని జ్యోస్యం చెప్పారు.అదేవిధంగా కేంద్ర ప్రభుత్వం అమలుచేస్తున్న పథకాలకు, ఆయన బొమ్మలు వేసుకుని ప్రచారం చేసుకోవడం, మా అధిష్టానం గమనిస్తున్నారని స్పష్టం చేశారు.రాబోయే రోజుల్లో ఓటమి తప్పదని హెచ్చరించారు. ప్రకాశం జిల్లా చీరాల నుండి, విజయవాడలో భారతీయ జనతా పార్టీ నిర్వహిస్తున్న ప్రజా ఆగ్రహసభకు ఇరవై బస్ లలో, ఇతర వాహనాలలో, పెద్ద సంఖ్యలో,ఆ పార్టీ నాయకులు,కార్యకర్తలు,అభిమానులు.తరలి వెళ్లారు. ఈ కార్యక్రమంలో బిజెపి బాపట్ల పార్లమెంటు జిల్లా అధ్యక్షులు మువ్వల వెంకట రమణారావు, నాయకులు అరవపల్లి కుమార్, తడవర్తి చంద్ర, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

# పేద ప్రజలను దోచుకునేందుకు వేసిన మాస్టర్ ప్లాన్ యే ఓ.టి.ఎస్.



చీరాల(ఒంగోలు) : సంక్షేమపథకాల పేరిట, పేదలకు గాలమేసి ఐదువేలో, పదివేలో ఎరగా, వారికి పంచిపెట్టి, వేల కోట్ల రూపాయల సంపాదించాలనే లక్ష్యంతో, ప్రభుత్వం వ్యవహరిస్తుందని, బాపట్లపార్లమెంట్ టిడిపి కార్యనిర్వాహక కార్యదర్శి చింతా.రామకృష్ణారావు(రాము), బీసీ సెల్ పార్లమెంట్ అధ్యక్షులు కౌతవరపు జనార్ధన్, బీసీ సెల్ నియోజకవర్గ అధ్యక్షులు గుత్తి వీరప్రసాద్ లు ధ్వజమెత్తారు. ఎరను చూసి ఆశగా, చేపలు గేలానికి చిక్కినట్లుగా, పేదలు ప్రభుత్వ ఓ.టి.ఎస్ గేలానికి చిక్కుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అధికార ప్రభుత్వానికి అండగా, అధికారులు సైతం ప్రజలను మభ్యపెడుతున్నారని ఆరోపించారు. పేద ప్రజలకు ఉరితాడుగా మారిన, ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను ఖండిస్తున్నామన్నారు. పేద ప్రజలకు, తెలుగుదేశం పార్టీ ఎల్లవేళలా అండగా ఉంటుందని స్పష్టం చేశారు. తెలుగుదేశం పార్టీ బాపట్ల పార్లమెంట్ జిల్లా అధ్యక్షులు, పర్చూరు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు నాయకత్వంలో, బాపట్ల పార్లమెంటు జిల్లా పరిధిలో ప్రభుత్వ అరాచకాలకు, ప్రజలను బలవకుండా అడ్డుకుంటామని స్పష్టంచేశారు.

## విజయవాడ ప్రజాగ్రహ సభకు భారీగా తరలివెళ్ళిన ఒంగోలు బీజేపీ శ్రేణులు



ఒంగోలు : విజయవాడలో జరుగుతున్న ప్రజాఆగ్రహసభ' వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ముఖ్యమంత్రి అరాచక పరిపాలనపై, భారతీయ జనతా పార్టీ నిర్వహిస్తున్నటువంటి ప్రజా ఆగ్రహ సభకు, బీజేపీ ఒంగోలు పార్లమెంటు అధ్యక్షుడు యస్.శ్రీనివాసరావు నాయకత్వంలో, ఒంగోలు నగరం నుంచి, బీజేపీ మైనారిటీ మోర్చా ఫార్మేర్ రాష్ట్ర అధ్యక్షుడు షేక్. ఖలీఫాతుల్లాబాషా,బీజేపీ ఒంగోలు పార్లమెంటు ఉపాధ్యక్షుడు పీవీ. శివారెడ్డి ల అధ్యర్యంలో, భారీసంఖ్యలో బస్సులు, కార్లలో బీజేపీ ఒంగోలు నగర ఐదు మండలాల అధ్యక్షులతో పాటు, కార్యకర్తలు తరలివెళ్లారు. ఈ బస్సుర్యాలీనీ బీజేపీ మైనారిటీ మోర్చా ఫార్మేర్ అధ్యక్షుడు షేక్. ఖలీఫాతుల్లాబాషా,బీజేపీ ఒంగోలు పార్లమెంటు ఉపాధ్యక్షుడు శివారెడ్డి లు, పార్టీ జండా ఊపి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులుమీనా కుమారి,బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు కనుమలు రాఘవులు,బీజేపీ ఒంగోలు పార్లమెంటు ప్రధాన కార్యదర్శి వైవి. అశోక్ కుమార్ యాదవ్,బీజేపీ ఒంగోలు పార్లమెంటు ఉపాధ్యక్షుడు రావులపల్లి నాగేంద్ర యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## ఫాగింగ్ మిషన్ ప్రారంభించిన సర్పంచ్



నరసాపురం,డిసెంబర్ 28 (ప్రజాపాలన ప్రతినిధి) : నరసాపురం మండలంయర్రంశెట్టి వారిపాలెం గ్రామ సచివాలయంలో దోమల నిరమ్మాలన కొరకు ప్రభుత్వం మంజూరుచేసిన ఫాగింగ్ మిషన్ మరియు స్థానిక రైతు భరోసా కేంద్రంలో ధాన్యం యొక్క నాణ్యతను ధ్రువీకరించే యంత్రాన్ని గ్రామ సర్పంచ్ యర్రంశెట్టి నాగముత్యమాంబ, ఏఎంసి వైస్ చైర్మన్ యర్రంశెట్టి త్రినాధ వెంకటనరసింహారావు (బాబులు) సోమవారం ప్రారంభించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ శీతాకాలంలో దోమల వలన డెంగ్యూ, మలేరియా వంటి వ్యాధులు ప్రబలే ప్రమాదంఉందని దోమల నివారణ కొరకు ప్రభుత్వం మంజూరు చేసిన ఫాగింగ్ మిషన్ గ్రామాలకు చాలా ఉపయోగకరంగా ఉంటుందని అన్నారు. రైతులకు సంబంధించి ధాన్యం నాణ్యతను గతంలో రైతులు మిల్లర్లవద్దకు వెళ్లి చూసుకునే పరిస్థితి ఉండేదని ఇప్పుడు ముఖ్యమంత్రి జగన్ చొరవతో ధాన్యం యొక్క నాణ్యత, గిట్టుబాటు ధరలు రైతులకు గ్రామాలలోనే అందుబాటులోకి రావడం గొప్ప విషయమని అన్నారు. ఈకార్యక్రమంలో రైతులు, పంచాయతీ బోర్డు మెంబర్లు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



## గ్రామాల అభివృద్దే ప్రభుత్వ లక్ష్యం

నరసాపురం, డిసెంబర్ 28 (ప్రజాపాలన ప్రతినిధి) : గ్రామాల అభివృద్దే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తుందని శాసనసభ్యులు ముదునూరి ప్రసాదరాజు అన్నారు. సోమవారం వేములదీవి ఈస్ట్ గ్రామంలో పల్లెనిద్ర అనంతరం మంగళవారం ఉదయం వేకువజామున ఆయన గ్రామంలో పర్యటించి రూ.25 లక్షల రూపాయలతో వెస్ట్ కుక్కులేరు డ్రైనేజీపై కాలిబాట వంతెనకు శంకుస్థాపన చేశారు. ఈసందర్భంగా త్వరితగతిన పనులు ప్రారంభించి పూర్తిచేయాలని అధికారులను ఆదేశించారు. గ్రామంలో పెండింగులో ఉన్న పలు సమస్యలను పరిశీలించి వాటిని పరిష్కరించాలని ఆదేశించారు. గ్రామంలోని త్రాగునీటిని పరిశీలించారు. ప్రజలకు పరిశుభ్రమైన నీటిని సరిపడా అందించాలని ఆర్.డబ్ల్యూ.ఎస్ అధికారులను ఆయన ఆదేశించారు. తదుపరి గ్రామ వాలంటీర్లు, అధికారులతో సమీక్ష నిర్వహించారు. వాలంటీర్లు బాధ్యతతో ప్రజల అవసరాలను, సమస్యలను గుర్తించి పరిష్కారం చూపే విధంగా ఉండాలని ప్రజలకు, ప్రభుత్వానికి వారధిగా గ్రామ వాలంటీర్లు పనిచేయాలని శాసనసభ్యులు సూచించారు. ఈ కార్యక్రమంలో పార్టీ నేతలు బొక్కా రాధాకృష్ణ, జేవీఆర్, తిరుమాని శ్రీను, సంగాని రాంబాబు, చింతా శ్రీను, తిరుమాని అర్జునరావు, తిరుమాని కృష్ణంరాజు, తిరుమాని నాగరాజు, ఉంగరాల రమేష్, వివిధశాఖల అధికారులు పాల్గొన్నారు.

## సిఐటియు 2022 గ్రీటింగ్ విడుదల




భీమవరం, డిసెంబర్ 28 (ప్రజాపాలన ప్రతినిధి) : సెంటర్ ఆఫ్ ఇండియన్ ట్రేడ్ యూనియన్ (సిఐటియు) పశ్చిమగోదావరి జిల్లా కమిటీ 2022 గ్రీటింగును వివిధ సంఘాల నాయకులు విడుదల చేశారు. మంగళవారం స్థానిక సీఐటీయూ కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు అల్లూరి అరుణ్, ఎం ఆంజనేయులు మాట్లాడుతూ ఉద్యోగులు కార్మికుల సమస్యలపై సిఐటియు దేశవ్యాప్తంగా పోరాడుతుందని అన్నారు. జిల్లాలో వివిధరంగాలలో పనిచేస్తున్న ఉద్యోగులు, కార్మికుల సమస్యలపై ఐక్యంచేసి వారి సమస్యలను పాలకులకు తెలియజేయడంలో ముందు పీఠిన నిలుస్తుందని అన్నారు. ప్రతి సంవత్సరం కొత్త సందేశాన్ని అందిస్తూ గ్రీటింగులను విడుదల చేయడం ఆనవాయితీగా వస్తుందని అన్నారు. ఈసంవత్సరం కూడా కార్మిక హక్కులు, ప్రభుత్వరంగ పరిరక్షణకై ఫిబ్రవరి 23, 24 తేదీలలో జరగనున్న దేశవ్యాప్త సమ్మెలో పాల్గొనాలని ఉద్యోగ, కార్మిక, ప్రజలకు విజ్ఞప్తిచేస్తూ గ్రీటింగ్ రూపొందించడం జరిగిందని అన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ రెవెన్యూ సహాయకుల భీమవరం మండల అధ్యక్షులు పీటర్సన్, అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ నాయకులు మహాలక్ష్మి, మునిసిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు వరలక్ష్మి, బజారు లాగుడు బండ్ల ముఠా వర్కర్స్ యూనియన్ నాయకులు కె వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.


స్నేహ మ్యూచువల్లీ ఎయిడెడ్ కో-ఆపరేటివ్ సొసైటి లిమిటెడ్

గత 20 సం॥లు గా సమాజ మార్పుకోసం కంపెనీకి వచ్చే లాభాలను పేదప్రజల కనీస అవసరాల కోసం ఖర్చు చేస్తూ సోషల్ ఇంజనీరింగ్ చేస్తున్నాం.

SCHEDULE OF INTEREST RATES ON FIXED & R.D. ACCOUNTS

| Term | General | Senior Citizens |
|---|---|---|
| 180 Days - 1 Year | 7% | 7.5% |
| 1 Year - 2 Years | 8% | 8.5% |
| 2 Years - 3 Years | 9% | 9.5% |
| 3 Years - 5 Years | 10% | 10.5% |
| Above 5 Years | 11% | 11.5% |
| Savings Bank A/c | 5% | 5% |
| Recurring Deposit | 6% | 6.5% |

J.B. RAJU, IIS, vrs Ambassador
Dr. B.M. Vinod Kumar IFS Retd
Nerella Koteswara Rao DGM vrs BSNL
Dr. Guduri Seethamaha Lakshmi
M. Padma Sarma D.E. vrs BSNL
G. Kenny Bob

Dr. N. Venkateswarlu Principal Retd, Govt. Dental College
P.M. Raju. Chief Engineer, Retd
A. Punna Rao Chief Manager, Retd, Canara Bank
Arepally Rajendar DGM vrs, NTPC
S. Rama Krishna

Chairman : Dr. K. Siva Bhagya Rao, IRS vrs

CONTACT :
Hyderabad 76600 27682, 7842106355
Visakhapatnam 0891-2791205, 9246663046, 7660027696, 7660027664
Vijayawada 76600 27670, 900062111
Tirupathi 94400 77239
Bapatla 94403 20562
Ponnur 99089 91763
Cherukupalli 79958 56068
Karlapalem 76600 27676

H.No. 6-29/3/12, 3rd Floor, Daulat Plaza, Lakdikapul, Hyderabad - 500 004
E-mail : snehamacsltd@gmail.com

# ప్రజాపాలన


సంపాదకీయం

బుధవారం 29, డిసెంబరు 2021


## ఆర్థిక దక్షత లేని జగన్ సర్కార్

ప్రధానమంత్రి నరేంద్రమోదీ హయాంలో భారతదేశం ప్రపంచంలో ఆరవ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా మారేందుకు సన్నద్ధమవుతోందని బ్రిటన్‌కు చెందిన ఒక అంతర్జాతీయ సంస్థ రెండురోజుల క్రితం ప్రకటించింది. 2022లో భారత ఆర్థిక వ్యవస్థ ఫ్రెంచ్ ఆర్థిక వ్యవస్థను అధిగమిస్తుందని, 2023 కల్లా బ్రిటిష్ ఆర్థిక వ్యవస్థను కూడా మించిపోతుందని ఆ సంస్థ తెలిపింది. ఆర్థిక వ్యవస్థలో కరోనా సృష్టించిన తీవ్ర నష్టాల్ని అధిగమించి మళ్లీ కరోనాకు ముందున్న పరిస్థితులకు చేరుకున్నామని, ఇక మన పురోగతికి అడ్డులేదని కొత్త సంవత్సరంలో ప్రవేశిస్తున్న వేళ ఆర్థిక వేత్తలు చెబుతున్న విషయాలు ప్రతి భారతీయుడికీ సంతోషం కలిగించేవే. మోదీ హయాంలో 60 కోట్ల మంది అదనంగా బ్యాంకు ఖాతాల్ని తెరిచారు. 60 కోట్ల మందికి విద్యుత్, గ్యాస్ కనెక్షన్లు, ఆరోగ్య సౌకర్యాలు అదనంగా అందాయి. అనేక అగ్ర దేశాలతో పోలిస్తే కరోనాను మన దేశమే సమర్థంగా ఎదుర్కోగలిగింది. ఇవాళ 155 కోట్ల వాక్సిన్ డోస్‌లు ప్రజలకు అందాయంటే, చిన్న పిల్లలకు వాక్సిన్‌తో పాటు బూస్టర్ డోస్‌కు కూడా సిద్ధమవుతున్నామంటే అందుకు మోదీ పాలనా దక్షతే కారణమని ఎవరైనా చెప్పగలరు. మన దేశంలో దాదాపు ప్రతి రెండో రోజూ ఒక అభివృద్ధి ప్రాజెక్టు ప్రారంభమవుతున్నది. ఇంత అభివృద్ధి జరుగుతున్నా గత ఏడేళ్లలో ఒక్క అవినీతి ఆరోపణ కూడా మోదీ సర్కార్‌కు వ్యతిరేకంగా రాలేదన్న విషయం మనం గుర్తుంచుకోవాలి.కేంద్రంలో అభివృద్ధిని, ప్రజల శ్రేయస్సును ఆశించే ప్రభుత్వం ఉన్నప్పటికీ రాష్ట్రాల్లో పాలకులు అందుకు తగ్గట్లుగా నిర్ణయాలు తీసుకోకపోతే పరిస్థితి ఎంత అధ్వాన్నంగా మారుతుందో చెప్పడానికి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రమే ఉదాహరణ అని చెప్పక తప్పదు. మోదీ హయాంలో ఆర్థిక వ్యవస్థ పుంజుకుంటుందని అంచనాలు వినపడుతుంటే ఆంధ్రప్రదేశ్ ఆర్థిక వ్యవస్థ కుప్పకూలిపోనున్నదని ఆర్థికవేత్తలు అంచనా వేస్తున్నారు. ఇందుకు అనేక కారణాలున్నాయి. గత రెండున్నరేళ్లలో ఆంధ్రప్రదేశ్‌లో కేంద్ర ప్రభుత్వ ప్రాజెక్టులు మినహా రాష్ట్ర ప్రభుత్వం అమలు చేసిన ఒక్క అభివృద్ధి కార్యక్రమమంటూ కనపడదు. ఉపాధి, ఉద్యోగ అవకాశాలు పూర్తిగా సన్నగిల్లిపోయాయి. పారిశ్రామిక మౌలిక సదుపాయాల కల్పనలో ఏపీ పూర్తిగా వెనుకబడిపోయింది. పారిశ్రామిక వేత్తలను రాజకీయ బెదిరింపులకు, వేధింపులకు గురి చేయడంతో సులభతర వాణిజ్య ర్యాంకులలో రాష్ట్రం బాగా వెనుకబడిపోయింది. కేంద్ర ప్రభుత్వం పారిశ్రామిక కారిడార్లకు, క్లస్టర్లకు, ప్రత్యేక మండలాలకు అనుమతిచ్చినప్పటికీ వీటిని త్వరితగతిన అమలుచేయించుకుని పారిశ్రామిక మౌలిక సదుపాయాలు కల్పించడంలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైంది. సాగరమాల, భారత్ మాల, గతి శక్తి యోజన మొదలైన పథకాల ద్వారా కేంద్రం పారిశ్రామిక ప్రగతికి అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనకు అవకాశాలు కల్పించినప్పటికి జగన్ సర్కార్ వేగంగా నిర్ణయాలు తీసుకోకపోవడంతో ఆయన పాలన రాష్ట్రానికి శాపంగా మారింది. ఎక్కడ చూసినా అవినీతి పరాకాష్ఠకు చేరుకోవడంతో పారిశ్రామికవేత్తలు బెంబేలెత్తిపోతున్నారు. దీనితో రాష్ట్రంలో కొత్త పెట్టుబడులు రాకపోగా ఉన్న పెట్టుబడులు కూడా పక్క రాష్ట్రాలకు తరలిపోయాయి.రాష్ట్రంలో ఉత్పాదక వ్యయం ఏపీలో రూ. 6,419 కోట్లు మాత్రమే కావడం అభివృద్ధి పట్ల ప్రభుత్వ దృక్కోణానికి నిదర్శనం. కంప్ట్రోలర్ ఆడిటర్ జనరల్ (కాగ్) లెక్కల ప్రకారం కేంద్ర గ్రాంట్లు, ప్రజలపై మోపిన భారీ పన్నులు, అప్పులతో పెరిగిన రెవిన్యూ తప్ప ఇతరత్రా సంపద పెంచడం ద్వారా వచ్చిన ఆదాయం లేదు. దాదాపు రూ. 45వేల కోట్ల మేరకు పన్నులు వసూలు చేసినప్పటికీ ఆంధ్రప్రదేశ్ రెవిన్యూ లోటు అసాధారణమైన రీతిలో 662.80 శాతం పెరిగింది. 2021%--%22 ప్రథమార్థంలో రెవిన్యూ వసూళ్లు రూ. 1,04,804.91 కోట్లు కాగా వచ్చిన రెవిన్యూలో సగానికి పైగా, అంటే రూ. 50,419,15 కోట్లు తాయిలాలకే ఖర్చు పెట్టారు. జగన్ ప్రభుత్వంలో ఆర్థిక వ్యవస్థను నిర్వహించేవారు సమర్థంగా వ్యవహరించడం లేదు. రెవిన్యూలోటు, అప్పులను కూడా సరిగా అంచనా వేయలేకపోవడమే అందుకొక నిదర్శనం. 2021%--%22లో రెవిన్యూ లోటు రూ. 5వేల కోట్లు ఉంటుందని అంచనా వేస్తే. గత ఏప్రిల్- సెప్టెంబర్ మాసాల మధ్యే ఆ లోటు రూ, 33,140.62 కోట్లకు చేరుకుంది. ఇక అప్పులు రూ. 37,029 కోట్లకు చేరుకోవచ్చని అంచనా వేస్తే అవి ఇప్పటికే దాదాపు రూ. 40 వేల కోట్లకు చేరుకున్నాయి. ఈ ఆర్థిక సంవత్సరం ముగిసే నాటికి రెవిన్యూ లోటు, అప్పులు ఏ మేరకు చేరుకుంటాయో ఊహించుకుంటేనే భయం కలుగుతుంది.ఇప్పటికే ఆంధ్రప్రదేశ్ అప్పుల విషయంలో ఎఫ్ఆర్‌బిఎం పరిమితుల్ని దాటేయడంతో వచ్చే మూడేళ్లకు అప్పుల్ని ఏడాదికి రూ. 6వేల కోట్లకు తగ్గించాలని నిర్ణయించినట్లు ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ఇటీవల పార్లమెంట్‌లో చెప్పారు. జగన్ అరాచక విధానాల వల్ల ఏపీ ప్రజలపై కొన్ని దశాబ్దాల పాటు రుణం భారం పెరగడమే కాదు, భావి ప్రభుత్వాలు కూడా ఆర్థిక వ్యవస్థను చక్కదిద్దే అవకాశాలు లేకుండా పోయే ప్రమాదముంది. ఇప్పటికే ఏపీ ప్రజలపై అప్పులు, వడ్డీ మొత్తం భారం రూ. 6.50 లక్షల కోట్లకు చేరుకోనుంది. ఇంత దయనీయమైన పరిస్థితి ఏ రాష్ట్రంలో లేదు. ఒకే ఆదాయ వనరుతో రెండుసార్లు అప్పులు చేసిన ఘనత కూడా జగన్ సర్కార్‌కే దక్కుతుంది, ప్రభుత్వ ఆస్తులను రాష్ట్ర అభివృద్ధి కార్పొరేషన్‌కు బదిలీ చేసి ఆ ఆస్తులను తనఖా పెట్టడం కూడా జగన్ ప్రభుత్వంలోని ఆర్థిక వేత్తలు చూపించిన ఒక నైపుణ్యం!జగన్ సర్కార్ అమలుచేస్తున్నామని చెప్పుకుంటున్న పథకాలకు అత్యధిక నిధులు కేంద్రం నుంచే వస్తున్నప్పటికీ వాటి గురించి ప్రజలకు తెలియజేయడంలేదు. ఉదాహరణకు అందరికీ ఇళ్లు అందించాలని మోదీ కలలు కంటే, జగనన్నకాలనీ పేరుతో నిర్మిస్తున్నామని చెప్పుకుంటున్న ఇళ్లలో ఒక్కో ఇంటికి ఇచ్చే రూ. 1.80 లక్షల రాయితీలో కేంద్ర ప్రభుత్వంవాటా రూ. 1.50 లక్షలు కాగా, రాష్ట్ర ప్రభుత్వం వాటా రూ. 30 వేలే అని ఎంతమందికి తెలుసు? ప్రభుత్వ ఖజానాను ఖాళీ చేసి, ప్రభుత్వ ఆస్తులను తనఖా పెడుతూ, ప్రజలను దోచుకుంటూ కేవలం అప్పులతోనే రాష్ట్రాన్ని నెట్టుకువస్తున్న జగన్ సర్కార్ రాష్ట్రంలో అన్ని రంగాల్లో విఫలం కావడంతో తన అసహనాన్ని ప్రజలపై వ్యక్తం చేస్తోంది. జనం తమ రాజధాని కోసం శాంతియుతంగా ఉద్యమం చేస్తుంటే వారిని అణగ దొక్కడానికి పోలీసులను ప్రయోగిస్తున్నారు. ఈ రీత్యా ఈ ప్రభుత్వం ఎంతకాలం అధికారంలో ఉంటే అంత తీవ్ర నష్టం ఆంధ్ర ప్రజలకు జరుగుతుందనడంలో సందేహం లేదు. అందుకే 'ప్రజాగ్రహం' పేరుతో పెద్ద ఎత్తున ప్రజల్లోకి వెళ్లేందుకు బీజేపీ నిర్ణయించింది.

## పరిశోధనల్లో ప్రపంచం - ఆవు చుట్టూ మనం!




దేశీయ ఆవుల అద్వితీయత, వాటి పాలు, పేడ, మూత్రంలో ఉన్న రోగనిరోధకత లేదా క్యాన్సర్‌తో సహా రకరకాల వ్యాధులను నయం చేసే గుణాల గురించి పరిశోధించాలని మన కేంద్ర ప్రభుత్వం ఆదేశించింది. ఇది అశాస్త్రీయం, నిధులను దుర్వినియోగం చేయటం తప్ప మరొకటి కాదని ఈ నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని ఐదు వందల మంది శాస్త్రవేత్తలు కేంద్ర ప్రభుత్వాన్ని కోరినా వెనక్కు తగ్గలేదు. హోమియోపతి, అల్లోపతి, నేచురోపతి వంటి వాటి సరసన కౌపతిని చేర్చేందుకు పూనుకున్నారు. పుక్కిటి పురాణాల్లో రాసిన ఊహాజనితమైన వాటిని రుజువు చేసేందుకు డబ్బు దుర్వినియోగం తప్ప మరొకటి కాదు. ఉన్నత స్థాయిలో ప్రామాణికంగా పేర్కొన్న పరిశోధకుల పేర్లతో లండన్ లోని శాస్త్ర సమాచార సంస్థ 'క్లారివేట్' రూపొందించిన 6,602 మంది వివరాలను పరిశీలించినపుడు అమెరికా ప్రథమ స్థానంలో, తరువాత చైనా ఉంది. డెబ్బయి దేశాలకు చెందిన వారితో 2021 నవంబరు 16న ఈ వివరాలను ప్రకటించారు. తొలి ఐదు దేశాలకు చెందిన వారు 71.4 శాతం మంది కాగా, మొదటి పది దేశాలను తీసుకుంటే 82.9 శాతం ఉండటాన్ని బట్టి కేంద్రీకరణను అర్థం చేసుకోవచ్చు. అమెరికాలో 2,622, చైనాలో 935 మంది ఉన్నారు. గత పది సంవత్సరాలలో తమ పరిశోధనలతో గణనీయ ప్రదర్శన, ప్రచురించిన పత్రాల ఆధారంగా ఈ జాబితాను రూపొందించారు. వీరిలో 3,774 మంది ఒక నిర్ణీత రంగంలో, 2,828 మంది ఒకటి కంటే ఎక్కువ రంగాలలో పరిశోధనలు చేస్తున్నవారు ఉన్నారు. మూడవ స్థానంలో ఉన్న బ్రిటన్‌కు చెందిన వారు గత మూడు సంవత్సరాల్లో తగ్గి 492 లేదా 7.5 శాతంగా ఉన్నారు. జర్మనీని అధిగమించి ఆస్ట్రేలియన్లు 332 మంది నాలుగో స్థానంలో, 331 మందితో జర్మనీ ఐదవ, నెదర్లాండ్స్ (207), కెనడా (196), ఫ్రాన్స్ (146), స్పెయిన్ (109), స్విడ్జర్లాండ్ (102) తొలి పది స్థానాల్లో ఉన్నాయి. గతంతో పోల్చితే అమెరికన్లు 2014లో 55 శాతం, 2018 నాటికి 43.3, 2021కి 39.7 శాతానికి తగ్గారు. చైనీయులు 2018లో 7.9 శాతం కాగా 2021కి 14.2 శాతానికి పెరిగారు. చైనాలో 2014లో కేవలం 122 మంది మాత్రమే ఉన్నారు. గడచిన నాలుగు సంవత్సరాలలో చైనీయుల పెరుగుదల, అమెరికన్ల తగ్గుదల మరింత స్పష్టంగా కనిపిస్తోందని సీనియర్ విశ్లేషకుడు డేవిడ్ పెండెల్‌బరీ అన్నాడు. బ్రిటన్‌లో పరిశోధన తగ్గుతున్నది. హాంకాంగ్‌లో ఒక ఏడాది కాలంలోనే పరిశోధకుల సంఖ్య 40 నుంచి 79కి పెరిగింది. తొలిసారిగా బంగ్లాదేశ్, కువైట్, మారిషస్, మొరాకో, జార్జియా ఈ జాబితాకు ఎక్కాయి. క్లారివేట్ సంస్థ దేశాల జనాభా సంఖ్య-శాస్త్రవేత్తలతో పోల్చింది. నూట ముప్పై ఎనిమిది కోట్ల మంది ఉన్న భారత్‌లో 22 మంది, 22.1 కోట్ల మంది ఉన్న పాకిస్థాన్ నుంచి ఐదుగురు, 27.3 కోట్ల మంది ఉన్న ఇండోనేషియా నుంచి ఒక్కరు ఉన్నట్లు పేర్కొన్నది. ఇండోనేషియా నుంచి ఉన్న ఒక్కరు కూడా మహిళ కావటం విశేషం. ఆమె బయో ఫ్యూయల్ మీద పరిశోధనలు చేస్తున్నారు. సంస్థల వారీగా చూస్తే 1,300లో శాస్త్రవేత్తలు పని చేస్తున్నారు. హార్వర్డ్ విశ్వవిద్యాలయం 214 మందితో అగ్ర స్థానంలో ఉంటే చైనా సైన్స్ అకాడమీ 194 మందితో రెండవ స్థానంలో, స్టాన్‌ఫర్డ్ విశ్వవిద్యాలయం 122 మందితో తృతీయ స్థానంలో ఉంది. యాభై అగ్రశ్రేణి సంస్థలలో 28 అమెరికాలో, ఐదు బ్రిటన్, నాలుగేసి చైనా, ఆస్ట్రేలియాలో సింగపూర్, సౌదీ అరేబియాలో రెండేసి, హాంకాంగ్, జర్మనీ, కెనడా, నెదర్లాండ్స్, బెల్జియంలలో ఒక్కొక్కటి ఉన్నాయి. పరిశోధనా రంగంలో వివిధ దేశాలు పోటీ పడుతున్న తీరును చూశాము. ఊరందరిదీ ఒక దారి...ఉలిపి కట్టెది మరొక దారి... అన్నట్లుగా మనం ఉన్నాం. నరేంద్ర మోడీ సర్కార్ గత ఏడున్నర సంవత్సరాల్లో ఈ రంగానికి అందించిన ప్రోత్సాహంతో మనం పైన పేర్కొన్న పరిశోధకుల్లో 22 మందైనా ఉన్నారని భక్తులు భజనకు దిగవచ్చు. పరిశోధనలు, నవకల్పనల పాత్ర ఎంత కీలకమో చెప్పాల్సిన పని లేదు. దేశీయ ఆవుల అద్వితీయత, వాటి పాలు, పేడ, మూత్రంలో ఉన్న రోగనిరోధకత లేదా క్యాన్సర్‌తో సహా రకరకాల వ్యాధులను నయం చేసే గుణాల గురించి పరిశోధించాలని కేంద్ర ప్రభుత్వం ఆదేశించింది. ఇది అశాస్త్రీయం, నిధులను దుర్వినియోగం చేయటం తప్ప మరొకటి కాదని ఈ నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని ఐదు వందల మంది శాస్త్రవేత్తలు కేంద్ర ప్రభుత్వాన్ని కోరినా వెనక్కు తగ్గలేదు. విశ్వాసాల ప్రాతిపదికన ముందుకు తెస్తున్న కుహనా సైన్సును సక్రమమైనదిగా చెల్లుబాటు చేసే యత్నమని పేర్కొన్నారు. హోమియోపతి, అల్లోపతి, నేచురోపతి వంటి వాటి సరసన కౌపతిని చేర్చేందుకు పూనుకున్నారు. ఆవు మూత్రం, పాలు, పేడలతో చీడపీడల నివారణ మందులు, షాంపూలు, తల నూనెలు, నేలను శుభ్రం చేసే ద్రవాల వంటి వాటి తయారీకి పరిశోధనలు జరపాలని కేంద్రం నిధులు కేటాయించింది. పుక్కిటి పురాణాల్లో రాసిన ఊహాజనితమైన వాటిని రుజువు చేసేందుకు డబ్బు దుర్వినియోగం తప్ప మరొకటి కాదు. దీనికి "సూత్రా-పిక్ అని పేరు పెట్టారు ఆవు మూత్రంతో తన క్యాన్సర్ మాయమైందని బిజెపి ఎంపీ సాధ్వి ప్రజ్ఞా ఠాకూర్ ప్రకటించిన సంగతి తెలిసిందే. కేంద్రం వెనక్కు తగ్గలేదు సరికదా ఆవు శాస్త్ర పథకాలను వేగంగా అమలు జరిపి 2021 ఆగస్టు పదిహేనున ప్రధాని ప్రసంగానికి ముందే పురోగతిని చూపాలని కేంద్ర మంత్రి కేంద్ర మంత్రి హర్షవర్ధన్ ఏప్రిల్ నెలలో ఆదేశించారు. అనుమతులు, నిధుల మంజూరులో ఎందుకు జాప్యం చేశారంటూ అధికారుల మీద మండిపడ్డారు. ఆలస్యానికి సాకులు చెబితే కుదరదని హెచ్చరించారు. ప్రధాని నరేంద్ర మోడీకి దేశీయ ఆవులు ఎంతో ముఖ్యమని కూడా చెప్పారు. ఢిల్లీ ఐఐటి రూపొందించిన ఈ పథకంలో 2016 నుంచి ఎలాంటి పురోగతి లేదన్నారు. 2017లో తొలుత పంచగవ్య సుగుణాలను శాస్త్రీయంగా నిరూపించాలని ఆదేశించారు. తరువాత 2020లో దాన్ని మరింత విస్తరించి కొత్త పథకంగా ప్రారంభించారు. రాబోయే రోజుల్లో పెట్రోలు లేకుండా పైకీ కిందికీ, ఎందరెక్కినా ఒకరికి జాగా ఉండే పురాణాల్లోని విమానాలు, వినాయకుడు పాలు తాగాడు వంటి నమ్మకాలు, ఇతర ఊహలన్నింటినీ 2024 ఎన్నికల నాటికి ఫాస్ట్‌ట్రాక్ ప్రాజక్టులుగా చేపట్టి నిర్ధారించమని నిధులు కేటాయించినా ఆశ్చర్యం లేదు. చైనాతో పోటీ పడాలని, దేవుతలు కరుణిస్తే అధిగమించాలని మనం కోరుకోవటం తప్పు కాదు. స్టాటిస్టా డాట్‌కామ్ సమాచారం ప్రకారం 2021లో పరిశోధన-అభివృద్ధికి గాను చైనా పెట్టుబడి 621.5 బిలియన్ డాలర్లు కాగా అమెరికా 598.7, జపాన్ 182.36, జర్మనీ 127.25, భారత్ 93.48 బి.డాలర్లు. ఈ మొత్తం నుంచే ఆవు పాలు, పేడ, మూత్ర పరిశోధనలు జరుగుతున్నాయి. మన జనాలకు తెలివితేటలేమైనా తక్కువా, సోమరిపోతులు మరొకటి కాదే. అదృష్టం కోసం ఎదురు చూసే బాపతు కూడా గణనీయంగా ఉన్నందున కాళ్లు, చేతులూ చూసే, జోశ్యాలు చెప్పే రకరకాల మోనగాళ్లు తామర తంపరగా పెరిగిపోతున్నారు. మన అప్పును నరేంద్ర మోడీ 55 లక్షల కోట్ల నుంచి 130 లక్షల కోట్లకు పెంచటం పట్ల చూపిన శ్రద్ధ పరిశోధనకు కేటాయింపుల్లో లేదు. ఈ అంశంలో అంతకు ముందున్న వాజ్‌పేయి, మన్మోహన్ సింగ్ సర్కార్లు కూడా ఇంతకు మించి చేసేసిందేమీ లేదు. గేట్ వే హౌస్ డాట్ ఇన్ సమాచారం ప్రకారం 2000 సంవత్సరంలో జిడిపి లో మన పరిశోధన ఖర్చు 0.7 శాతం ఉంటే 2012 నాటికి 0.8 శాతం, ఇదే కాలంలో చైనా 0.9 నుంచి 1.8కి పెరిగింది. ప్రపంచబ్యాంకు సమాచారం ప్రకారం 2018లో చైనా 2.14 శాతం, మన దేశం 0.65 శాతం ఖర్చు చేసింది. రూపాయల్లో పెరుగుదల చూడండి అని ఎవరైనా అంటే చేసేదేమీ లేదు. వాటి విలువ సంగతేమిటని అడగాల్సి వస్తుంది. దేశభక్తి దేశభక్తి అని అరిస్తే, వేషాలు వేస్తే, ఇరుగు పొరుగు దేశాల గురించి కుట్ర సిద్ధాంతాలతో జనాలను భయపెడితే, ఆ సాకుతో అమెరికా నుంచి ఆయుధాలు కొనుగోలు చేస్తే, వారిని అధిగమిస్తాం వీరిని దాటి పోతాం, మా గత ఘనం చూడండి అంటే సరిపోతుందా? కృత్రిమ మేథలో కొన్ని రంగాల్లో ఇప్పటికే అమెరికాను అధిగమించి, మొత్తంగా సవాలు విసురుతున్న చైనాతో పోల్చుకుంటే మనమెక్కడీ నేచర్ ఇండెక్సు డాట్‌కామ్ ప్రకారం 2015-19 సంవత్సరాలలో అమెరికన్లు 7,020, బ్రిటీషర్లు 2,073, జర్మన్లు 1,756, చైనీయులు 1,446 ఆర్టికల్స్ ప్రచురిస్తే...మొదటి 25లో 20వ స్థానంలో ఉన్న మన వారివి 192 మాత్రమే. మనం గొప్పగా చెప్పుకొనే ఆంగ్ల భాషా జ్ఞానం, సంస్కృత పరిజ్ఞానం ఏమైనట్లు? ఆ రెండింటి లోనూ మనకంటే వెనుకబడిన చైనా శాస్త్ర పరిశోధనలో ఎందుకు ముందున్నట్లు? ఇతర దేశాల జనం ప్రపంచాన్ని చుట్టి వస్తుంటే మనం ఆవు చుట్టూ తిరుగుతున్నాం? తీవ్రంగా ఆలోచించాలా వద్దా ?

## గురివింద చందం

రాష్ట్రానికి చెందిన బిజెపి రాజ్యసభ సభ్యుడు సి.ఎం. రమేష్ రాష్ట్ర ప్రభుత్వంపై శుక్రవారం మీడియా ముఖంగా చేసిన వ్యాఖ్యలు అభ్యంతరకరమైనవి. రాష్ట్రంలో రాజ్యాంగ విరుద్ధ, ప్రజాస్వామ్య వ్యతిరేక రాజ్యం నడుస్తోందని, కేంద్రం జోక్యం చేసుకుంటుందని బహిరంగ బెదిరింపులకు దిగారు. ప్రధాని మోడీ టెలిస్కోప్‌లో చూస్తున్నారు, ఇక మీ ఆటలు సాగవు అని హెచ్చరించారు. ఐపిఎస్ అధికారులను రీకాల్ చేస్తాం జాగ్రత్తన్నారు. ఉన్నట్టుండి సి.ఎం. రమేష్‌కు ప్రజాస్వామ్య రక్షణపై ఎందుకు పూనకం పూనిందో తెలీదు. రాజ్యాంగం ప్రకారం అంతర్గత పోలీసింగ్ రాష్ట్రాల పరిధి లోని అంశం. అలాంటిది ఇక్కడ శాంతి భద్రతలపై కేంద్రం కల్పించుకుంటుందనడం సమాఖ్య స్ఫూర్తికి విఘాతం. రాష్ట్ర ప్రభుత్వ అధికారాల కబ్జా. రాష్ట్ర పోలీస్ కేడర్‌కు బదలాయించిన ఐ.పి.ఎస్ లను కేంద్రం రీకాల్ చేయడం కుదరదు. ఇప్పటి వరకు జరగలేదు. ఎం.పి గా సి.ఎం. రమేష్‌కు ఈ కనీస పరిజ్ఞానం లేదనుకోలేం. రాష్ట్ర ప్రభుత్వాన్ని తమ చెప్పు చేతల్లో పెట్టుకొనే ఎత్తులో భాగమే ఈ తరహా ఛీంకారాలు. ఒక్క సి.ఎం రమేష్ తోనే ఈ రంకెలు ఆగలేదు. మరో ఎం.పి జివిఎల్ సైతం అదే బాట పట్టారు. రామ్ మాధవ్ వంటి వారైతే రాష్ట్రంలో అవినీతిపై పోరాటం చేస్తామంటున్నారు.

రాజ్యాంగం, ప్రజాస్వామ్యంపై దాడులకు బిజెపి, ఆ పార్టీ ఏలుబడి లోని మోడీ ప్రభుత్వానిదే పేటెంట్. అలాంటి పార్టీ లోకి వ్యక్తిగత అవసరాల కోసం ఉన్నపళంగా ఫిరాయించిన సి.ఎం. రమేష్ వంటి వారికి రాజ్యాంగం, ప్రజాస్వామ్యం గురించి మాట్లాడే నైతిక హక్కు ఉంటుందా? కడప జిల్లా వాసిగా ఉన్న ఆయన విభజన హామీ కడప స్టీల్‌ప్లాంట్‌పై ఎప్పుడైనా రాజ్యసభలో మాట్లాడారా? ఉన్న విశాఖ స్టీల్‌ను తమ ప్రభుత్వం ప్రైవేటీకరించి తీరతామని పార్లమెంట్‌లో ఒకటికి పది సార్లు శపథం చేస్తుంటే ఉలుకు పలుకు లేదు. సి.ఎం రమేష్‌తో పాటు బిజెపి లోకి ఫిరాయించిన సుజనా చౌదరి అయితే ప్రైవేటువరం చేయాలంటున్నారు. రాష్ట్రానికి సంజీవనిగా పేర్కొనే ప్రత్యేక హోదా ముగిసిన అధ్యాయమని ఒక వైపు చెబుతూ మరో వైపు కొత్తగా పాండిచ్చేరి, బీహార్‌కు హోదా ఇస్తామంటుంటే సి.ఎం రమేష్ గొంతెందుకు పెగలట్లేదు. ఉత్తరాఖండ్‌కు హోదా ఉన్నందున అక్కడ ప్రాజెక్టులు పెట్టి రాయితీలు పొందుతున్న సి.ఎం రమేష్, సుజనా చౌదరి వంటి వారు విభజన కష్టాల్లో నిండా మునిగిన ఎ.పి కి కేంద్రం హోదా ఇవ్వనని తెగేసి చెప్పినా ఎందుకు వారి నోళ్లు మూతబడుతున్నాయి? పోలవరానికి నిధులు, వెనకబడ్డ రాయలసీమ, ఉత్తరాంధ్రకు నిధులపై కేంద్రం వద్ద ఎందుకు నిలదీయడం లేదు? ప్రజాస్వామ్యానికి దేవాలయంగా అభివర్ణించే పార్లమెంట్‌లో ఇచ్చిన హామీలపై కేంద్రం నాలుక మడత పెడుతుంటే ప్రజాస్వామ్యం గురించి బిజెపి నేతలు మాట్లాడడం గురివింద సామెతను గుర్తుకు తెస్తుంది.

రాజ్యాంగానికి, ప్రజాస్వామ్యానికి బిజెపి చేస్తున్న ద్రోహాలు అన్నీ ఇన్నీ కావు. నల్ల వ్యవసాయ చట్టాలకు వ్యతిరేకంగా ఏడాది పాటు ఢిల్లీ సరిహద్దుల్లో సాగిన రైతు ఉద్యమంపై సాగించిన నిర్బంధంపై దేశంలోనే కాదు, అంతర్జాతీయ సమాజం సైతం అభిశంసించింది. లఖింపూర్ ఖేరీ మారణకాండ బిజెపి అకృత్యాలకు పరాకాష్ఠ. సుప్రీం కోర్టు వేసిన సిట్ దర్యాప్తులో పక్కా ప్రణాళిక తోనే రైతుల పైకి కారును పోనిచ్చి హత్య చేశారని తేలింది. అయినా అందుకు బాధ్యుడైన కేంద్ర మంత్రి అజయ్ మిశ్రాను మోడీ ప్రభుత్వం మంత్రిగా కొనసాగించడం ప్రజాస్వామ్యం అవుతుందా? పార్లమెంట్‌పై బిజెపి కి విలువ లేదు. గత సమావేశాలను జరగనీకుండా చేసింది ప్రభుత్వమే. సమావేశాలను అడ్డుకున్నారంటూ 12 మంది విపక్ష సభ్యులను రాజ్యసభలో సస్పెండ్ చేసింది. ఎన్నికల సవరణ చట్టం వంటి కీలక బిల్లులపై చర్చ లేకుండా, సెలెక్టు కమిటీకి పంపాలన్న ప్రతిపక్షాల డిమాండ్‌ను తొక్కేసి ఏకపక్షంగా ఆమోదింపజేసుకుంది. చెప్పుకుంటూ పోతే బిజెపి రాజ్యాంగ విఘాతాలు కోకొల్లలు. బిజెపి రాష్ట్రాల్లో రాజ్యాంగ విరుద్ధ పాలన ఎంత దారుణంగా యు.పి లో కరోనా రోగులపై పెట్టిన కేసులే ఉదాహరణ. రాజ్యాంగం, ప్రజాస్వామ్యంపై బిజెపి నేతల ఉవాచలు రాజకీయ పెత్తనం కోసం తప్ప చిత్తశుద్ధితో కాదు.

# జనవరి 2న కీ.శే కొణిజేటి రోశయ్య సంస్మరణ సభ



గుంటూరు , ప్రజాపాలన ప్రతినిధి : రాజకీయ భీష్మాచార్యులు,మాజీ గవర్నర్,మాజీ ముఖ్యమంత్రి వర్యులు డాక్టర్ కొణిజేటి రోశయ్య సంస్మరణ సభను జనవరి 2వ తేదీన ఆదివారం సాయంత్రం 6 గంటల నుండి గుంటూరులోని శ్రీ వెంకటేశ్వర విజ్ఞాన మందిరంలో నిర్వహించాలని ఏపీ మద్య విమోచన ప్రచార కమిటీ రాష్ట్ర చైర్మన్ వల్లంరెడ్డి లక్ష్మణరెడ్డి తెలిపారు.ప్రముఖ వ్యాపారవేత్త డాక్టర్ బొమ్మిడాల శ్రీ కృష్ణమూర్తి అధ్యక్షులుగా,గుంటూరు రెడ్ క్రాస్ ఉపాధ్యక్షులు పి.రామచంద్రరాజు కన్వీనర్ గా 20 మందితో ఆహ్వాన సంఘం ఏర్పడిందన్నారు.సంస్మరణ సభకు ముఖ్య అతిథులుగా రాష్ట్ర హెూం శాఖా మాత్యులు మేకతోటి సుచరిత,దేవదాయ ధర్మదాయ శాఖా మాత్యులు వెల్లంపల్లి శ్రీనివాసరావు, ప్రధాన వక్తగా మాజీ మంత్రివర్యులు మండలి బుద్ధప్రసాద్ ప్రసంగిస్తారని వక్తలుగా రాజ్యసభ సభ్యులు మోపిదేవి వెంకటరమణ,ఆళ్ళ అయోధ్యరామిరెడ్డి,పార్లమెంటు సభ్యులు లావు శ్రీ కృష్ణ దేవరాయలు,శాసనమండలి సభ్యులు డొక్కా మాణిక్య వరప్రసాద్,కె.ఎస్ లక్ష్మణరావు, లేళ్ళ అప్పిరెడ్డి,శాసన సభ్యులు షేక్. ముస్తఫా,మద్దాలి గిరిధర్, గుంటూరు నగర మేయర్ కావటి మనోహర్ నాయుడు,సీపీఎం రాష్ట్ర కార్యదర్శి పి.మధు,సిపిఐ రాష్ట్ర కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు, బిజెపి అధికార ప్రతినిధి యన్.రఘునాథబాబు, బీజేపీ నేత జూపూడి రంగరాజు,కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ షేక్. మస్తాన్ వలీ,సీనియర్ నేత లింగం శెట్టి ఈశ్వరరావు,జనసేన రాష్ట్ర జనరల్ సెక్రటరీ బోనబోయిన శ్రీనివాస్ యాదవ్ తదితరులు పాల్గొని ప్రసంగిస్తారు.జనవరి 2న జరిగే సంస్మరణ సభకు గుంటూరు జిల్లాలోని మేధావులు, విద్యావేత్తలు,ప్రజాసంఘాల నేతలు, ఎన్జీవోస్,ప్రజానీకం పెద్ద ఎత్తున కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయవలసిందిగా విజ్ఞప్తి చేస్తున్నాము.

ఆహ్వాన సంఘం సమావేశంలో ప్రముఖ విద్యావేత్త ప్రొ" డియర్ సుబ్రహ్మణ్యం,రెడ్ క్రాస్ ఉపాధ్యక్షులు పి.రామచంద్రరాజు, సీనియర్ జర్నలిస్ట్ నిమ్మ రాజు చలపతిరావు,ప్రముఖ ఆడిటర్ కేవీ బ్రహ్మం,ప్రజాస్వామ్య పరిరక్షణ ఐక్యవేదిక నేత ప్రత్యూష సుబ్బారావు,తెలుగు భాషోద్యమ సమైక్య కన్వీనర్ డాక్టర్ వి.శింగారావు,కొండవీడు కోట అభివృద్ధి కమిటీ కన్వీనర్ కల్లి శివారెడ్డి తదితరులు పాల్గొని ప్రసంగించారు.



## సచివాలయ ఉద్యోగులకు యూనిఫాం పంపిణీ చేసిన ఎమ్మెల్యే రామిరెడ్డి

కావలి డిశంబర్ 28 ప్రజాపాలన ప్రతినిధి :కావలి మండల పరిషత్‌సర్వసభ్య సమావేశ మందిరంలో మంగళవారం ఎంపిడిఓ సుబ్బారావు అధ్యక్షతన గ్రామ సచివాలయ సిబ్బందికి యూనిఫాం పంపిణీ కార్యక్రమం నిర్వహించగా ముఖ్యఅతిథిగా కావలి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి చేతుల మీదుగా అందజేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ గాంధీజి కలలుకన్న గ్రామ స్వరాజ్యం సచివాలయ వ్యవస్థతోనే సాధ్యమని సచివాలయ వ్యవస్థ ద్వారా సమస్యలను పరిష్కారంకు ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి తీసుకొన్న నిర్ణయం హర్షించదగ్గ పరిణామం అన్నారు. సచివాలయాలు, వాలంటీర్ల వ్యవస్థతో నిరుద్యోగులకు రాష్ట్రంలో 4లక్షల పైచిలుకు ఉద్యోగ అవకాశాలు కల్పించిన ఘనత ముఖ్యమంత్రికే దక్కుతుందన్నారు. నేడు సచివాలయ సిబ్బంది వాలంటీర్లు, సమన్వయంగా పనిచేసి గ్రామీణ ప్రాంతాలలో ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలు అర్హులందరికి దరిచేరేలా కృషిచేయడం గర్వించదగ్గ విషయమన్నారు. గ్రామీణ ప్రాంతాలలో సచివాలయాలలో ప్రతినిత్యం జరుగుతున్న స్పందన కార్యక్రమాలలో సమస్యల పరిష్కారం జరుగుతుందన్నారు. 117మంది సచివాలయ సిబ్బందికి యూనిఫాం పంపిణీ చేసారు. వారిలో 26మంది మహిళలు ఉన్నారు. సచివాలయ సిబ్బందికి గుర్తింపు ఇచ్చేందుకు ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి యూనిఫాం ఇవ్వడం సంతోషించదగ్గ పరిణామం అన్నారు. యూనిఫాం ఉండటం క్రమ శిక్షణ, గుర్తింపు, బాధ్యతలను సచివాలయ ఉద్యోగులకు గుర్తు చేస్తుందని ఆయన అన్నారు. ఈకార్యక్రమంలో మండల పరిషత్ అధ్యక్షులు కొండమ్మ, జడ్‌పిటిసి సభ్యులు జంపాని రాఘవులు, వైస్ ఎంపిపి రాజయ్య, ఏఎంసి వైస్ చైర్మన్ కాటా శ్రీనివాసులురెడ్డి, పట్టణ వైసిపి నాయకులు కేతిరెడ్డి శివకుమార్‌రెడ్డి, రూరల్ వైసిపి నాయకులు సన్నిబోయిన ప్రసాద్ యాదవ్, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## రాజరత్న అశోక్ అంబేద్కర్ కు ఘన స్వాగతం పలికిన పూలే అంబేద్కర్ రాజ్యాధికార సమితి సభ్యులు



తిరుపతి, ప్రజాపాలన ప్రతినిధి : అంబేద్కర్ మునిమనవడు రాజ రత్న అశోక్ అంబేద్కర్ తిరుపతికి విచ్చేశిన సందర్భంగా వారితో కలిసి పూలే అంబేద్కర్ రాజ్యాధికార సమితి వైస్ ప్రెసిడెంట్ డాక్టర్ పి. పరమశివన్ ఎస్ వి యూనివర్సిటీ లోని అంబేద్కర్ విగ్రహానికి పూలమాల తో నివాళులర్పించి అక్కడి నుంచి నెల్లూరు జిల్లాలోని సూళ్లూరుపేట దగ్గర అంబేద్కర్ విగ్రహం వరకు వెళటం జరిగింది. ఈ కార్యక్రమం లో డాక్టర్ పి. పరమశివన్ డాక్టర్ యం ప్రభు డాక్టర్ వి ద్వారక ,శరణ్, ప్రమీల, బాలాజి సురేంద్ర తదితరులు పాల్గొన్నారు . అంబేద్కర్ దగ్గర మాట్లాడుతూ ఇది బాబాసాహెబ్ అంబేద్కర్ మనవడు నా అదృష్టం ఎస్ వి యూనివర్సిటీ యూనివర్సిటీ లో అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించిన వారిని ఘనంగా సత్కరించి తరువాత సూళ్లూరుపేట లో ఉన్నటువంటి అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేశారు.

## ఒలింపియాడ్ పరిక్షల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన శ్రీ చైతన్య విధ్యార్ధులు



కావలి డిశంబర్ 28మ ప్రజాపాలన ప్రతినిధి :కావలి పట్టణంలోని శాంతినగర్ లో ఉన్న శ్రీ చైతన్య బ్రాంచ్ నందు కెయోటి ఒలింపియాడ్ మొదటి స్థాయిలో పాఠశాలకు చెందిన విధ్యార్ధులు సత్తా చాటినట్లు పాఠశాల ప్రిన్సిపాల్ మంగళవారం ఒక ప్రకటన లో తెలిపారు. ఈ పరిక్షలలో 32 మంది విధ్యార్ధులు అత్యుత్తమ ప్రతిభ కనబరిచి రెండవ స్థాయికి అర్హత సాదించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా నిర్వహించిన అభినందన కార్యక్రమంలో నెల్లూరు జిల్లా శ్రీ చైతన్య స్కూల్స్ ఏ జె యమ్ కొండారెడ్డి ,శ్రీకాంత్ ,పాఠశాల ప్రిన్సిపల్స్ కైలేష్ కుమార్ ,అమర్ ,శ్రీ లేఖా సురేష్ ,పాఠశాల ఉపాధ్యాయునీ ,ఉపాధ్యాయులు పిల్లలను, అభినందించారు. రెండవ స్థాయిలో కూడా మంచి ఫలితాలను సాదించాలని వారు ఆకాంక్షించారు.

## కాంగ్రెస్ పార్టీ దేశ ప్రజలకు సంజీవని లాంటిది... :యం.రాధాకృష్ణ



చిలకలూరిపేట:(ప్రజాపాలన ప్రతినిధి) కాంగ్రెస్ పార్టీ అంటే దేశ సమస్యల పరిష్కార సంజీవని అని నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి యం.రాధాకృష్ణ అన్నారు. సంజీవని వంటి కాంగ్రెస్ పార్టీ ని ప్రజలు రక్షించుకుంటే ప్రజలను దేశాన్ని కాంగ్రెస్ పార్టీ కాపాడుతుందని అన్నారు. కాంగ్రెస్ పార్టీ 136 వసంతాలు పూర్తి చేసుకుని 137వ సంవత్సరం లోకి ప్రవేశిస్తున్న సందర్భాన్ని పురస్కరించుకొని ఎఐసిసి అధ్యక్షురాలు సోనియాగాంధీ, రాష్ట్ర అధ్యక్షులు సాకే శైలజానాథ్, పిలుపు మేరకు ఏర్పాటు చేసిన కార్యక్రమంలో భాగంగా కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలతో కలిసి జెండా ఆవిష్కరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ స్వతంత్ర పోరాట కాలం నుండి 2014 వరకు దేశాభివృద్ధికి ప్రజల సంక్షేమానికి చేసిన కృషి ని వివరిస్తూ పలువురు నాయకులు మాట్లాడారు. ఈ సందర్భంగా పార్టీ నాయకులు, కార్యకర్తలు ఏర్పాటు చేసిన కేకును కోసి నాయకులు కార్యకర్తలు ఒకరికొకరు తినిపించుకున్నారు. వచ్చే జనవరి నుంచి ప్రతి కాంగ్రెస్ కార్యకర్త ఇంటి మీద కాంగ్రెస్ జెండా ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కాంగ్రెస్ మాజీ కార్యదర్శి గోవిందు శంకర్ శ్రీనివాసన్, చిలకలూరిపేట నాదెండ్ల బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు బేతంచర్ల రామకోటేశ్వరరావు, ఉప్పుటూరి అనిల్ కుమార్ ,జిల్లా కాంగ్రెస్ ఉపాధ్యక్షులు చే రెడ్డి శ్రీ రామ్ రెడ్డి, జిల్లా కాంగ్రెస్ సేవాదళ్ అధ్యక్షులు జాష్టి నాగాంజనేయులు, చిలకలూరిపేట మండల కాంగ్రెస్ అధ్యక్షులు మద్దాలి శ్రీనివాసరావు, యడ్లపాడు మండల కాంగ్రెస్ నాయకులు సాగి మల్లికార్జునరావు, నియోజకవర్గ కాంగ్రెస్ మైనార్టీ సెల్ అధ్యక్షులు షేక్ నస్రుద్దీన్, యువ జన కాంగ్రెస్ నాయకులు ఇంటూరి భవానీ వెంకటేష్, ఎన్ ఎస్ యు ఐ అధ్యక్షులు షేక్ బాషా, కాంగ్రెస్ పార్టీ నాయకులు దార్ల రాజు, పేరేచర్ల రాఘవరాజు, మిరియాల వెంకటరత్నం, దాసరి శ్యాం బాబు, సుంకర హరిబాబు, నాదెండ్ల సుందర బాబు,అల్లం సుబ్బారావు, తాళ్ళూరి నాగేశ్వరరావు, కంభంపాటి కోటయ్య ,కంభంపాటి పున్నయ్య, ధనరాజుపల్లి లెవీ, టి.డేవిడ్ బ్రేనార్డు, టి.జాన్, ప్రత్తిపాటి శశి కుమార్, రాజుపాలెం కిరణ్, గోలి సాయి, కె ఇమానుయేల్, జి సుబ్బారావు, ఎస్ శ్రీనివాసరావు, పి సుష్మా,ఎన్ దీప్తి, జె శ్రీనివాసరావు, ఎన్ శంకర్ రావు, పల్లె పోగు రాజు, తులసి నాగరాజు, బొజ్జా వెంకటేశ్వర్లు, జి.పరమేశ్వర రావు,ఎస్ నాగేశ్వరరావు,తోపాటు పెద్ద సంఖ్యలో కార్యకర్తలు పాల్గొన్నారు.

## రూ.6 కోట్లతో నిర్మించిన నూతన గురుకుల పాఠశాలను సందర్శించిన ఎమ్మెల్యే



చిలకలూరిపేట:(ప్రజాపాలన ప్రతినిధి): ఈతరం పిల్లలు ఎంతో అదృష్టవంతులని శాసనసభ్యురాలు విడదల రజిని తెలిపారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో విద్యావ్యవస్థ తీరుతెన్నులు పూర్తిగా మారిపోయాయని పేర్కొన్నారు. మండలంలోని రాజాపేట గ్రామంలో ఏకంగా రూ.6 కోట్లతో నిర్మిస్తున్న గురుకుల పాఠశాల పనులు పూర్తయ్యాయి. భవన సముదాయాలన్నీ ప్రారంభోత్సవానికి సిద్ధంగా ఉన్నాయి. ఈ క్రమంలో పాఠశాలను మంగళవారం ఎమ్మెల్యే విడదల రజిని సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బడుగు, బలహీన వర్గాలకు చెందిన పిల్లలకు ఉచితంగా నాణ్యమైన విద్యను అందించే లక్ష్యంతో రాజాపేట గ్రామంలో గురుకుల పాఠశాలను అత్యాధునిక వసతులతో నిర్మించినట్లు చెప్పారు. ఇక్కడ నూతన పాఠశాల ఏర్పాటుకు తమ ప్రభుత్వం రూ.6 కోట్ల నిధులు కేటాయించిందని తెలిపారు. పనులు పూర్తయ్యాయని చెప్పారు. వారం, పది రోజుల్లో పాఠశాలను ప్రారంభించబోతున్నామన్నారు. ఆ మేరకు ఏర్పాట్లు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. చిలకలూరిపేట పట్టణంలో బస్టాండ్‌కు సమీపంలో అద్దె భవనంలో, అది కూడా రేకుల షెడ్డులో ఇప్పటి వరకు ఈ గురుకుల పాఠశాల నడుస్తోందని తెలిపారు. తాను శాసనసభ్యురాలిగా గెలిచిన వెంటనే ఆ పాఠశాలను సందర్శించానని, విద్యార్థుల కష్టాలు దగ్గరుండి చూశానని చెప్పారు. ఆ నిరుపేద పిల్లలకు అత్యాధునిక వసతులతో కూడిన భవన సముదాయం అందుబాటులోకి రావాలనే ఉద్దేశంతో నిధులు త్వరగా వచ్చేలా ప్రభుత్వంతో మాట్లాడానని, పెండింగ్ పనులన్నీ పూర్తిచేయించామని తెలిపారు. ప్రస్తుతం ఈ పాఠశాలలో 380 మంది పిల్లలు చదువుకుంటున్నారని, నూతన భవన సముదాయం అందుబాటులోకి వస్తే ఏకంగా 460 మంది పిల్లలకు ఇక్కడ చదువుకునే వీలు ఏర్పడుతుందని వెల్లడించారు. దీనివల్ల అడ్మిషన్లను మరింతగా పెంచుకోవచ్చని చెప్పారు. ఈ పాఠశాలలో విద్యార్థులకు ఉచితంగా ఆంగ్లమీడియం చదువులతోపాటు భోజనం, వసతి కూడా ఉచితంగా కల్పిస్తామన్నారు. నిరుపేద పిల్లలకు నాణ్యమైన విద్య అందించడం కోసం తమ ప్రభుత్వం వేల కోట్ల రూపాయలు ఖర్చు చేస్తోందని తెలిపారు. అమ్మ ఒడి, విద్యా దీవెన, విద్యావసతి, జగనన్న విద్యాకానుక, జగనన్న గోరుముద్ద, నాడు-నేడు, ఆంగ్లమీడియం... ఇలా విద్యావ్యవస్థలోకి ఎన్నో నూతన పథకాలను తీసుకొచ్చిన ఘనత తమ ప్రభుత్వానికే దక్కుతుందని వెల్లడించారు. ఈతరం పిల్లలు ఎంతో ధైర్యంగా ప్రభుత్వ పాఠశాలల్లో హుందాగా చదువుకోగలుగుతున్నారని తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు, సర్వశిక్ష అభియాన్ ఏఈ లక్ష్మణ్,ఎంపీపీ దేవినేని శంకరరావు,మునిసిపల్ చైర్మన్ షేక్ రఫాని,మార్కెట్ యార్డ్ చైర్మన్ మద్దిరాల విశ్వనాథం,జీడీసీసీ బ్యాంక్ డైరెక్టర్ ఆరుమళ్ల వెంకటశివ,మునిసిపల్ వైస్ చైర్మన్ కొలిశెట్టి శ్రీనివాసరావు,రాష్ట్ర ముస్లిం కార్పొరేషన్ డైరెక్టర్ షేక్ దరియా వలి,ఎంపీటీసీ మొహిద్దీన్,సర్పంచ్ మస్తాన్ వలి,జడ జతీన్ దేవ్,అప్పాపురం రమేష్,మేరం శ్రీను నాయకులు పెదవల్లి చిన్నబాబు,తొట్టెంపూడి శ్రీను,జిలాని,దండా నాగేశ్వరరావు,మాలెంపాటి రామారావు,మాలెంపాటి నరసింహారావు,కిలారు రవీంద్ర,మిన్నెకంటి రవీంద్రబాబు,నాగభైరు వెంకట్,జానీ, యూసుఫ్,నాగూర్,శివమణి,ఇక్కుర్తి పవన్,పల్లెపోగు చంటి మరియు పలువురు పాల్గొన్నారు.





## బాపులపాడు మండలం కె. సీతారామపురం గ్రామంలో నవరత్నాలు

గన్నవరం,ప్రజాపాలన ప్రతినిధి డిసెంబర్ 28: బాపులపాడు మండలం కె. సీతారామపురం గ్రామంలో నవరత్నాలు - పేదలందరికి పట్టాలు పంపిణీ కార్యక్రమంలో ముఖ్య అతిధిగా పాల్గొన్న ఎమ్మెల్యే వల్లభనేని వంశీ మోహన్ 118 మంది లబ్ధిదారులకు ఇళ్ల పట్టాలు అందజేశారు ఈ కార్యక్రమంలో ఎంపీపీ నగేష్ ,జడ్పీటీసీ గంగాభవానీ , కో ఆప్షన్ సభ్యులు ఎండి గౌసాని తహసీల్దార్ నరసింహారావు , నక్కా గాంధీ , అవిర్నేని శేషగిరి , సర్పంచ్ చెన్నుబోయన వెంకటలక్ష్మి పలువురు ప్రజాప్రతినిధులు , అధికారులు పాల్గొన్నారు.

## పడకేసిన పారిశుధ్యం



గన్నవరం,ప్రజాపాలన ప్రతినిధి డిసెంబర్ 28: గన్నవరం మండలం బీబీ గూడెం లో రామాలయం వద్ద పారిశుధ్యం పడకేసింది.నిత్యం భక్తులు వచ్చే దేవాలయాల వద్ద అపరిశుభ్ర వాతావరణం ఏర్పడినా అధికారులు పట్టించుకోవడం లేదనే విమర్శలొస్తున్నాయ్,బీబీ గూడెం లో రామాలయం పక్కనే ఉన్న డ్రైనేజీలో నీటి పారుదల సక్రమంగా లేక డ్రైనేజి పొంగి రోడ్డుపై మురుగునీరు చేరింది.. దీంతో దుర్వాసన వేదజల్లుతుందని, నడవడానికి కూడా తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి సమస్య ను పరిష్కారించాలని ప్రజలు కోరుతున్నారు.

## గ్రామీణ వైద్యులకు అండగా వైసీపీ ప్రభుత్వం: ఎమ్మెల్యే మల్లాది విష్ణు



విజయవాడ ప్రజాపాలన ప్రతినిధి : గ్రామీణ వైద్యులకు వైసీపీ ప్రభుత్వం అన్నివిధాలా అండగా నిలుస్తోందని ఎమ్మెల్యే మల్లాది విష్ణు అన్నారు. ముత్యాలంపాడు గోకరాజు గంగరాజు కళ్యాణ మండపంలో మంగళవారం గ్రామీణ వైద్యుల సంక్షేమ సంఘం 26వ వార్షికోత్సవం పురస్కరించుకుని శ్రీ తన్మయి ఆయుర్వేద హాస్పిటల్, పంచకర్మ సెంటర్ ఆధ్వర్యాన 'ఆయుర్వేదం-ఆరోగ్యం' అనే అంశంపై గ్రామీణ వైద్యులకు అవగాహన సదస్సు నిర్వహించారు. గ్రామీణ వైద్యుల సంఘం అర్బన్ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటైన ఈ సదస్సులో గౌరవ శాసనసభ్యులు ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మల్లాది విష్ణు మాట్లాడుతూ.. దేశీయమైన ఆయుర్వేదానికి ప్రాచుర్యం కల్పించడంలో గ్రామీణ వైద్యుల పాత్ర కీలకమని అన్నారు. దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర్ రెడ్డి హయాంలోనే గ్రామీణ వైద్యులకు గుర్తింపు లభించిందన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో 35వేల మంది గ్రామీణ వైద్యులు ఉన్నారని.. వీరంతా సంఘటితంగా తమ సమస్యలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువెళితే పరిష్కార దిశగా చర్యలు తీసుకుంటారని తెలియజేశారు. ప్రజల సమస్యల పరిష్కారంలో సీఎం జగన్మోహన్ రెడ్డి ఎల్లప్పుడూ ముందు ఉంటారని స్పష్టం చేశారు. అనంతరం ఎమ్మెల్యే మల్లాది విష్ణు ని శాలువా, జ్ఞాపికతో సత్కరించారు. కార్యక్రమంలో వైసీపీ కార్పొరేటర్ జానారెడ్డి, ప్రముఖ ఆయుర్వేద వైద్యురాలు డాక్టర్ పి. రత్నకుమారి, సంఘం నాయకులు ఎం.ఎన్.రాజు, పి.సత్యనారాయణ, ఎం.సత్యనారాయణ, కోశాధికారి శ్రీనివాస్, ప్రముఖ సంఘ సేవకులు రెవరెండ్ డాక్టర్ బందెల దయానందం, ఆర్ఎంపీ వైద్యులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## నియోజకవర్గ పరిశీలకులుగా గూడపాటి శ్రీనివాస్



కావలి డిశంబర్ 28 ప్రజాపాలన ప్రతినిధి : కావలి నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ పరిశీలకులుగా టిడిపి రాష్ట్ర కార్యదర్శి, రేపల్లె మున్సిపల్ మాజీ చైర్మన్ గూడపాటి శ్రీనివాస్‌ని నియమించడం జరిగినట్లు కావలి నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ కార్యాలయం మంగళవారం ఒక ప్రకటనలో తెలిపింది. ఈయన ఆధ్వర్యంలో కావలి తెలుగుదేశం పార్టీ బలోపేతం చేసే దిశగా వ్యూహాలు పన్నుతున్నట్లు తెలిపారు.



# ముంచుకొస్తున్న ముందస్తు యౌవనం

## బాలికలకు శాపమవుతున్న జీవనశైలి

మానసికంగా పరిపక్వత చెందని పసివారిలో కౌమారం ముందస్తుగా ముంచుకొస్తోంది. ప్రపంచవ్యాప్తంగా గడిచిన రెండు దశాబ్దాలుగా కనీస యుక్త వయసు ఏడాదిన్నర కాలం ముందుకు వచ్చినట్లు పలు దేశాల ఆరోగ్య సంస్థల నివేదికల ద్వారా తెలుస్తోంది. పట్టణ ప్రాంతాల్లో నివసించే బాలికల్లో దాదాపు 80శాతం 11 ఏళ్ల వయసులోనే రజస్వల అవుతున్నట్లు భారత ప్రసవ సంబంధ, గైనకాలజీ సొసైటీల సమాఖ్య పేర్కొంటోంది. సగటున 13.83 ఏళ్ల వయసుకు శరీరంలోని ప్రత్యుత్పత్తి అవయవాలు పరిపక్వత చెందాల్సి ఉండగా, ప్రపంచవ్యాప్తంగా ప్రతి ముగ్గురిలో ఒకరు ముందుగానే యౌవనంలోకి అడుగుపెడుతున్నట్లు పరిశోధనలు చెబుతున్నాయి. లైంగిక హార్మోన్ అయిన గొనడొట్రోపిన్ స్రావానికి ఉపకరించే హార్మోన్లను రక్తంలోకి విడుదల చేయడంద్వారా శరీరంలో యౌవన సంబంధిత మార్పులకు మెదడు పురిగొల్పుతుంది. ఆ రక్తం పిట్యుటరీ గ్రంథికి చేరడంతో బాలికల అండాశయంనుంచి ఈస్ట్రోజెన్, బాలురలో టెస్టోస్టిరాన్లు స్రవించడం ఆరంభం అవుతుంది. ఆ హార్మోన్లహాప్రభావంతో ప్రత్యుత్పత్తికి అనుకూలించే మార్పులు శరీర భాగాల్లో ఒక్కొక్కటిగా సంతరించుకుంటాయి. ప్రత్యుత్పత్తి పరమైన శారీరక మార్పులు సాధారణంగా వంశపారంపర్యంగా ఒక నిర్దిష్ట కాలంలో సంభవిస్తాయని శాస్త్రవేత్తలు పేర్కొంటున్నారు. ఆధునిక జీవనశైలి, ఆహారపు అలవాట్లవల్ల ఆ క్రమానుగత మార్పులు గతి తప్పుతున్నాయి. దాదాపు అన్ని దేశాల్లో బాలురకన్నా బాలికలు 10 రెట్లు అధికంగా ముందస్తు యౌవనాన్ని సంతరించుకుంటున్నారు. బాలికల్లోని అధిక బరువు పరోక్షంగా ఆ మార్పులు త్వరితగతిన సంభవించేందుకు కారణం అవుతోంది. గర్భధారణకు సరిపడే స్థాయిలో బాలిక బరువు ఉన్నట్లు పసిగట్టిన శరీరంలోని కొవ్వు కణజాలం రక్తంలోకి సంకేతాలను విడుదల చేస్తుంది. వాటిని అందుకున్న మెదడు యుక్త వయసు మార్పులను వేగవంతం చేస్తున్నట్లు శాస్త్రవేత్తలు అభిప్రాయపడుతున్నారు. శతాబ్దం క్రితం 16 ఏళ్లహావయసు పైబడిన తరవాతనే శరీరంలో సున్నితమైన మార్పులు చోటుచేసుకునేవి. ఇటీవలి కాలంలో అవి అందులో సగం వయసులోనే సంప్రాప్తిస్తున్నట్లు వారు విశ్లేషిస్తున్నారు. అధిక మాంసం ఉత్పత్తులకోసం పశు పక్ష్యాదులకు అమెరికావంటి దేశాల్లో టెస్టోస్టిరాన్, ఈస్ట్రోజెన్ హార్మోన్లను విచ్చలవిడిగా వాడుతున్నారు. ఆ మాంసాహారాన్ని ఎక్కువగా తినే 75శాతానికి పైగా పిల్లలు వేగంగా యౌవనంలోకి అడుగుపెడుతున్నట్లు అమెరికాకు చెందిన ఆహార, ఔషధ పాలన విభాగంహాహావెల్లడిస్తోంది. మన దేశంలోనూ అటువంటి పోకడలు పెచ్చుమీరుతున్నాయి. నిల్వ ఉంచిన ఆహారం, అధిక కేలరీలతో కూడిన తీపి పదార్థాలు, పానీయాలు శారీరక మార్పులపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయి. కొన్నిరకాల సబ్బులు, షాంపూలు, సౌందర్య సాధనాలు, ప్లాస్టిక్ వస్తువుల్లో వాడే రసాయనాలు సైతం హార్మోన్ల సమతౌల్యాన్ని దెబ్బతీస్తున్నాయి.

## బివిసి ఇంజినీరింగ్ కాలేజీ బస్సు తృటిలో తప్పిన ప్రమాదం..



అమలాపురం: అమలాపురం నుండి కొత్తపేట వెళ్తున్న బి వి సి ఇంజనీరింగ్ కళాశాలలకు చెందిన బస్సు ఈరోజు సాయంత్రం కొత్తపేట మండలం మోడేకుర్రు వద్ద అదుపుతప్పి కాలువలోకి వెళ్ళబోయింది..డ్రైవర్ చాకచక్యంగా అదుపులోకి తీసుకు రావడంతో పెనుప్రమాదం తప్పింది.. ఊపిరిపీల్చుకున్న విద్యార్థులు.

# రైతులకు మద్దతు ధర అందించేందుకు ధాన్యం కొనుగోలు



చీరాల(ఒంగోలు) : చీరాల మండలంలో పలు చోట్ల కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి, రైతులకు మద్దతు ధర అందించేందుకు, ఎమ్మెల్యే కరణం బలరామకృష్ణ మూర్తి, ఆయన తనయుడు కరణం వెంకటేష్ ల సహకారంతో ,ఫోటోరైటుం కృషి చేస్తున్నామని, రైతు భరోసా కేంద్రం అడ్వైజరీ బోర్డు కమిటీ చైర్మన్ కావూరి రమణారెడ్డి స్పష్టం చేశారు. మండలంలోని కావూరువారిపాలెం పంచాయతీలో ఆర్ బి కే సెంటర్ నందు, ధాన్యం కొనుగోలు విధానం గురించి, ప్రభుత్వం ప్రకటించిన మద్దతుధర వివరాలు రైతులకు వెల్లడించేందుకు, బోర్డుసమావేశం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ సలహా మండలి చైర్మన్ కావూరి రమణారెడ్డి హాజరై, వివరాలు వెల్లడించి, రైతులకు ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర, కొనుగోలు విధానంపై అవగాహన కల్పించారు. రైతుల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని, రైతుల శ్రేయస్సు కోసం, చీరాల ఎమ్మెల్యే కరణం బలరామకృష్ణమూర్తి, ఆయన తనయుడు కరణం వెంకటేష్ లు చేస్తున్న కృషి అభినందనీయమని, ఈ సందర్భంగా చైర్మన్ రమణా రెడ్డి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రైతులకు ధాన్యం కొనుగోలు విధానం గురించి వివరించారు. ప్రభుత్వము మద్దతు ధరను ప్రకటించింది. కామన్ రకం క్వింటాలుకు 1940, 75 కేజీలు బస్తా, 1455,గ్రేడ్ వన్ 1960రకం 75 కేజీలు బస్తా, 1470 గాను, ప్రభుత్వం నిర్ణయించిందని, రైతు సోదరులందరికీ తెలియజేయాలని, బోర్డు సమావేశంలో సభ్యులకు, అ ది. కా ం ల కు సూచించారు. మండలంలో గవినివారిపాలెం, కావూరి వారి పాలెం, ఈపురుపాలెం, చీరాల నగర్ లలో, కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. రైతుసోదరులు అందరూ, కొనుగోలు కేంద్రాల సేవలను రైతులందరూ, సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. వరి కోత దశలోనే ఉంది. కాబట్టి పదిహేను ఇరవై రోజుల్లో ధాన్యం వస్తుందని, ఆయా కొనుగోలు కేంద్రాలను, శాసనసభ్యులు కరణం బలరామకృష్ణమూర్తి చేతుల మీదగా, ప్రారంభించడం జరుగుతుందని తెలిపారు. ఈ సమావేశంలో ఆర్ బి కే అధికారిణి, బోర్డు సభ్యులు పాల్గొన్నారు.

# పోలేరమ్మ జాతరను వైభవోపేతంగా నిర్వహించుకుందాం : ఎమ్మెల్యే



కావలి డిశంబర్ 28 ప్రజాపాలన ప్రతినిధి : పోలేరమ్మ తల్లి అమ్మవారి జాతరను వైభవోపేతంగా నిర్వహించాలని ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి తెలిపారు. మంగళవారం ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్ కుమార్ రెడ్డితో పాటు వార్డ్ ఇన్చార్జితో మహేంద్ర యాదవ్ తో కలిసి ఆ ప్రాంతంలో పర్యటించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పేద,ధనిక, చిన్న,పెద్ద, ఎక్కువ,తక్కువ అనే సారుప్యాలు లేకుండా, అందరి మధ్య సాంస్కృతిక ఆచార వ్యవహార వారధిగా నిలిచే అమ్మవారి జాతర ఈ ఏడాది నుంచి క్రమం తప్పకుండా నిర్వహించు కుందామని వారు పేర్కొన్నారు. ఇప్పటికే అమ్మవారి జాతరలో క్రియాశీలకంగా వ్యవహరిస్తూ భాగస్వామ్యులు అయ్యే పాత ఊరు ప్రాంతంలోని వారితో సన్నాహక సమావేశం జరిగేలా చేశారు. పాత ఊరులో పాత కాలం నాటి 'పోలేరమ్మ తల్లి అమ్మవారి జాతర' నిర్వహించే సంప్రదాయాన్ని, భవిష్యత్తు తరాలు కూడా వారసత్వంగా కొనసాగించేలా ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి నిర్ధిష్టమైన శాశ్విత కార్యాచరణ ప్రణాళికకు రంగం సిద్ధం చేయడం పట్ల పాత ఊరు ప్రాంతంలోని అందరిలో ఆసక్తి కలిగిస్తోంద ని మహేంద్ర యాదవ్ తెలియజేశారు. పండగ, ఉత్సవం, జాతర, తిరునాళ్లు ఏదైనా అందర్నీ ఒక తాటిపై తెచ్చే భక్తిపూర్వకమైన వేడుకని చెప్పారు. జనవరి 9,10,11, 12 తేదిలలో పోలేరమ్మ తల్లి అమ్మవారి జాతర ఆచారాలను అనుసరిస్తూ నిర్వహించడానికి పెద్దలు నిర్ణయించినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో అమ్మవారు జాతర జరిగే ప్రాంతాల్లో ఆర్డీవో శీనానాయక్, డీఎస్పీ ప్రసాద్, మున్సిపల్ కమిషనర్ శివారెడ్డి, డీఈ శ్రీనివాసరావు, పాత ఊరు ప్రాంతానికి చెందిన పెద్దలతో కలిసి పర్యటించి ఏర్పాట్లు పై ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్ కుమార్ రెడ్డి చర్చించారు.

# టిడిపి పార్టీ ఆధ్వర్యంలో భారీ ర్యాలీ

### మాచర్ల టిడిపి పార్టీకి పూర్వవైభవం వచ్చేనా!!!



గుంటూరు, ప్రజాపాలన :టిడిపి పార్టీ మాచర్ల నియోజకవర్గ ఇన్చార్జిగా నియమితులైన జూలకంటి బ్రహ్మారెడ్డి మొట్టమొదటిసారిగా మాచర్ల కు విచ్చేయుచున్న సందర్భంగా మండలంలోని పేటసన్నగండ్ల గ్రామం నుండి మాచర్ల కు భారీ ర్యాలీ నిర్వహిస్తున్నట్లు టిడిపి పార్టీ మండల అధ్యక్షులు లక్ష్మీనారాయణ మంగళవారం తెలిపారు. గతంలో టిడిపి కంచుకోటగా ఉన్న మాచర్ల నియోజకవర్గం ప్రస్తుతం వైఎస్సార్సీపీ కి కంచుకోటగా మారింది. దాదాపుగా టిడిపి పార్టీ చతికిలపడింది. దీంతో నూతన నాయకత్వం కోసం ఎదురుచూస్తున్నా నియోజకవర్గ ప్రజలకు జూలకంటి బ్రహ్మారెడ్డి ఇన్చార్జిగా ప్రకటించడంతో కార్యకర్తల్లో ఉత్సాహాన్ని నింపింది. బ్రహ్మారెడ్డి కుటుంబం గతంలో రెండు సార్లు ఎమ్మెల్యేగా గెలవడంతో ఇతనికి మాస్ లీడర్ పేరు ఉండటం మాచర్ల నియోజకవర్గంలో పార్టీకి కార్యకర్తలలో నూతన ఉత్తేజాన్ని నింపింది. ఇదిలా ఉండగా రేపు జరగబోయే ర్యాలీకి భారీ జన సమీకరణ చేసేందుకు నియోజకవర్గ టిడిపి నాయకులు సమాయాత్తం అవుతున్నారు. ఇది ఎంతవరకు ఫలిస్తుందో వేచి చూడాల్సిన పరిస్థితి నెలకొంది. నియోజకవర్గంలో టిడిపి నాయకులలో ఇప్పటికే వర్గ విభేదాలు ఉన్నాయి. దీనితో ఈ ర్యాలీ అందరూ కలిసికట్టుగా విజయవంతం చేస్తారా లేదా ఎవరికి వారే యమునా తీరే అనే చందంగా ఉంటుందా. నియోజకవర్గంలో టిడిపి పార్టీ పుంజుకుటుందా అనేది రేపు జరగబోయే ర్యాలీ చెప్పవచ్చని కార్యకర్తలు అనుకుంటున్నారు ఇదిలా ఉండగా టీడీపీలోని యువత భారీ స్థాయిలో పాల్గొనేందుకు ఉత్సాహం చూపుతున్నారు బ్రహ్మారెడ్డి మాచర్ల ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి కి సరైన పోటీదారుడు అని టిడిపి పార్టీలను కార్యకర్తలు బహిరంగంగానే చెప్పుకుంటున్నారు బ్రహ్మ రెడ్డి రాకతో నియోజకవర్గం లోని తెలుగుదేశం పార్టీకి పూర్వ వైభవం వచ్చినట్లే అని కార్యకర్తలు అభిమానులు ర్యాలీలో పాల్గొని విజయవంతం చేసేందుకు కృషి చేస్తున్నారు..

# జె యెన్ టి యు అధ్యాపకునికి డాక్టరేట్



నరసరావుపేట .ప్రజా పాలన :స్థానిక జె యెన్ టి యు అధ్యాపకుడు కూరాకుల విమల కుమార్ కు డాక్టరేట్ ప్రధానం జరిగిందని కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ సి. హెచ్ శ్రీనివాసరావు గారు మంగళ వారం తెలిపారు. ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఇంజనీరింగ్ డిపార్ట్మెంట్ లో అసిస్టెంట్ ప్రొఫెసర్ గా విధులు నిర్వహిస్తున్నారు. " మల్టీ ఏరియా పవర్ సిస్టం రెస్పాన్స్ ఎంహెన్సమెంట్ అండర్ డి రెగ్యులేటెడ్ ఎన్విరాన్మెంట్ యూసింగ్ ఎల్.ఎఫ్.సి. ఎంప్లోయింగ్ ప్రాక్షనల్ ఆర్డర్ కంట్రోలర్స్" అనే అంశం పై జె యెన్ టి యు అనంతపురం ఇంజనీరింగ్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ పి. సుజాత గారి పర్యవేక్షణ లో డాక్టరేట్ పొందారు. డాక్టరేట్ పొందిన కూరాకుల విమల కుమార్ గారిని ప్రిన్సిపాల్ సి. హెచ్. శ్రీనివాసరావు గారు, వైస్ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ కె శోభన్ బాబు గారు, మాజీ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ వి.వి. సుబ్బారావు గారు మరియు ఇతర విభాగ అధిపతులు అభినందించారు.

# మత్స్యకార ప్రాంత అభివృద్ధికి కృషి చేస్తా : ఎమ్మెల్యే ఆర్.పి.ఆర్



కావలి, డిసెంబర్ 28 ప్రజాపాలన ప్రతినిధి :మత్స్యకార ప్రాంత అభివృద్ధికి కృషి చేస్తానని ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్ కుమార్ రెడ్డి తెలిపారు. మంగళవారం మండలంలోని పెద్ద పట్టపు పాలెం రోడ్డు నిర్మాణం శంకుస్థాపన పనులను ఎమ్మెల్యే దంపతులు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ త్వరలో నియోజకవర్గానికి పదికోట్ల రూపాయల నిధులు వస్తున్నాయని తెలిపారు. ఎక్కువభాగం తీర ప్రాంత అభివృద్ధికి నిధులు ఖర్చు చేయనున్నట్లు ఆయన పేర్కొన్నారు. చేపల వేటకు పోవటానికి రోడ్డు నిర్మాణం కావాలని ఇక్కడి ప్రజలు కోరడం జరిగిందని ఎమ్మెల్యే తెలిపారు. చెన్నయ్య పాలెం పంచాయతీలో సిమెంట్ రోడ్లు త్వరలో నిర్మాణ పనులు చేపట్టడం జరుగుతుందని అన్నారు. వేట విరామ సమయంలో 7 వేల మంది మత్స్యకారులకు ప్రభుత్వం సంక్షేమ కార్యక్రమాలను చేపడుతుందని చెప్పారు. పంచాయతీలోఈ కార్యక్రమంలో వైసిపి పట్టణ అధ్యక్షులు కేతిరెడ్డి శివ కుమార్ రెడ్డి, ఎంపీడీవో సుబ్బారావు, జెడ్పిటిసి జంపని రాఘవులు సర్పంచి సరోజనమ్మ, ఎంపిటీసీ యాదగిరి మాజీ సర్పంచ్ శ్రీనివాసులు, సన్నీ బోయిన ప్రసాద్, తుళ్లూరు శ్రీనివాసులు చైతన్య పాల్గొన్నారు.

# చీఫ్ జస్టిస్ రమణ కు అట్లూరి వినతి



కావలి డిశంబర్ 28 ప్రజాపాలన ప్రతినిధి :అమరావతి పర్యటనకు విచ్చేసిన సుప్రీంకోర్టు చీఫ్ జస్టిస్ రమణ కు సనాతన సాంప్రదాయ రక్షణ, హిందూ దేవాలయాల భద్రత పై సేవ్ ది టెంపుల్స్ ఎ.పి.శాఖ అధ్యక్షుడు, సినీ నిర్మాత, కావలి వాసి అట్లూరి నారాయణరావు వినతి పత్రం సమర్పించారు. అమరావతి లో ఆయనను కలిసి తెలుగు వారి గా అత్యున్నత స్థాయి లో ఉన్నందుకు అభినందనలు తెలిపారు. తెలుగు కీర్తిని చాటిన ప్రముఖుల వలె న్యాయమూర్తి గా తమ విధులలో కీర్తి సాధించాలని కోరుతూ ధ్వంసం అవుతున్న సనాతన ధార్మిక సాంప్రదాయ, సాంస్కృతిక రక్షణకు , దేవాలయాల పరిరక్షణ కు ప్రత్యేక దృష్టి పెట్టాలని, సేవ్ ది టెంపుల్స్ పేరుతో తమ సంస్థ చేస్తున్న ఆధ్యాత్మిక సేవలను సి.జె.రమణకు వివరించగా ఆయన సానుకూలంగా స్పందించారు.

# ఎమ్మెల్యే కుటుంబం చేసిన అవినీతికి బలైన భవన నిర్మాణ కార్మికులు

## నరసరావుపేట నియోజకవర్గ టీడీపీ ఇన్-ఛార్జ్ డా.చదలవాడ అరవింద బాబు

నరసరావుపేట. ప్రజాపాలన : బినరసరావుపేట ఎమ్మెల్యే గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి కుటుంబ సభ్యులు చేసిన ఇసుక మాఫియాకు భవన నిర్మాణ కార్మికుల జీవితాలు రోడ్డున పడ్డాయని నరసరావుపేట నియోజకవర్గ టీడీపీ ఇన్-ఛార్జ్ డా.చదలవాడ అరవింద బాబు ఆవేదన వ్యక్తం చేశారు. నరసరావుపేటలోని బాబాపేటలో నిర్వహించిన ప్రజా చైతన్య యాత్రలో నరసరావుపేట నియోజకవర్గ టీడీపీ ఇన్-ఛార్జ్ డా.చదలవాడ అరవింద బాబు పాల్గొని ఇంటింటికీ తిరిగి ప్రజల సమస్యలను తెలుసుకున్నారు. వార్డులో ఉండే ప్రజలంతా ఇసుక అందుబాటులో లేక భవన నిర్మాణ కార్మికులకు కొంతమందికే ఉపాధి ఉంటుందని చాలీ చాలని సంపాదనతో ఇబ్బందులను ఎదుర్కుంటున్నామని భవన నిర్మాణ కార్మికులు తమ బాధను డా.చదలవాడకు వివరించారు. అనంతరం డా.చదలవాడ అరవింద బాబు మాట్లాడుతూ జిల్లా కేంద్రం కాబోతున్న నరసరావుపేటలో ప్రభుత్వ ఇసుక డంపింగ్ యార్డ్ లేకపోవడానికి కారణం ఎమ్మెల్యే కుటుంబ సభ్యులు భారీగా అవినీతికి పాల్పడి ప్రభుత్వ ఇసుక డంపింగ్ యార్డ్ లో ఉండాల్సిన ఇసుక నిల్వలు అనధికారికంగా ప్రైవేట్ స్థలంలో ఇసుకను నిల్వ చేసుకొని తమ స్వంత ఏజెంట్ల ద్వారా రియల్ ఎస్టేట్ వ్యాపారస్తులకు అధిక ధరలకు అమ్ముకొని సామాన్యులకు ఇసుక అందుబాటులో లేకుండా చేశారని ఎమ్మెల్యే కుటుంబం చేసిన అవినీతి వలన నరసరావుపేటలోని సత్తెనపల్లి రోడ్ లో ప్రజలకు అందుబాటులో ఉండాల్సిన ప్రభుత్వ ఇసుక డంపింగ్ యార్డ్ ను ప్రభుత్వం రద్దు చేసిందని ప్రభుత్వ ఇసుక డంపింగ్ యార్డ్ను నరసరావుపేటకు కేటాయించే విధంగా ప్రజలంతా ఐక్య ఉద్యమం చేపట్టాలని సూచించారు. తెలుగుదేశం పార్టీ అధికారంలో ఉండగా ప్రతి సామాన్యునికి సైతం ఇసుక అందుబాటులో ఉంచి భవన నిర్మాణ కార్మికులకు అండగా ఉందని తెలిపారు. వారి సమస్యల పై సాగించే అందోళనలో తాము పాలుపంచుకుంటామని నరసరావుపేట నియోజకవర్గ టీడీపీ ఇన్-ఛార్జ్ డా.చదలవాడ అరవింద బాబు అన్నారు. కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వం కార్మికులకు వెంటనే ఉపాధి భృతి కింద ఒక్కొక్క కుటుంబానికి 10000/-రూ విడుదల చేయాలని కోరారు. ఒక వైపు నిత్యావసర వస్తువుల ధరలు ఆకాశాన్ని అంటుతుండగా భవన నిర్మాణ కార్మికులు,చేతివృత్తుల వారికి పనులు లేక ఎలా జీవనం సాగించాలని అవేదన వ్యక్తం చేశారు. నిర్మాణ రంగం కార్మికులు తమ సమస్యల పరిష్కారం కోసం ఏ ఆందోళన కైనా సరే టీడీపీ పూర్తి మద్దతు ఉంటుందని డా.చదలవాడ అరవింద బాబు అన్నారు. ఈ కార్యక్రమంలో పార్లమెంట్ లీగల్ సెల్ అధ్యక్షులు రావెల లక్ష్మీ నారాయణ,మైనార్టీ నాయకులు మన్నన్ షరీఫ్,బడె బబు,వార్డ్ నాయకులు మోహన్, గడ్డం కరిముల్లా,మబు,మీరవాలి,పెద్ద కరిముల్లా,పొట్టు గౌస్,వన్నూరు బుడే,మస్తాన్ వలి,పెరికాల రాయప్ప,సైదవాలి,ఖాలీల్,బంగారం, తదితరులు ఉన్నారు.



# బాలీవుడ్ ను మించిపోతున్న సౌత్ ఇండస్ట్రీ

పాశ్చాత్య చిత్ర పరిశ్రమకు హాలీవుడ్ ఎలాగో.. ఇండియన్ సినిమాకు బాలీవుడ్ అలా. ప్రపంచం దృష్టిలో భారతీయ సినిమా అంటే హిందీ సినిమా. ఐతే, ఇప్పుడు ఆ ముద్ర చెరిగిపోతోంది. అసురన్, జైభీమ్, పుష్ప వంటి సినిమాలు బాలీవుడ్‌పై టాలీవుడ్ పై చేయి సాధిస్తోంది అని చెప్పటానికి ఉదాహరణలు. అసురన్ పలు అంతర్జాతీయ అవార్డులు గెలుచుకోగా.. జై భీమ్ భారీ హాలీవుడ్ సినిమాలను తలదన్ని ఇంటర్నెట్ టాపర్‌గా నిలిచింది. అల్లు అర్జున్ పుష్ప వసూళ్లలో దూసుకుపోతోంది. ఇప్పటికే 170 కోట్లు వసూలు చేసిన పుష్ప త్వరలో రెండు వందల కోట్ల క్లబ్‌లో చేరేందుకు పరుగులు తీస్తోంది. ఏ రకంగా చూసినా ఇండియన్ సినిమా అంటే కేవలం బాలీవుడ్ మాత్రమే కాదనటానికి ఇది ఒక నిదర్శనం. ఇప్పుడు, హిందీ సినిమాల కన్నా దక్షిణాది భాషా చిత్రాలనే జనం ఎక్కువగా ఆదరిస్తున్నారని ఇటీవల హిందీలో పెరుగుతున్న రీమేక్‌లే చెబుతున్నాయి. నిజానికి దక్షిణాది సినిమాలు హిందీలో రీమేక్ అవటం కొత్త కాదు..నాటి ఏక్ దుజే కేలియే నుంచి నిన్నటి బాహుబలి వరకు ఎన్నో సినిమాలను అందుకు ఉదాహరణలు. సల్మాన్ ఖాన్‌ని బాలీవుడ్ భాయిజాన్‌ని చేసింది ఏక్ థా టైగర్, దబాంగ్ కాదు, తెలుగు రీమేక్ "వాంటెడ్". 2006లో మహేష్ బాబు నటించిన పోకిరి సినిమాని పదేళ్ల తరువాత హిందీలో తిరిగి తీశారు. దాదాపు వందకోట్లు రాబట్టింది ఆ సినిమా. అంతేకాదు, సల్మాన్ ఖాన్ కెరీర్‌కు టర్నింగ్ పాయింట్ అయింది. 2006లో రవితేజ నటించిన విక్రమార్కుడు, అక్షయ్ కుమార్ హీరోగా 2012లో రౌడీ రాథోడ్‌గా వచ్చింది. రామ్ నటించిన రెడీ (2008) సల్మాన్ హీరోగా 2011లో అదే పేరుతో రీమేక్ అయింది. విజయ్ దేవరకొండ నటించిన అర్జున్ రెడ్డిని 2019లో షాహిద్ కపూర్ హీరోగా హిందీలో పునర్నిర్మించారు. దక్షిణాది సినిమాలు హిందీలో రీమేక్ చేయటం కొత్త కాదు. దశాబ్దాలుగా వస్తోంది. ఐతే, ఇప్పుడు ఎంటర్‌టెయిన్‌మెంట్ రంగంలో ఓటీటీలు ప్రముఖ స్థానం ఆక్రమించాయి. లివింగ్‌రూంలో కూర్చుని నచ్చిన సినిమా చూడగలుగుతాము. ఏ భాష సినిమా కావాలంటే ఆ భాష సినిమా చూడొచ్చు. అలాగే, దక్షిణాది సినిమాలకు రోజు రోజుకు దేశ వ్యాప్త మార్కెట్ పెరుగుతోంది. దాంతో అక్కడి చెందిన ఫిలింమేకర్స్ ఏక కాలంలో వివిధ భాషలలో తమ సినిమాలను విడుదల చేస్తున్నారు. కాబట్టి ఇక ముందు రీమేక్‌ల వేగం తగ్గొచ్చని సినీ పండితులు అంటున్నారు. ఓటీటీ కల్చర్ విస్తృతమవుతున్న వేళ బాలీవుడ్ రేస్‌లో దక్షిణాది సినిమాలకు భాషా పరమైన అడ్డంకి తొలగిపోతోంది. అల్లు అర్జున్ తాజా హిట్ పుష్ప హిందీ వెర్షన్ మహారాష్ట్ర, గుజరాత్, ఒడిషా, బిహార్‌లో మంచి వసూళ్లు సాధిస్తోంది. కాబట్టి, సినిమాలో విషయం ఉంటే జనం ఆదరిస్తారనటానికి ఇదో ఉదాహరణ . దక్షిణాది చిత్రాలు, ముఖ్యంగా తమిళ్, తెలుగు సినిమాలు ఈ విషయంలో హిందీ సినిమాల కన్నా చాలా ముందున్నాయి. దక్షిణాది దర్శకులు ప్రేక్షకుల అభిరుచిని కనిపెట్టి సినిమాలు తీస్తారు. అందుకు అనుగుణంగా కథలు సృష్టిస్తారు. అందుకే, ప్రభాస్, మహేష్ బాబు , జూనియర్ ఎన్టీఆర్, రామ్ చరణ్,అల్లు అర్జున్ సినిమాలకు దేశ వ్యాప్తంగా ఆదరణ లభిస్తోంది. అలాగే తమిళంలో రజనీకాంత్, కమల్‌హాసన్, విజయ్, అజిత్ నటించిన చిత్రాలకు కూడా దేశ విదేశాల్లోని భారతీయుల నుంచి అద్భుతమైన ఆదరణ లభిస్తోంది. దక్షిణాది ఫిలిం మేకర్స్ అందరూ మెచ్చే కథాంశాలకు అధిక ప్రాధాన్యం ఇవ్వటం వల్లే అవి చిన్న చిన్న పట్టణాల నుంచి మహానగరాల ప్రేక్షకుల వరకు అందరి ఆదరణ పొందుతున్నాయి. కానీ, బాలీవుడ్ నిర్మాత, దర్శకులు కేవలం మల్టీప్లెక్స్ ప్రేక్షకుల కోసమే సినిమాలు తీస్తున్నట్టు కనిపిస్తోంది. అలా తీయటం తప్పుకాదు..కానీ అదే సమయంలో సామాన్య ప్రేక్షకుల అభిరుచులను విస్మరించకూడదు. చాలా కాలంగా బాలీవుడ్ ఫిలింమేకర్స్ చేస్తున్న పొరపాటు ఇదే. మరోవైపు, ఓటీటీల పుణ్యమా అని సౌత్ స్టార్లకు దేశం అంతటా గిరాకీ పెరిగింది. పలువురు దక్షిణాది హీరోలు పాన్ ఇండియా మార్కెట్ ఉంది. పెద్ద మొత్తంలో రెమ్యూనిరేషన్ డిమాండ్ చేస్తున్నారు. బాహుబలి తరువాత ప్రభాస్ రేంజ్ మారిపోయింది. ఇప్పుడు ఆయన సినిమాలకు దేశ వ్యాప్తంగా డిమాండ్ ఉంది. అర్జున్ రెడ్డి డైరెక్టర్ సందీప్ వంగ సినిమాకు 150 కోట్లు డిమాండ్ చేసినట్టు టాలీవుడ్ టాక్. ప్రభాస్ చివరి చిత్రం సాహూ ప్రేక్షకులను పెద్దగా ఆకట్టుకోలేకపోయినా నిర్మాతలను నష్టాల పాలయితే చేయలేదు. ఈ నేపథ్యంలో సౌత్ సినిమా బాలీవుడ్‌ను అధిగమిస్తుందా? అనే ప్రశ్న రాకుండా ఉండదు. ఇప్పుడు భారతీయ సినిమాలో నవశకం నడుస్తోంది. వంద రోజుల ఫంక్షన్లు ..సిల్వర్ జూబ్లీలు గోల్డెన్ జూబ్లీలు లేని శకం. నిజానికి సిని పరిశ్రమ వీటికి ఏనాడో దూరమైంది, అది వేరే సంగతి. కానీ..ఇప్పుడు ఓటీటీ తరం భాషా అడ్డుగోడలను కూల్చుతోంది. బాలీవుడ్ సినిమా కావచ్చు..శాండల్‌వుడ్ సినిమా కావచ్చు. సినిమా నచ్చాలి అంతే. హిందీ, మరాఠీ, బెంగాలీ, తమిళం, తెలుగు, భోజ్‌పురి..నచ్చిన సినిమాని ఇంట్లో కూర్చుని చూస్తున్నారు. కాబట్టి, ఈ సంధికాలంలో ప్రేక్షకులను థియేటర్లకు రప్పించటం సినీ రంగం మీద ఉన్న పెద్ద బాధ్యత. ఓటీటీ సినిమాలకు అలవాటు పడిన వారు థియేటర్‌కు రప్పించాలంటే జనరంజక సినిమాలు ఎక్కువగా రూపొందించాల్సిన అవసరం ఉంది. ప్రేక్షకులకు నచ్చింది ఇవ్వాలి.. లేదంటే దానిని వారు వేరే చోట వెతుక్కుంటారు. ఈ సూత్రాన్ని బాలీవుడ్ ఫిలిం మేకర్లు కూడా తెలుసుకుంటే మంచిది. నిజానికి దక్షిణ భారతదేశంలోని భాషా చిత్ర పరిశ్రమలకు తమవైన ఎన్నో ప్రత్యేకతలు ఉన్నాయి. భాషా పరంగా..సంస్కృతి..సాంప్రదాయల పరంగా వాటికి గొప్ప చరిత్ర ఉంది. తెలుగు, తమిళ, కన్నడ, మళయాలీ చిత్ర పరిశ్రమలకు నాణ్యతా పరంగానే గాక సంఖ్యా పరంగానూ గొప్ప పేరుంది. కాలంతో పాటు అనేక ప్రయోగాలు చేస్తున్నాయి. 'బాహుబలి' వంటి జానపథ గాథ నుంచి ఎంథిరన్ వంటి ఉన్నత సాంకేతిక విలువలతో కూడిన అనేక సినిమాలు దక్షిణాది నుంచే వచ్చాయి. 'సూపర్ డీలక్స్' వంటి థ్రిల్లింగ్ ఎక్సపర్మెంట్లు కూడా దక్షిణాది ఫిలిం మేకర్స్ నుంచి వస్తాయి. 'రాకెట్రీ: ది నంబి ఎఫెక్ట్,' వంటి సినిమాలు దక్షిణాది సినీ పరిశ్రమకు ఏ ఫార్ములా లేదని నిరూపిస్తున్నాయి. మరోవైపు, హిందీ పరిశ్రమలో చాలా వరకు సాహసాలు ఉండవు. హీరోలు కూడా వెనకాడతారు. కానీ దక్షిణాదిలో ఈ తరం నటులు నటనా ప్రాధాన్యం కలిగిన పాత్రలకు ప్రాధాన్యం ఇస్తున్నారు. ఏక కాలంలో హీరోగా .. విలన్‌గా మెప్పిస్తున్న తమిళ నటుడు విజయ్ సేతుపతి 'సూపర్ డీలక్స్'లో ట్రాన్స్‌జెండర్ పాత్రలో నటించటం గొప్ప విషయమే కదా. అలాగే మలయాళంలో దుల్కర్ సల్మాన్ 'కురుప్'లో క్రిమినల్ పాత్రను పోషించాడు. 37 ఏళ్లుగా కేరళ పోలీసులకు తప్పించుకు తిరుగుతున్న సుకుమార్ కురుప్ జీవిత కథ ఆధారంగా ఈ సినిమా రూపొందింది. బాలీవుడ్ నిర్మాణ సంస్థలు ఇప్పటికీ పాత ఫార్ములానే నమ్ముకుని సినామాలు తీస్తున్నారు. ఫక్త్ ఎంటర్టెయిన్మెంట్ మసాలా కథలే కనక వర్షం కురిపిస్తాయని వారి నమ్మకం. కథా పరంగా క్రియేటివీ పరంగా దక్షిణాది చిత్రాలు ఏనాడో బాలీవుడ్‌ను దాటేశాయి. ఇప్పుడు అవి హిందీ సినిమాల రేంజ్‌ని మించి బాక్సాఫీస్‌ని కొల్లగొడుతున్నాయి. దక్షిణాది సినిమాలపై సూపర్‌స్టార్ వర్షిప్ అనే ముద్ర ఉండేది. ఐతే, కొన్నేళ్లుగా ఆ ముద్ర క్రమంగా చెరిగిపోతోంది. టీవీ ఛానళ్లు దక్షిణాది సినిమాలకు ఉత్తరాధి భాషలలోకి డబ్ చేసి ప్రసారం చేస్తున్నాయి. అలాగే ఆన్‌లైన్‌లో సబ్‌టైటిల్స్ వేసి చూపించటం కూడా ఈ మార్పుకు ఒక కారణం. దక్షిణాది సినిమాలు ప్రాంతీయంగానే గాక దేశ విదేశాలలలో భారీ వసూళ్లు రాబడుతున్నాయి. ఇది హిందీ పరిశ్రమకు ప్రేరణ ఇస్తోంది. ఏదేమైనా, వేగంగా పెరుగుతున్న ఓటీటీ సంస్కృతి రాబోవు రోజులలో భారతీయ సినిమా స్వరూపాన్నే మార్చనుంది అన్నది మాత్రం నిజం

## పంజాబ్ పోల్స్ కు కాంగ్రెస్ రెడీ...


న్యూఢిల్లీ, డిసెంబర్ 28, : వచ్చే ఏడాది పంజాబ్‌లో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి. ఈ ఎన్నికలకు కాంగ్రెస్ సన్నాహాలు ముమ్మరం చేసింది. రాహుల్ గాంధీ జనవరి 3 నుంచి పంజాబ్‌లో ప్రచారం ప్రారంభించబోతున్నారని పార్టీ వర్గాలు వెల్లడించాయి. కాబోయే ముఖ్యమంత్రి ఎవరనేదీ లేకుండానే పంజాబ్ అసెంబ్లీ ఎన్నికల్లో అధికార కాంగ్రెస్ బరిలోకి దిగవచ్చని భావిస్తున్నారు. మాజీ ముఖ్యమంత్రి కెప్టెన్ అమరీందర్ సింగ్ కాంగ్రెస్‌కు గుడ్‌బై చెప్పిన వెంటనే సీఎంగా చరణ్‌జిత్ చన్నీ బాధ్యతలు చేపట్టారు. 2022 ఎన్నికల్లో చరణ్‌జిత్ చన్నీ నేతృత్వంలోనే పార్టీ ఎన్నికలకు వెళ్తుందని కాంగ్రెస్ హైకమాండ్ ప్రకటించింది. అయితే, పంజాబ్ పీసీసీ చీఫ్ నవజ్యోత్ సిద్ధూ వైఖరి దృష్ట్యా హైకమాండ్ తన నిర్ణయం నుంచి వెనక్కి తగ్గాల్సి వచ్చింది. పంజాబ్ ముఖ్యమంత్రి చరణ్ జిత్ సింగ్ చన్నీ, పంజాబ్ కాంగ్రెస్ చీఫ్ నవజ్యోత్ సింగ్ సిద్ధూ ఈ నెలలో రాహుల్ గాంధీతో సమావేశమయ్యారు. రాహుల్‌తో సమావేశమయ్యేందుకు చన్నీ, సిద్ధూ ఆయన నివాసానికి చేరుకున్నారు. ముగ్గురు నేతల మధ్య జరుగుతున్న ఈ సమావేశంలో వచ్చే ఏడాది పంజాబ్‌లో జరగనున్న అసెంబ్లీ ఎన్నికల సన్నాహకాలపై చర్చనీయాంశమైనట్లు విశ్వసనీయ వర్గాల సమాచారం. అంతకుముందు కాంగ్రెస్ ఎంపీ ప్రతాప్ సింగ్ బజ్వా పార్లమెంట్ సెంట్రల్ హాల్‌లో రాహుల్ గాంధీని కలిశారు. 2017 పంజాబ్ అసెంబ్లీ ఎన్నికలలో, కాంగ్రెస్ 77 సీట్లు గెలుచుకోవడం ద్వారా రాష్ట్రంలో సంపూర్ణ మెజారిటీని సాధించింది. 10 సంవత్సరాల తర్వాత ాంఅ ఃఏఖ ప్రభుత్వాన్ని గద్దె దించింది. 117 స్థానాలున్న పంజాబ్ అసెంబ్లీలో ఆమ్ ఆద్మీ పార్టీ 20 సీట్లు గెలుచుకుని రెండో అతిపెద్ద పార్టీగా అవతరించింది. శిరోమణి అకాలీదళ్ (ఎస్ఏడీ) 15 సీట్లు మాత్రమే గెలుచుకోగా, బీజేపీకి 3 సీట్లు వచ్చాయి. ఓట్ల శాతం గురించి చెప్పాలంటే, కాంగ్రెస్ పార్టీకి 38.5 శాతం ఓట్లు రాగా, అకాలీదళ్‌కు 25.3 శాతం ఓట్లు వచ్చాయి. అకాలీదళ్ కంటే ఆమ్ ఆద్మీ పార్టీ ఓట్ల శాతం తక్కువగా ఉంది. అయితే సీట్ల పరంగా ఆప్ లాభపడింది. అకాలీ కంటే ఐదు సీట్లు ఎక్కువ వచ్చాయి. రాష్ట్రంలో భారతీయ జనతా పార్టీకి ఐదు శాతం ఓట్లు మాత్రమే వచ్చాయి.

## రాజకీయ నేతలు అవినీతి చేస్తే తప్పేం కాదు: బీజేపీ ఎంపీ సంచలన వ్యాఖ్యలు

భోపాల్: రాజకీయ నేతలు అవినీతి చేస్తే తప్పేం కాదని భారతీయ జనతా పార్టీకి చెందిన ఎంపీ జనార్ధన్ మిశ్రా సంచలన వ్యాఖ్యలు చేశారు. అయితే ఆ అవినీకి కొంత పరిధి ఉంటుందంటూ ఆయన చెప్పుకురావడం గమనార్హం. గడిచిన ఎన్నికల్లో చేసిన ఖర్చు, వచ్చే ఎన్నికల్లో చేయాల్సిన ఖర్చులతో పాటు మరికొంత ఖర్చును లెక్కిస్తూ ఇంత వరకు అవినీతి చేయొచ్చంటూ బహిరంగ సభలోనే ఆయన వ్యాఖ్యానించారు. సదరు ఎంపీ వ్యాఖ్యలకు సంబంధించిన వీడియో ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. మధ్యప్రదేశ్‌లోని రెవా లోక్‌సభ స్థానం నుంచి పార్లమెంట్‌కు ఎన్నికైన భారతీయ జనతా పార్టీ ఎంపీ జనార్ధన్ మిశ్రా.. ఈ నెల 27న అదే జిల్లాలో నిర్వహించిన ఓ కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం స్థానిక నేతలపై వచ్చే అవినీతి గురించి ఆయన స్పందిస్తూ "సర్పంచ్ 15 లక్షల రూపాయల అవినీతికి పాల్పడ్డాడని ప్రజలు ఆరోపిస్తున్నారు. నేను సరదాగా చెప్తున్నాను. 15 లక్షల రూపాయల వరకు అవినీతి చేస్తే మా దగ్గరికి వచ్చి ఫిర్యాదు చేయాల్సిన అవసరం లేదు. అంతకు మించి అవినీతికి పాల్పడితే మా వద్దకు రండి. ఎందుకు చెప్తున్నానంటే.. గత ఎన్నికల్లో 7 లక్షల రూపాయలు ఖర్చు అయ్యాయి. వచ్చే ఎన్నికలకు మరో 7 లక్షలు కావాలి. ద్రవ్యోల్బణం పెరిగితే ఇంకో లక్ష పెరగొచ్చు" అని జనార్ధన్ అన్నారు. జనార్ధన్ ఇలాంటి వ్యాఖ్యలు చేయడం ఇది కొత్త కాదు.. ఆయన గతంలో కూడా ఇలాంటి వ్యాఖ్యలు చేశారు.

## ఆర్బీఐ ఆదేశాలను పట్టించుకోని... బ్యాంకులు

హైదరాబాద్, డిసెంబర్ 28, :లాక్‌డౌన్ విధింపు కాలంలో టర్మ్ లోన్లు, క్రెడిట్ కార్డు చెల్లింపులు చెల్లించకపోయినా సిబిల్ స్కోరు మీద ప్రభావం చూపదని, మూడు నెలల తర్వాత పెండింగ్ బిల్లులు చెల్లించొచ్చని ఆర్బీఐ సూచించింది. అయితే క్రెడిట్ సంస్థలు మాత్రం ఈ సూచనలకు విరుద్ధంగా వినియోగదారులకు సంక్షిప్త సందేశాలు పంపిస్తున్నాయి. క్రెడిట్ కార్డు బిల్లులు చెల్లించకపోతే ఆ ప్రభావం సిబిల్ స్కోరు మీద పడుతుందని ఆ సంక్షిప్త సందేశాల సారాంశం. బ్యాంకులు, క్రెడిట్ కార్డు సంస్థలు.. వ్యక్తిగత బ్యాంకింగ్, బ్యాంక్ స్టేట్మెంట్స్, సిబిల్ స్కోరు ఆధారంగా వివిధ రకాల లోన్లు, క్రెడిట్ కార్డులు మంజూరు చేస్తాయి. కరోనా నివారణలో భాగంగా లాక్‌డౌన్ విధించడంతో ఆర్థిక కార్యకలాపాలకు ఇబ్బంది తలెత్తే అవకాశం ఉండటంతో ఆర్బీఐ స్పందించి.. బ్యాంక్, క్రెడిట్ వినియోగదారులకు సంబంధించి పలు మార్గనిర్దేశకాలు జారీ చేసింది. మార్చి 1 నుంచి మే 31 వరకు మారటోరియం విధించింది. ఈ కాలంలో ఈఎంఐలు, క్రెడిట్ కార్డు చెల్లింపుల నుంచి వినియొాగదాారులకు మినహాయింపునిచ్చింది. అయితే టర్మ్ కాలం లేదా ఈఎంఐ మొత్తాన్ని పెంచేందుకు బ్యాంకులకు అవకాశం కల్పించింది. క్రెడిట్ కార్డు బిల్లులకు కూడా ఈ మినహాయింపునిచ్చింది. క్రెడిట్ కార్డు పెండింగ్ బిల్లులకు ఈ మారటోరియం కాలానికి కూడా ఊరట కల్పించింది. మారటోరియం ముగిసిన తర్వాత చెల్లించిన కూడా సిబిల్ స్కోరు మీద ఎలాంటి ప్రభావం చూపదని ఆర్బీఐ పేర్కొంది. అయితే కొన్ని కంపెనీలు మాత్రం మారటోరియం కాలంలో క్రెడిట్ కార్డు చెల్లింపులు చేయకుంటే సిబిల్ స్కోర్ మీద ప్రభావం చూపుతుందనే అర్థమొచ్చేలా కస్టమర్లకు సమాచారమిస్తున్నాయి. దీంతో లాక్‌డౌన్ కాలంలో ఉద్యోగాలు, వ్యాపారులు నడవక ఇబ్బందులు పడుతుంటే పెండింగ్ బిల్లులు ఎలా చెల్లించాలని వినియోగదారులు తలలు పట్టుకుంటున్నారు. మారటోరియం కాలంలో రిజర్వ్ మనీ ఉన్నవారు చెల్లించాలనుకుంటే చెల్లించవచ్చు. అయితే కచ్చితంగా చెల్లించాలని నిబంధనమే లేదు. చెల్లింపులు జరపకుంటే.. ఆ ప్రభావం క్రెడిట్ స్కోర్ మీద పడుతుందని చెబుతూ కొన్ని బ్యాంకులు, క్రెడిట్, ఎన్‌బీఎఫ్‌సీ సంస్థలు తమ వినియోగదారులకు సమాచారాన్ని అందిస్తున్నాయి. హెచ్ఎస్‌బీసీ, సిటీ క్యాష్ బ్యాక్,




ఐఏసీ ప్లాటినం, హెచ్‌డీఎఫ్‌సీ, యాత్ర ఎస్బీఐ, ఇండస్ బ్యాంకు తదితర కార్డులు టాప్ టెన్ జాబితాలో ఉన్నాయి. దేశవ్యాప్తంగా 5 కోట్ల 17 లక్షల క్రెడిట్ కార్డుల ఉన్నట్టు తాజాగా ఆర్బీఐ అంచనా వేసింది. వీరందరికి ఈ మూడు నెలల కాలానికి చెల్లింపుల నుంచి మినహాయింపునిచ్చారు. అయితే క్రెడిట్ సంస్థలు మాత్రం బిల్లు చెల్లించాలని కస్టమర్లకు సూచిస్తున్నాయి. కాగా, లాక్‌డౌన్ కాలంలో ఆదాయం లేక ఇబ్బంది పడుతున్నామని, ఆర్బీఐ ఇచ్చిన ఆదేశాలను అమలు చేయాలని క్రెడిట్ కార్డు వినియోగదారులు కోరుతున్నార రెండేండ్ల నుంచి టాటా కేపిటల్ క్రెడిట్ కార్డు వాడుతున్నాను. ప్రతీ నెల కరెక్టుగా బిల్లు చెల్లిస్తున్నాను. ఒక్క మార్చి నెల మాత్రమే పెండింగులో ఉంది. ప్రస్తుతం జీతం కూడా రావడం లేదు. మారటోరియంలో ఏప్రిల్, మే మాత్రమే నాకు వర్తిస్తుంది. ఆఫీస్ మొదలయ్యాక రెండు నెలల బిల్లు ఒకేసారి చెల్లిస్తాను. ఆర్బీఐ కూడా మినహాయింపునిచ్చింది. ఏప్రిల్ బిల్లు రూ. 5 వేల వరకు వచ్చింది. ఈ నెల 25న చెల్లించాలి. ఈ నెల ఎలాగూ కార్డు వాడే పరిస్థితి లేదు. బ్యాంకులే అర్థం చేసుకుని మా సిబిల్ స్కోరు మీద రిమార్కులు ఇవ్వకూడదు. మారటోరియం కాలానికి సంబంధించి క్రెడిట్ చెల్లింపులపై స్వీయ నిర్ణయాధికారాన్ని ఆర్బీఐ.. బ్యాంకులకే అప్పజెప్పింది. వినియోగదారులు వారి ఆర్థిక వనరుల ఆధారంగా చెల్లింపులు చేయాలా వద్దా అనేది నిర్ధారించుకోవచ్చు. అందుబాటులో ఉన్న సమాచారం ప్రకారం.. సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, ఐడీబీఐ, యూకో బ్యాంక్, పంజాబ్ ఇండ్, రెప్కో హోం ఫైనాన్స్, బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆటోమేటిక్‌గా తమ వినియోగదారులకు ఈ ప్రయోజనాన్ని అందిస్తున్నాయి. వినియోగదారులు చెల్లింపులు జరపాలంటే బ్యాంకులను సంప్రదించాల్సి ఉంటుంది. ఎస్బీఐ, హెచ్‌డీఎఫ్‌సీ, కొటక్ మహీంద్రా బ్యాంక్, బజాజ్ ఫైనాన్స్, పీఎన్బీ, ఇండియా బుల్స్ హౌజింగ్ సంస్థలు.. కస్టమర్లు కోరితేనే చెల్లింపుల నుంచి మినహాయిస్తున్నాయి. ఐసీఐసీఐ బ్యాంక్, బ్యాంక్ ఆఫ్ బరోడా, ఫెడరల్ బ్యాంకు, ఐడీఎఫ్‌సీ ఫస్ట్ బ్యాంకు వంటి సంస్థలు కస్టమర్ల లోన్ హిస్టరీ ఆధారంగా మినహాయింపునిస్తున్నాయి.

## టాటా అప్పగింతకు టైముందా..?

TATA


ముంబై, డిసెంబర్ 28, :టాటా సన్స్ యాజమాన్య అనుబంధ సంస్థ.. టేల్స్ ప్రైవేట్ లిమిటెడ్ ద్వారా ఎయిర్ ఇండియా లిమిటెడ్, ఎయిర్ ఇండియా ఎక్స్‌ప్రెస్ లిమిటెడ్ అదేవిధంగా ఎయిర్ ఇండియా ూయి ఎయిర్‌పోర్ట్ సర్వీసెస్ ప్రైవేట్ లిమిటెడ్‌లో వాటాల కొనుగోలుకు కాంపిటీషన్ కమిషన్ ఆఫ్ ఇండియా ఆమోదం తెలిపిన విషయం తెలిసిందే. అయితే ఎయిర్ ఇండియాను టాటా గ్రూప్ టేకోవర్ చేయడం జనవరి వరకు అంటే ఒక నెల ఆలస్యం అయ్యే అవకాశం కనిపిస్తోందని, ఇందుకు సంబంధించిన ప్రక్రియలు పూర్తి కావడానికి ఊహించినదానికంటే ఎక్కువ సమయం పట్టే అవకాశం ఉందని సోమవారం ఒక అధికారి తెలిపారు. ప్రతిపాదిత కలయికలో టేల్స్ ప్రైవేట్ లిమిటెడ్ ద్వారా ఎయిర్ ఇండియా లిమిటెడ్ (ఎయిర్ ఇండియా), ఎయిర్ ఇండియా ఎక్స్‌ప్రెస్ లిమిటెడ్ (ంఏచీఓ) 100 శాతం ఈక్విటీ షేర్ క్యాపిటల్, ఎయిర్ ఇండియా ూయి ఎయిర్‌పోర్ట్ సర్వీసెస్ ప్రైవేట్ లిమిటెడ్ (ంఘాయా) 50% ఈక్విటీ షేర్ క్యాపిటల్ ఉన్నాయి. ఆ సమయంలో డిసెంబర్ చివరి నాటికి టాటాలు రూ. 2,700 కోట్ల నగదు చెల్లించే లావాదేవీలను పూర్తి చేయాలని ప్రభుత్వం కోరింది. అయితే అప్పుల ఊబిలో కూరుకుపోయిన ఎయిర్‌లైన్స్ ఎయిర్ ఇండియాను కొనుగోలు చేసేందుకు టేల్స్ బిడ్‌ను గెలుచుకున్నట్లు కేంద్ర ప్రభుత్వం అక్టోబర్ 8న ప్రకటించింది. జాతీయ విమానయాన సంస్థ ఎయిర్ ఇండియాను 18,000 కోట్లకు విక్రయించేందుకు టాటా సన్స్‌తో అక్టోబర్ 25న ప్రభుత్వం వాటా కొనుగోలు ఒప్పందం కుదుర్చుకుంది.

## చిట్టిబాబు వ్యాఖ్యలకు మురిసి పోయిన రామలక్ష్మి



రాజమౌళి దర్శకత్వంలో రూపొందిన ఆర్ ఆర్ ఆర్ సినిమా విడుదలకు సిద్ధం అయ్యింది. హీరోలు రామ్ చరణ్ మరియు ఎన్టీఆర్ లు కంటిన్యూస్ గా రెండు మూడు వారాలుగా ప్రమోషనల్ కార్యక్రమాల్లో పాల్గొంటున్నారు. దేశ వ్యాప్తంగా కూడా చిత్ర యూనిట్ సభ్యులు చక్కర్లు కొడుతూ సినిమాను ప్రమోట్ చేస్తున్నారు. సినిమా విడుదలకు తేదీ దగ్గర పడుతున్న సమయంలో మరింతగా స్పీడ్ పెంచారు. జాతీయ స్థాయి మీడియా సంస్థల నుండి మొదలుకుని ప్రాంతీయ భాష న్యూస్ ఛానెల్స్ మరియు ఇతర మీడియా సంస్థల వరకు అందరికి కూడా ఈ హీరోలు ఇద్దరు ఇంటర్వ్యూలు ఇస్తున్నారు. వీరు మీడియా ముందుకు వచ్చి చాలా కాలం అయ్యింది. దాంతో వీరు చేస్తున్న వ్యాఖ్యలు మరియు వీరు మాట్లాడుతున్న మాటలు రెగ్యులర్ గా సోషల్ మీడియాలో వైరల్ అవుతూనే ఉన్నాయి.తాజాగా ఒక ఇంటర్వ్యూలో రామ్ చరణ్ ను యాంకర్ ప్రశ్నిస్తూ సమంత గురించి చెప్పాలనడంతో ఇంట్రెస్టింగ్ కామెంట్స్ చేశాడు. సమంత కమ్ బ్యాక్.. బిగ్గర్.. మరియు స్ట్రాంగర్ అన్నాడు. సమంత గురించి ఈ మూడు పదాలు రామ్ చరణ్ చెప్పడం ఆమె అభిమానులకు ఆనందం కలిగించింది. చరణ్ చెప్పింది మూడు పదాలే అయినా కూడా ఆమె ను పూర్తిగా ఆ మూడు పదాలు వ్యక్తం చేస్తున్నాయని విశ్లేషకులు చెబుతున్నారు. సమంత గురించి చరణ్ చెప్పిన ఆ విషయాలను సోషల్ మీడియాలో అభిమానులు షేర్ చేస్తున్నారు. ఒకరు షేర్ చేసిన వీడియోకు సమంత రియాక్ట్ అయ్యింది. రామ్ చరణ్ కామెంట్స్ కు మాటలు లేవు అన్నట్లుగా కేవలం లవ్ ఈమోజీలను షేర్ చేసి తన ఆనందంను వ్యక్తం చేసింది. ఒక స్టార్ హీరో నుండి అలాంటి ప్రశంసలు అందుకోవడం చిన్న విషయం ఏమీ కాదు. సమంత ఆ విషయంలో చాలా లక్కీ అన్నట్లుగా అభిమానులు కామెంట్స్ చేస్తున్నారు. రామ్ చరణ్ మరియు సమంతలు కలిసి రంగ స్థలం చిత్రంలో చిట్టిబాబు మరియు రామలక్ష్ములు గా నటించి మెప్పించిన విషయం తెల్సిందే. ఆ పాత్రల్లో వారు జీవించేసిన తీరు అందరికి నచ్చేసింది. అందుకే రంగస్థలం సినిమా భారీ బ్లాక్ బస్టర్ విజయాన్ని సొంతం చేసుకున్న విషయం తెల్సిందే. రంగస్థలం సినిమా తర్వాత మళ్లీ వీరిద్దరి కాంబోలో సినిమా రావాలని అభిమానులు కోరుకుంటున్నారు. సమంత సెకండ్ ఇన్నింగ్స్ మొదలు పెట్టింది కనుక చరణ్ సినిమా లో ఆమె కనిపిస్తుందేమో చూడాలి.

## వైరల్ అవుతున్న "భీమ్లా నాయక్" మాస్ కటౌట్.!



మన టాలీవుడ్ నుంచి మాస్ ఆడియెన్స్ లో భారీ లెవెల్ ఫాలోయింగ్ ఉన్న మాస్ హీరోస్ లో గాడ్ ఆఫ్ మాసెస్ పవన్ కళ్యాణ్ కి కూడా ఒక ప్రత్యేక స్థానం ఉంది. ఎలాంటి సినిమా అయినా కూడా భారీ డే 1 పెట్టడం పవన్ కి చెల్లుతుంది. మరి ఇప్పుడు అలాంటి పవన్ ఒక అవుట్ అండ్ అవుట్ మాస్ సినిమా చేస్తే ఎలా ఉంటుందో తన లేటెస్ట్ సినిమా "భీమ్లా నాయక్" తో చూడబోతున్నామని మేకర్స్ అంటున్నారు.రానా దగ్గుబాటి మరో ప్రధాన పాత్రలో నటిస్తున్న ఈ చిత్రాన్ని దర్శకుడు సాగర్ కె చంద్ర తెరకెక్కిస్తున్నాడు. అయితే ఈ సినిమా ఆల్రెడీ ఫిబ్రవరికి వాయిదా పడిన సంగతి అందరికీ తెలిసిందే. మరి ఈ గ్యాప్ లో భీమ్లా నాయక్ నుంచి పవన్ ది ఓ మాస్ పోస్టర్ బయటకొచ్చి వైరల్ అవుతుంది. భీమ్లా నుంచి ఓ ఫైట్ సీక్వెన్స్ లో ఫొటోలా కనిపిస్తుంది. పవన్ లుంగీ గెటప్ లో గ్లింప్స్ లోని కాస్ట్యూమ్ తో కనిపిస్తున్నాడు. దీనితో ఇప్పుడు సోషల్ మీడియాలో ఈ భీమ్లా నాయక్ మాస్ కటౌట్ మంచి వైరల్ అవుతుంది.

## న్యూ ఇయర్ కూడా మనదే..!




నేచురల్ స్టార్ నాని హీరోగా రాహుల్ సాంకృత్యన్ దర్శకత్వంలో తెరకెక్కిన తాజా చిత్రం "శ్యామ్ సింగ రాయ్". ఇందులో నాని రెండు పాత్రల్లో కనిపించగా.. సాయి పల్లవి - కృతి శెట్టి - మడోన్నా సెబాస్టియన్ హీరోయిన్లుగా నటించారు. క్రిస్మస్ సందర్భంగా డిసెంబర్ 24న తెలుగు తమిళ కన్నడ మలయాళ భాషల్లో విడుదలైన ఈ సినిమా విజయవంతంగా ప్రదర్శించబడుతోంది. ఈ నేపథ్యంలో చిత్ర బృందం సోమవారం హైదరాబాద్ లో సక్సెస్ మీట్ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా నాని మాట్లాడుతూ.. "ఎవరూ సినిమా బాగుందని ఒకటి రెండు లైన్లలో చెప్పడం లేదు. ఆల్మోస్ట్ ఒక లవ్ లెటర్ లా రాస్తున్నారు. అదే మాకు పెద్ద సక్సెస్ అనిపిస్తోంది. ఎలాంటి పరిస్థితులు ఉన్నా మంచి చిత్రాలను ఆదరిస్తామని ప్రేక్షకులు ప్రతిసారీ నిరూపిస్తూనే ఉన్నారు. మీ ప్రోత్సాహం ఉన్నంత వరకు మీకు మంచి సినిమాలు ఇచ్చేందుకు ప్రాణం పెట్టి పని చేస్తాం. వరుస విజయాలతో ఈ నెల అంతా బాగుంది. అన్ని పరిస్థితులు చక్కబడి ఈ ఊపు ఇలాగే మరో పదేళ్లు కొనసాగాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నా" అని అన్నారు."శ్యామ్ సింగ రాయ్ బేసిక్ ఐడియాలో చాలా బలం ఉండాలి. అలాంటి కథను అందించిన సత్యదేవ్ గారికి థ్యాంక్స్. మీరు ఇలాంటి సమయం కోసం ఎన్నేళ్ల నుంచి ఎదురుచూస్తున్నారో నాకు తెలుసు. ఈ సినిమాతో అది నిజమైనందుకు సంతోషంగా ఉంది. నాకు 'సఖి' లాంటి ఎప్పటికీ నిలిచిపోయే క్లాసిక్ లవ్ స్టోరీ చేయాలనే కోరిక ఉండేది. ఇప్పుడు ఈ చిత్రంతో ఆ కోరిక తీరింది. టీం అందరికీ.. తెలుగు ప్రేక్షకులందరికీ కృతజ్ఞతలు. ఈ న్యూ ఇయర్ కూడా మనదే" అని నాని ధీమా వ్యక్తం చేశారు.కాగా 'శ్యామ్ సింగరాయ్' చిత్రాన్ని నిహారిక ఎంటర్టైన్మెంట్స్ బ్యానర్ పై వెంకట్ బోయనపల్లి నిర్మించారు. ఇందులో రాహుల్ రవీంద్రన్ - మురళీ శర్మ - అభినవ్ గోమటం - జిషు సేన్ గుప్తా - లీలా శాంసన్ - మనీష్ వాద్వా - బరున్ చందా కీలక పాత్రలు పోషించారు. మిక్కీ జె మేయర్ ఈ చిత్రానికి సంగీతం సమకూర్చారు. సాను జాన్ వర్గీస్ సినిమాటోగ్రఫీ అందించగా.. అవినాష్ కొల్లా ప్రొడక్షన్ డిజైనింగ్ చేశారు. నవీన్ నూలి ఎడిటింగ్ వర్క్ చేశారు.

## మిస్ శెట్టి...తగ్గేది లే...?



అనుష్క. అద్భుతమైన నటీమణి. ఎన్నో సక్సెస్ ఫుల్ మూవీస్ తో సత్తా చాటుకుంది. లేడీ ఓరియెంటెడ్ మూవీస్ కనుమరుగు అయిన తరుణంలో అనుష్క ఆ లోటు తీర్చేశారు. అరుంధతి రుద్రమదేవి భాగమతి వీటిలో ఎక్కడా అసలు అనుష్క కనిపించదు క్యారక్టర్లే కళ్ల ముందు కదలాడుతాయి.అలాగని అనుష్క వాటికే పరిమితం కాలేదు. విక్రమార్కుడు లో రవితేజాతో చేసిన రోమాన్స్ యూత్ గుండెలను గిలిగింతలు పెట్టాయి. మిర్చీలో ప్రభాస్ అనుష్క మధ్య కెమిస్ట్రీ బాగా పండిన తీరుని ఎవరైనా మరచిపోగలరా. అనుష్క బాహుబలిలో ప్రభాస్ రానాతో పాటు మరో పిల్లర్ గా నిలిచి ఆ మూవీ బ్లాక్ బస్టర్ కావడానికి తన వంతు పాత్ర పోషించారనే చెప్పాలి.అయితే అనుష్క 2015లో చేసిన జీరో సైజ్ మూవీ లో పాత్ర కోసం వెయిట్ ని బాగా పెంచేశారు. ఆ మూవీ ఫట్ అయింది కానీ హెవీ వెయిట్ తో అనుష్క కెరీర్ కూడా డల్ అయింది. ఈ మధ్యలో ఆమె ఎంత తగ్గాలని చూసినా తగ్గేదేలే అంటోంది వెయిట్. దాంతో అనుష్క సినిమాలు కూడా తగ్గాయి.రెండేళ్ల క్రితం ఆమె చేసిన నిశ్శబ్దం మూవీలోనూ వెయిట్ అలాగే ఉంది. దాని తరువాత మరే మూవీ చేయలేదు. అయితే యూవీ క్రియేషన్స్ బ్యానర్ మీద యంగ్ హీరో నవీన్ పోలిశెట్టితో అనుష్క హీరోయిన్ గా మిస్ శెట్టి మిష్టర్ పోలిశెట్టి మూవీ త్వరలో సెట్స్ మీదకు వెళ్లనుంది. ఈ మూవీకి సంబంధించి లేటెస్ట్ అప్ డేట్ నవీన్ పోలిశెట్టి బర్త్ డే వేళ యూవీ క్రియేషన్స్ నుంచి వచ్చింది.దాంతో కొత్త ఏడాది ఈ సినిమా షూటింగ్ ఉంటుందని అంటున్నారు. మరి ఈ మూవీ కథాంశం బట్టి చూస్తే నలభయ్యేళ్ల ఒక ఆమెతో పాతికేళ్ళ యువకుడు సాగించే ప్రేమాయణంగా ఉంటుందిట. మరి ఈ మూవీలో అనుష్క ఎలా కనిపిస్తుంది అన్నదే ఇపుడు ఫ్యాన్స్ లో చర్చగా ఉంది. అనుష్క వెయిట్ లాస్ అయిందా. ఇదివరకులా సన్నగా కనిపిస్తుందా అన్న ఆలోచనల్లో ఫ్యాన్స్ ఉన్నారు.అయితే ఈ మూవీ కథ ప్రకారం చూస్తే అనుష్క తన ఒరిజినల్ గెటప్ తో ఉన్నా సరిపోతుంది అంటున్నారు. అంటే అనుష్క లావుగా కనిపిస్తూనే కామెడీ టచ్ తో హీరో తో రోమాన్స్ పండిస్తుంది అని చెబుతున్నారు. మొత్తానికి చూస్తే అనుష్క రెండేళ్ళుగా మూవీ చేయలేదు. దాంతో ఆమె కొత్త సినిమా మీద నాచురల్ గానే ఆసక్తి అంతటా ఉంది. పైగా నవీన్ జాతి రత్నాలు తరువాత హీరోగా తన మార్క్ చాటుకున్నాడు. ఈ ఇద్దరినీ పెట్టి సినిమా తీస్తున్నది యూవీ క్రియేషన్స్ బ్యానర్. దాంతో అంచనాలు అయితే బాగానే ఉన్నాయి. అయితే అనుష్క ఏ మాత్రం వెయిట్ లాస్ అయి ఈ మూవీలో కనిపిస్తే యమ క్రేజ్ రావడం ఖాయం. అంతే కాదు ఆమెకు మరిన్ని అవకాశాలు కూడా రావడం ష్యూర్ అంటున్నారు. అనుష్క అయితే వెయిట్ లాస్ మీదనే ఇన్నాళ్ళూ దృష్టి పెట్టిందని దాంతో సరికొత్త అనుష్కనే ఈ మూవీలో చూస్తారని సినీ వర్గాల టాక్. సో అనుష్క ఎలా ఉ ఒటుందో అన్న ఆలోచనలే ఈ మూవీకి అసలైన క్రేజ్ అంటున్నారు.

## 'పుష్ప' పార్టీలో టాలీవుడ్ డైరెక్టర్స్..!




కరోనా సెకండ్ వేవ్ తర్వాత టాలీవుడ్ నుంచి విడుదలైన పాన్ ఇండియా మూవీ "పుష్ప: ది రైజ్". అల్లు అర్జున్ - డైరెక్టర్ సుకుమార్ కాంబినేషన్ లో ఈ యాక్షన్ ఎంటర్టైనర్ తెరకెక్కింది. డిసెంబర్ 17న ప్రేక్షకుల ముందుకు వచ్చిన ఈ సినిమా.. టాక్ తో సంబంధం లేకుండా భారీ వసూళ్లు రాబట్టింది. మొదటి వారంలోనే రెండు వందల కోట్ల క్లబ్ లో చేరింది. పది రోజుల్లోనే కేరళలో పది కోట్లకు పైగా గ్రాస్ సాధించిన ఈ మూవీ.. బాలీవుడ్ లో ఇప్పటి వరకు 37 కోట్లకు పైగా కలెక్షన్స్ అందుకుంది. ఈ నేపథ్యంలో మేకర్స్ గ్రాండ్ గా సక్సెస్ సెలబ్రేషన్స్ చేస్తున్నారు.ఇప్పటికే తిరుపతిలో గ్రాండ్ గా 'పుష్ప' మాసివ్ సక్సెస్ పార్టీ జరిగింది. ఈ క్రమంలో సోమవారం హైదరాబాద్ లో మరో పార్టీ చేసుకున్నారు. దీనికి చిత్ర బృందంతో పాటుగా తెలుగు చిత్ర పరిశ్రమలోని దర్శకులందరూ హాజరయ్యారు. రాఘవేంద్ర రావు - కొరటాల శివ - వంశీ పైడిపల్లి - సందీప్ రెడ్డి వంగా - శ్రీకాంత్ అడ్డాల - గోపీచంద్ మలినేని - రాధా కృష్ణ కుమార్ - శివ నిర్వాణ - ఇంద్రగంటి మోహనకృష్ణ - సంపత్ నంది - హను రాఘవపూడి - కిషోర్ తిరుమల - వక్కంతం వంశీ - అవసరాల శ్రీనివాస్ - బుచ్చిబాబు - రాహుల్ సంకృత్యాన్ - హసిత్ గోలి - మున్నా తదితరులు ఈ పార్టీలో సందడి చేశారు.టాలీవుడ్ లో నటీనటులు దర్శకుల మధ్య మంచి సాన్నిహిత్యం ఉంటుంది. సినిమాల విడుదల సమయంలో ఆహ్లాదకరమైన పోటీ ఉంటుంది. అందుకే తరచుగా అందరూ కలిసి సెలబ్రేషన్స్ లో పాల్గొంటూ ఉంటారు. ఇప్పుడు 'పుష్ప' పార్టీ వేదికగా ఇండస్ట్రీలో ఉన్న దర్శకులందరూ కలుసుకున్నారు. ఇంతటి ఘనవిజయం అందుకున్న చిత్ర బృందానికి అభినందనలు తెలిపారు. డైరెక్టర్ సుకుమార్ - హీరో అల్లు అర్జున్ - మైత్రీ-ముత్యంశెట్టి నిర్మాతలు వారిని సాదరంగా ఆహ్వానించి ఆతిథ్యం అందించారు. ఇకపోతే 'పుష్ప: ది రైజ్' సక్సెస్ పార్టీలో హీరోయిన్ రష్మిక మందన్నా స్పెషల్ అట్రాక్షన్ గా నిలిచింది. ఈ సినిమాలో నటించిన జగదీష్ - అనసూయ - సునీల్ - శత్రు కూడా హాజరయ్యారు. అలానే మ్యూజిక్ డైరెక్టర్ దేవిశ్రీప్రసాద్ - ఆస్కార్ విన్నర్ రసూల్ పోకుట్టి - ఫైట్ మాస్టర్ పీటర్ హెయిన్స్ - డ్యాన్స్ మాస్టర్లు జానీ - గణేష్ తదితరులు ఈ సెలబ్రేషన్స్ లో పాల్గొన్నారు. ప్రస్తుతం 'పుష్ప' పార్టీకి సంబంధించిన ఫోటోలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. అల్లు అర్జున్ సైతం ఈ మాసివ్ సెలబ్రేషన్స్ కు సంబంధించిన ఫోటోలను అభిమానులతో పంచుకున్నారు. 'పార్టీ లేదా పుష్పా?' అనే ప్రశ్నకు ఇదే సమాధానం.. తగ్గేదే లే అని బన్నీ పేర్కొన్నారు. అందులో అల్లు అర్జున్ ధరించిన 'తగ్గేదే లే' టీ షర్ట్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. కాగా శేషాచలం అడవుల్లో ఎర్రచందనం స్మగ్లింగ్ నేపథ్యంలో "పుష్ప" చిత్రాన్ని తెరకెక్కించారు. రెండో భాగాన్ని 'పుష్ప: ది రూల్' పేరుతో విడుదల చేయనున్నారు. ఫిబ్రవరిలో ఈ పాన్ ఇండియా ప్రాజెక్ట్ సెట్స్ మీదకు వెళ్లనుంది.

## ఇన్‌స్టాలో రౌడీ హీరో సరికొత్త ట్రాక్ రికార్డ్..!



టాలీవుడ్ రౌడీ హీరో విజయ్ దేవరకొండకు ఉన్న ఫ్యాన్ ఫాలోయంగ్ గురుంచి పెద్దగా చెప్పాల్సిన పనిలేదు. సోషల్ మీడియా మాధ్యమాల్లోనూ ఈ రౌడీ హీరోకి విపరీతమైన క్రేజ్ ఉంది. తాజాగా విజయ్ ఇన్‌స్టాగ్రామ్ ఫాలోవర్స్ సంఖ్య ఏకంగా 14 మిలియన్లకు చేరుకుంది. అయితే టాలీవుడ్‌లో అల్లు అర్జున్ తర్వాత ఇన్‌స్టాలో అత్యధిక ఫాలోవర్లు కలిగిన హీరోగా విజయ్ నిలిచాడు. దీంతో విజయ్ ఫ్యాన్స్ #14MRowdiesOnInsta% పేరుతో తెగ ట్రెండ్ చేస్తున్నారు. అయితే 2018 మార్చి 7న విజయ్ ఇన్‌స్టాగ్రామ్ అకౌంట్ స్టార్ట్ చేశాడు. ఇదిలా ఉండగా విజయ్ ప్రస్తుతం డాషింగ్ డైరెక్టర్ పూరి జగన్నాథ్ దర్శకత్వంలో ఫైటర్ అనే సినిమా చేస్తున్నాడు. ఈ మూవీలో ఆయన ప్రొఫెషనల్ ఫైటర్ గా కనిపించనున్నారు. ఈ సినిమా ద్వారా విజయ్ బాలీవుడ్ ఎంట్రీ ఇస్తుండగా, ఆయన సరసన అనన్య పాండే హీరోయిన్‌గా నటిస్తుంది.

"మీరు గౌరవప్రదమైన జీవితాన్ని గడపాలని విశ్వసిస్తే,
మీరు స్వయం సహాయాన్ని నమ్ముతారు, ఇది ఉత్తమ సహాయం"
—డా. బి.ఆర్ అంబేద్కర్

BUSINESS v/s SOCIAL ENGINEERING

20 సంవత్సరాల స్నేహ గ్రూప్ ప్రయాణం
వ్యాపారమా...? లేక సోషల్ ఇంజనీరింగా...?
మీరే చెప్పండి

BUSSINESS
వ్యాపారం ద్వారా వచ్చే లాభాన్ని పార్టనర్స్ గాని డైరెక్టర్ గాని పంచుకోవడాటాన్ని వ్యాపారం (Bussiness) అంటారు

SOCIAL ENGINEERING
సంస్థ నిర్వహించే కార్యకలాపాల ద్వార వచ్చే లాభం మొత్తాన్ని సొసైటీ మార్పు కోసం,పేదల అభివృద్ధి కొరకు,విద్య కొరకు,ఆరోగ్యం కొరకు వాడటాన్ని సోషల్ ఇంజనీరింగ్ అంటారు.

స్నేహ చిట్స్ లో కంపెనీకి వచ్చే లాభాల్ని చారిటీకి వాడుతూ మెంబర్స్‌కు వచ్చే లాభాలను మెంబర్స్‌కు ఇవ్వటం జరుగుతోంది

అంబేడ్కర్ టీవీ నిర్మాణం కొరకు స్నేహ మ్యాక్స్ లో డిపాజిట్ చేసిన వారందరికీ వారికి ఇవ్వాల్సిన ఇంట్రెస్ట్ (Interest)ని ఇచ్చి ఆ డిపాజిట్ ని మెంబర్స్‌కి అప్పులు ఇచ్చి,రికవర్ చేసిన తర్వాత వచ్చే లాభాల మొత్తాన్ని అంబేద్కర్ టీవీ ఛానల్‌ను నడపటానికి వినియోగిస్తున్నాం

అంబేడ్కర్ టీవీ ఛానల్
సామాజిక దృక్పథంతో బహుజన సమస్యలను వెలుగులోకి తీసుకువచ్చి, తద్వారా పరిష్కారమార్గంలోకి తీసుకెళ్లడానికి ప్రయత్నం చేస్తుంది

మహిళలు సాధించిన పురోగతి స్థాయి ద్వారా నేను సమాజ పురోగతిని కొలుస్తాను.
— డా. బి.ఆర్ అంబేడ్కర్

జై పూలే జై భీమ్ జై బహుజన జై భారత్

Printed,Published & Owned by: Sajja Dhananjaya Sarath, Printing at : Unyted Publications, From H.no: #5+-61,-3, Rajendra Nagar, Seethampet, Visakhapatnam-16 ANDHRAPRADESH, India. Editor: Sajja Dhananjaya Sarath. RNI:APTEL/2008/25531,Permitted for posting under concession rates of postage, Postal Registration No. VJ/189/2017-19,Email.editor.prajapalana@gmail.com